## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, కృష్ణపక్షం; తిథి: విదియ (బుధవారం) ఉ.5.44 వరకు; నక్షత్రం: అశ్విని మ.12.31 వరకు; అమృతకాలం: లేదు; వర్జ్యం: ఉ.8.09 నుండి 9.54 వరకు, రా.10.51 నుండి తెల్లవారుజామున ఉ.12.35 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.32 నుండి 9.18 వరకు, రా.10.47 నుండి 11.37 వరకు; రాహుకాలం: మ.2.56 నుండి సా.4.23 వరకు; యమగండం: ఉ.9.07 నుండి 10.34 వరకు;

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!








సంపుటి:58 • సంచిక: 176 • మంగళవారం 15 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore


# చర్చలకు వేళాయె!





## రంగంలోకి కేకే

కార్మిక సంఘాల నేతలతో నేడు చర్చలు • విలీనంపై పరిశీలనకు హామీ... ఉన్నతస్థాయి కమిటీ? • మిగతా డిమాండ్లకు సానుకూలం • సమ్మె విరమించాలని కార్మిక సంఘాలను కోరిన కేశవరావు • సీఎం సూచనతోనే చొరవ తీసుకున్న తెరాస పార్లమెంటరీ పార్టీ నేత • హుటాహుటిన ఢిల్లీ నుంచి రాక

**కేకే ప్రతిపాదనను స్వాగతించిన ఆర్టీసీ జేఏసీ**

**చర్చలకు సీపీఐ, సీపీఎంలకు పిలుపు?**

**నేడు హైకోర్టులో ఆర్టీసీ సమ్మెపై విచారణ**

**పదవ రోజూ కొనసాగిన నిరసనలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో సమ్మెను ఆపేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలన్న డిమాండ్ మినహా కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న మిగతా కోరికలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరిపేందుకు తాను సముఖంగా ఉన్నానని తెరాసకు చెందిన రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు సోమవారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేశారు. కేశవరావు ప్రతిపాదనను ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ అశ్వత్థామ రెడ్డి స్వాగతించారు. ప్రభుత్వం తరఫున కార్మిక సంఘాల నేతలను చర్చలకు ఎవరు ఆహ్వానించినా తాము వెళతామని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కేశవరావు సోమవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో మంగళవారం ఉదయం వారి డిమాండ్లపై చర్చలు ప్రారంభించాలని కేశవరావు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కార్మిక సంఘాల నేతలతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

3వ పేజీలో...

## అంచనాలు తారుమారు

# పత్తి బేళ్లు కొనుగోళ్లు.. ఎలా? ఎలా..?



(ఫైల్)

ముంచుకొస్తున్న పత్తి ముప్పు • ఇటు మార్కెటింగ్ శాఖకు, అటు రైతాంగానికి సవాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆందోళనకు గురిచేస్తున్న ఉత్పత్తి • 12.50 లక్షల హెక్టార్లు సాగైతే 47.50 లక్షల బేళ్ల ఉత్పత్తి • తెలంగాణలో ఉన్న కొనుగోళ్ల సామర్థ్యం ఆ మేరకే.. • ఈ ఏడాది సాగైన విస్తీర్ణం 18.59 లక్షల హెక్టార్లు • మార్కెట్‌కు 75 నుంచి 80 లక్షల బేళ్లు! • కొనుగోలు చేయలేమంటున్న యంత్రాంగం • అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన డిమాండ్ • ఫలితంగా క్షీణించిన ఎగుమతులు

**గతంకంటే సగమే కొంటాం: సీసీఐ**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశంలో అత్యధికంగా పత్తి పండించే రాష్ట్రాల్లో మహారాష్ట్ర, గుజరాత్ తర్వాతి స్థానంలో నిలిచే తెలంగాణాలో ఈ ఏడాది సంక్షోభ పరిస్థితులు తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎన్ని కోణాల్లో కొనుగోళ్లకు ప్రయత్నాలు చేస్తున్నా.. అంచనాకు దాదాపు రెండింతలు మార్కెట్లోకి వచ్చే పత్తిబేళ్ళపై ఇప్పటినుంచే ఆందోళన మొదలైంది. పత్తిసాగు రికార్డు స్థాయిలో విస్తరించిన నేపథ్యంలో ఈ పంటను ఎలా కొను గోలు చేయాలన్న ఆందోళన మార్కెటింగ్ శాఖ అధికారు లను వెంటాడుతోంది. అదే సమయంలో ఎకరాకు దాదాపు రూ.30వేలు దాటిన పెట్టుబడితో పత్తిని మార్కెట్లోకి తీసుకెళ్తే మద్దతు ధర వస్తుందో, లేదోనన్న ఆందోళన రైతాంగాన్ని కలవరపెడుతోంది. వారం, పది రోజుల్లో మార్కెట్‌లోకి రానున్న పత్తి కొనుగోళ్ళకు సంబంధించి మంత్రి నిరంజన్ రెడ్డితో పాటు ఉన్నతాధికారుల బృందం తమదైన శైలిలో ప్రయత్నాలు మొదలు పెట్టింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొనుగోళ్లలో 25శాతం తగ్గిస్తామని చెప్పడం, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సైతం పెద్దగా ఆసక్తి చూపకపోవడంలాంటి అనేక కారణాలు పత్తి సమస్యలు మరింత జఠిలం చేస్తున్నాయి. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యం మేరకు 12.50 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తేనే కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగే

3వ పేజీలో...

# కాశ్మీరీలకు పండగొచ్చింది



**40లక్షల మొబైల్ సర్వీసుల పునరుద్ధరణ**

**ప్రజల ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందం**

**ఇంకా అందుబాటులోకి రాని ఇంటర్నెట్**

**శ్రీనగర్:** కాశ్మీర్ వాసుల అజ్ఞాతవాసం ముగిసింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత విధించిన ఆంక్షలతో 70 రోజులకు పైగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా ఇళ్లకే పరిమితమైన ప్రజలకు ప్రభుత్వం చేసిన ప్రకటన కొండంత ధైర్యాన్నిచ్చింది. కాశ్మీర్‌లో మొబైల్ సేవలు పునరుద్ధరిస్తున్నారనేగానే అక్కడి ప్రజల మోహాల్లో ఆనందం వెల్లివిరిసింది. సోమవారం పోస్ట్‌పెయిడ్ మొబైల్ నెట్‌వర్క్ సేవలు పునరుద్ధరించడంతో తమ వాళ్ల బాగోగులు తెలుసుకోవాలన్న ఆరాటంతో ప్రతీ ఒక్కరూ మొబైల్ ఫోన్‌ల కోసం ఎగబడుతున్నారు. రోజుల తరబడి ఒకరితో ఒకరు మాట్లాడుకోలేని స్థితిలో తీవ్ర మనో వేదనకు గురైన వారు సైతం గట్టిగా ఊపిరి పీల్చుకున్నట్లుగా ఫోన్లు చేతబట్టుకుని.. ఆత్మీయులను పలకరిస్తున్నారు. సోమవారం నుంచి 40 లక్షల పోస్ట్ పెయిడ్ మొబైల్ ఫోన్ల సర్వీసులు పునరుద్ధరించగా.. 20 లక్షల ప్రీపెయిడ్ కనెక్షన్లు ఇంకా బ్లాక్‌లోనే ఉన్నాయి. ఈ ఏడాది

8వ పేజీలో...

## అర్థశాస్త్రం నోబెల్ దంపతులు

ప్రవాస భారతీయులకు విశిష్ట పురస్కారం అభిజిత్ బెనర్జీ, సతీమణి ఎస్తేర్‌లకు అవార్డు • వీరితో పంచుకున్న హార్వర్డ్ ప్రొఫెసర్ క్రెమర్ పేదరిక నిర్మూలన ప్రయోగాలకు గుర్తింపు



9



**పేదరికంపై అభిజిత్ శస్త్రం!**

4








**బెంగాల్ టైగర్‌కు బీసీసీఐ** 10

కార్యదర్శిగా జై షా

# పక్కా ప్రణాళికతో టౌన్‌షిప్‌లు



కొత్త పాలసీతో వన్నెచిన్నెలు
ప్రభుత్వ కసరత్తు షురూ
మంత్రి కేటీఆర్ ప్రకటనతో పెరిగిన ప్రాధాన్యత

**పర్యావరణహిత నిర్మాణాలపై ఫోకస్**

**ఓఆర్ఆర్ చుట్టూ గ్రోత్ కారిడార్**

**మున్సిపాలిటీల్లోనూ శాటిలైట్ టౌన్‌షిప్‌లు**

**కొత్త టౌన్‌షిప్ పాలసీతో పట్టణాలు, నగరాల్లో కొత్త మున్సిపల్ చట్టం అమలుకు మార్గం మరింత సులువు కానుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ పాలసీ మరింత ప్రాధాన్యత సంతరించుకోనున్నది.**

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా నగరాల అభివృద్ధి జరిగేలా చూసేందుకు టౌన్‌షిప్ పాలసీని తెచ్చేందుకు కసరత్తు ప్రారంభమైంది. కొత్త మున్సిపల్ చట్టాన్ని తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ కొత్త పాలసీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఈ విషయాన్ని స్వయంగా ఇటీవల ఓ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి కేటీఆర్ స్వయంగా వెల్లడించటంతో ఈ చట్టం ఎలా ఉండబోతుందన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో గతంలోకంటే వేగంగా పట్టణాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. భౌగోళిక పరిస్థితుల అనుకూలతతో పాటు రహదారులు, విద్యా వైద్య సదుపాయాలున్న మండల కేంద్రాలు, రెవిన్యూ డివిజన్లు, జిల్లా కేంద్రాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు

8వ పేజీలో...

# పీపీఏలను గౌరవిస్తాం



పునఃసమీక్షలు పునరావృతం కావు • ఏపీలోనూ కాంట్రాక్టులు కొనసాగుతాయి • ఇన్వెస్టర్లకు ఆందోళన అనవసరం • కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ భరోసా 9

## తొలి దివ్యాంగ సబ్ కలెక్టర్ ప్రాంజల్



**తిరువనంతపురం:** కంటిచూపు లేదని కన్నీరు పెట్టుకోలేదు. ఈ సమాజం చిన్నచూపు చూస్తుందేమోనని ఆందోళన చెందలేదు. చిన్నతనంలో కోల్పోయిన కంటిచూపును తిరిగిపొందలేనని బాధపడలేదు. పట్టుదలతో చదివి తనకు ఇంకెవరూ సరిలేరని నిరూపించారు మహారాష్ట్రకు చెందిన ప్రాంజల్ పాటిల్. దేశంలోనే తొలి దివ్యాంగ (విజువల్లీ ఛాలెంజ్డ్) ఐఏఎస్ అధికారిణిగా పేరు సంపాదించుకుని సోమవారం తిరువనంతపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కేరళ కేడర్ ఐఏఎస్ (దివ్యాంగ) గానూ రికార్డు సృష్టించారు. తిరువనంతపురం భూసేకరణ విభాగంలో ప్రస్తుత డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సామ్ స్లెటస్ రిపోర్ట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ కాపీపై సంతకం చేసి ప్రాంజల్ అందజేశారు. తిరువనంతపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని ప్రాంజల్ పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే సివిల్స్ పరీక్షలు రాసి ఉద్యోగం సాధించినట్లు వివరించారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు పెరిగిన వేతనాలు

రూ. 8500కు పెంచుతూ జీవో విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వ నెల వేతనం రూ.8500కు పెంచుతామని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సోమవారం అందుకు సంబంధించిన జీవోను విడుదల చేశారు. రాష్ట్రంలో కారోబార్‌లుగా, బిల్ కలెక్టర్లుగా, వాటర్ మెన్‌గా, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారందరికీ ఈ వేతనాలు వర్తిస్తాయి. రాష్ట్రంలో సుమారు 34వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరింది. ఇకపై గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న అన్నికేటగిరిల కార్మికులను మల్టీపర్పస్ వర్కర్స్‌గా పేరు మారుస్తు పంచాయతీరాజ్ శాఖ

8వ పేజీలో...

## ఔరా..!





## ఏపీ సీఎం జగన్‌తో చిరంజీవి భేటీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మెగాస్టార్ చిరంజీవి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుండి ప్రత్యేక విమానంలో విజయవాడకు చేరుకున్న చిరంజీవి, సురేఖ దంపతులు తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం జగన్ వారికి సాదర స్వాగతం పలికి లోనికి ఆహ్వానించారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక చిరంజీవితో భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా చిరంజీవి ముఖ్యమంత్రికి శాలువాకప్పి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం భోజనం చేస్తూ సైరా సినిమా గురించి క్లుప్తంగా ముఖ్యమంత్రికి చిరంజీవి వివరించారు. తాను నటించిన సైరా సినిమాను కుటుంబ సమేతంగా చూడాల్సిందిగా చిరంజీవి ముఖ్యమంత్రిని కోరారు. అందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఈనెల 5న తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసిన సంగతి తెలిసిందే. సైరా నరసింహారెడ్డి సినిమా చూడాలని ఆమెను చిరంజీవి కోరారు. చిరంజీవి ఆహ్వానం మేరకు గవర్నర్ ప్రత్యేకంగా ఈ సినిమాను వీక్షించిన సంగతి విదితమే.



## గగనతలంపై ఘన విజయాలు సాధించాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మరిన్ని అంతరిక్ష ప్రయోగాలతో గగనతలంపై ఘన విజయాలు సాధించాలని రాష్ట్రగవర్న తమిళిసై సైందరరాజన్ అన్నారు. సోమవారం బీఎం బిర్లా ప్లానిటోరియంలో చంద్రయాన్-2 ఫుల్ డెమో డిజిటల్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ సంద్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఇస్రోశాస్త్రవేత్తలు అంతరిక్ష ప్రయోగాల్లో దేశభక్తిని ప్రతిబింబిపచేస్తూ భారతీయులందరూ గర్వపడేలా కష్టపడుతున్నారన్నారు.1969లో ప్రారంభమైన ఇస్రో అంతరిక్ష ప్రయోగాల ద్వారా ఎన్నో విజయాలు సాధించిందన్నారు. అందుకు ఇస్రో శాస్త్రవేత్తలందరికీ అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్లానిటోరియంలో అత్యాధునిక ప్రొజెక్టర్ ద్వారా చంద్రయాన్-2 ప్రయాణం కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారన్నారు. ఈ ప్రదర్శనను వీక్షించటం సంతోషంగా ఉందన్నారు. డిజిస్టార్ ప్రొజెక్టర్‌ను గవర్నర్ ప్రారంభించడం ఆనందంగా ఉందని డైరెక్టర్ డా.బి.జి సిద్దార్థ అన్నారు.




## సోలార్ వాడకాన్ని విస్తృతం చేయాలి

**తార్నాక, ప్రభన్యూస్ :** నానాటికి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి వనరులు తగ్గుతున్నాయని, ప్రత్యామ్నాయంగా జరుగుతున్న సోలార్ వాడకంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అడ్వాన్స్‌డ్ సోలార్ పీవీ టెక్నాలజీ వెండర్స్ మీట్- 2019పై 2 రోజుల వర్క్‌షాప్‌ను గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడులో తన ఇంట్లో కూడా సోలార్ విద్యుత్‌ను వాడుతున్నానని చెప్పారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తీసుకువస్తున్న నూతన మార్పులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోలార్ వాడకం ఇప్పుడిప్పుడే భారతదేశంలో పెరుగుతుందని, దీనిని మరింత విస్తృత చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

# హస్తం నేతల ఐక్యతారాగం



- హుజూర్‌నగర్‌లో కలిసికట్టుగా ప్రచారం
- నియోజకవర్గంలోనే కీలక నేతల మకాం
- అంతర్గతసర్వేలు.. లోటుపాట్లపై దిద్దుబాటు చర్యలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ సిట్టింగ్ సీటును హస్తగతం చేసుకోవాలని.. కాంగ్రెస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పార్టీకి ఈ ఎన్నిక కీలకంగా మారడంతో ముఖ్య నేతలందరూ చిన్న చిన్న విభేదాలు పక్కనపెట్టి హుజూర్‌నగర్ లోనే మకాం వేసి ఉప ఎన్నికను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నా రు. కులాలు, వివిధ సామాజిక వర్గాల వారీగా నాయకులను ప్రచార పర్వంలోకి దింపి.. ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేసున్నారు. నియోజకవర్గంలో ఉన్న 7 మండలాలకు ఒక్కో నేత ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ.. పార్టీకి ఉన్న లాభ, నష్టాలపై ఎప్పటి కప్పుడు అంచనాలు వేస్తున్నారు. అంతర్గతంగా సర్వేలు చేయిస్తూ ప్రతికూలంగా ఉన్న గ్రామాల్లో పరిస్థితులను చక్కదిద్దే పనిలో పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. టీఆర్ఎస్‌కు ధీటుగా క్షేత్ర స్థాయి లో పర్యటిస్తూ.. ప్రభుత్వవైఫల్యాలు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి ఓటర్లను ఆకర్శించే ప్రయత్నం చేస్తున్నారు.

అభ్యర్థి పద్మావతితో ఉత్తమ్‌కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని 7 మండలాల్లోని ప్రతీ గ్రామాన్ని చుట్టి వస్తున్నారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్‌రెడ్డి స్థానికంగానే మకాం వేశారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూడా ఎన్నికల ప్రచారంలోకి దిగారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావుతో పాటు పలువురు ప్రచారం పర్వంలోకి దిగారు. ఎంపీ రేవంత్‌రెడ్డి కూడా 18, 19న నియోజకవర్గంలోని 7 మండలాల్లో ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. రూట్‌మ్యాప్‌కు బాధ్యతలను పార్టీ అధికార ప్రతినిధి మానవతా రాయ్‌కు అప్పజెప్పారు. ఉత్తమ్‌తో చర్చించి షెడ్యూల్ ఫైనల్ చేస్తారని రేవంత్ సన్నిహితులు చెబుతున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహిస్తున్న నేతలు పార్టీ కేడర్‌తో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఉత్సాహం నింపుతున్నారు. గ్రామానికి, తండాకు వెళ్లే ముందు అక్కడి జనాభా, పార్టీ పరిస్థితి, మెజార్టీ ఎవరికి ఉంటుంది, కులాల వారీగా ఎవరు ఏ పార్టీకి ఉన్నారనే పూర్తి సమాచారాన్ని నాయకులు సేకరిస్తున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నవారిని బుజ్జగించే పనిలో పార్టీ నేతలు నిమగ్నమైనారు. రాత్రికి అక్కడే బస చేసి వివిధ వర్గాలకు చెందిన బలమైన నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. 21వేల ఓట్లకు పైగా ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా ప్రచారం చేస్తున్నారు.

### టీఆర్ఎస్ ఓడితేనే.. కేసీఆర్ అహం తగ్గుతుంది

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ విజయం సాధించడం అవసరమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ఓడితేనే కేసీఆర్ అహం తగ్గుతుందని, అందుకు కాంగ్రెస్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలీసులను అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

**- టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

### కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారు

నియంతలా వ్యవహరిస్తున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలంటే హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్‌ను ఓడించాల్సిన అవసరం ఉందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. సీఎం కేసీఆర్‌కు అహంకారం మరింత పెరిగిందని మండిపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్**




## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



**మఠంపల్లి, ప్రభన్యూస్ :** ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్‌పద్మావతిని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షులు, నల్లగొండ జిల్లా ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా యాతవాకిళ్ల, హనుమంతులగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించి వేములూరి ప్రాజెక్టు కాల్వ ఆధునీకరణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు, త్రాగునీరు అందించేందుకు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని ఈప్రాంతంలో రోడ్ల నిర్మాణం, విద్యుత్, మౌళిక వసతులు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. ఈసమావేశంలో మాజీ మంత్రి సుధర్శన్‌రెడ్డి, టీజేఏసీ కోదండరాం,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాముల శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మంజూనాయక్, ఒంటిపులి శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, బొమ్మకంటి మట్టయ్య, శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వీరయ్య, కాసాని వీరమ్మ, వెంకన్న, కాసాని నారాయణ, తదితరులు ఉన్నారు.



### సీఎం సభాస్థలి పరిశీలన

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈనెల 17న హుజూర్ నగర్‌కు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సభాస్థలిని సోమవారం రాత్రి జిల్లా మంత్రి జగదీశ్వర్ రెడ్డి పరిశీలించారు. సభకు అనుగుణంగా ఏర్పాట్లపై పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎన్నికల ఇంచార్జ్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, దొడ్డా నర్సింహారావు, తదితరులుఉన్నారు.



### అభివృద్ధికే ప్రజలు పట్టం

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు అభివృద్ధికే పట్టంకట్టనున్నారని అధికారంలేని కాంగ్రెస్ పార్టీఅభ్యర్థి ఉత్తమ్ పద్మావతికి ఓటు వేసి ఏం చేయాలని ఓటర్లు ఆలోచిస్తున్నారని అభివృద్ధి జరగాలంటే టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థైన శానంపూడి సైదిరెడ్డిని ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్‌కు టీఆర్ఎస్ పార్టీకి ప్రజలందరు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు.



### ఉత్తమ్‌కుమార్ రెడ్డివి శవరాజకీయాలు

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** ఉప ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెరాస ఉప ఎన్నికల ఇంచార్జ్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెరాస పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరన్నారు. నియోజకవర్గంలో ఓటర్లు టీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. ఈనెల 17న హుజూర్‌నగర్‌కు సీఎం కేసిఆర్ రాబోతున్నారని 2గంటలకు జరగబోయే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నుండి కుటిల రాజకీయాలు చేస్తున్న నీతిమాలిన రాజకీయ నాయకులకు జవాబు ఇవ్వబోనున్నారన్నారు.

## ఉద్యోగ భద్రతకే ప్రాధాన్యం!



### యువత పంథా మారుతోంది

- వేతనాల కంటే లక్షణమైన కొలువుకే మొగ్గు
- జాతీయ పోటీ పరీక్షలకు సై
- బ్యాంకింగ్, ఉద్యోగాలపై యువత గురి

**న్యూఢిల్లీ:** ఐదంకెల జీతాలు.. విదేశాల్లో కొలువులు.. కార్పొరేట్ వర్క్ కల్చర్.. విలాసవంతమైన జీవనశైలి.. నిన్నటిదాకా ఉన్నత విద్యావంతులైన యువతరం ఆలోచన పంథా ఇది. పరిస్థితులు మారాయి. దూకుడు తగ్గింది. ఇప్పుడు వారి ఆలోచనా ధోరణిలో మార్పొచ్చింది. ఉద్యోగాల వేటలో ప్రాధాన్యతలు మారాయి. ఉద్యోగ భద్రత, ఆకర్షణీయమైన వేతనం, సానుకూల పనివిధానం మధ్య సమతుల్యతను ఆశిస్తున్నారు. దేశంలోని వృత్తినిపుణుల్లో మూడొంతులకు పైగా ఇదే విధమైన జీవితాన్ని కోరుకుంటున్నారు.

ఒకవైపు నిరుద్యోగం తాండవిస్తూ, అవకాశాలే మృగ్యమవుతున్నా రాజీపడేందుకు ససేమిరా అంటున్నారు. ఈ నేపథ్యంలో అస్థిరమైన ప్రైవేటు ఉద్యోగాల కంటే బ్యాంకింగ్, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటిలో మాత్రమే ఉద్యోగభద్రత, మానసిక ప్రశాంతత ఉంటుందని బలంగా విశ్వసిస్తున్నారు. ఉన్నత విద్య పూర్తియిన వెంటనే ఇదివరకటిలా వెంటనే ఏదోఒక కొలువులో దూరిపోవడం లేదు. ప్రత్యేక శిక్షణతో నైపుణ్యం పెంచుకునే పనిచేస్తున్నారు. పట్టుదలతో పదేపదే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మూడు నాలుగేళ్లు ఆలస్యమైనా సరే భద్రమైన, లక్షణమైన ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆంగ్లంతోపాటు హిందీపైనా పట్టుసాధిస్తున్నారు. పోటీ పరీక్షలకు జాతీయ భాషలో ప్రాక్టీసు చేస్తున్నారు. ప్రస్తుత వృత్తినిపుణులు, పట్టభద్రుల్లో 45 శాతం మంది ఉద్యోగభద్రత ఉన్న కొలువలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని తాజా సర్వే ఒకటి నిగ్గుతేల్చింది. జాతీయస్థాయిలో వేలాది మంది బ్యాంకింగ్, ప్రభుత్వ ఉద్యోగార్థుల అభిప్రాయాలను ఆన్‌లైన్ ద్వారా సేకరించి ఆలివ్‌బోర్డ్ అనే సంస్థ ఈ మేరకు నివేదిక విడుదల చేసింది.

44.3శాతం మంది ఉద్యోగంలో స్థిరత్వాన్ని కోరుకుంటున్నారు. వేతనం తక్కువైనా సరే ఉద్యోగభద్రత ఉండాలని ఆశిస్తున్నారు. 36.7 శాతం మంది మెరుగైన జీవనానికి వీలుగా ఉద్యోగవాతావరణం ఉంటేచాలని భావిస్తుండగా, కేవలం 11 శాతం మంది మాత్రమే ఎక్కువ జీతానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో 79 శాతం మంది పెద్దనగరాలకు చెందినవారే. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిలో 23 శాతం మంది మాక్ టెస్టులను హిందీలో రాసేందుకు మొగ్గుచూపుతున్నారని తేలింది.

నిరుద్యోగుల్లో 39.4 శాతం మంది ఏకకాలంలో ఒకటి నుంచి మూడు పోటీపరీక్షలకు శిక్షణ పొందుతున్నట్లు వెల్లడైంది. ఉన్నత విద్యావంతుల్లో అధికులు జేఈఈ, ఎన్ఈఈటీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, గేట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సంప్రదాయ తరగతి గదుల శిక్షణా విధానానికి భిన్నంగా ఆన్‌లైన్ శిక్షణ ప్రాచుర్యం పొందుతోందని సర్వే అభిప్రాయపడింది.

## హుజూర్‌నగర్‌లో తెరాసకు దూరం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యావర్గం ప్రకటించింది. తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితుల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతివ్వాలని గతంలో నిర్ణయించామని, అయితే ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వ వైఖరి అన్యాయంగా ఉండటంతో మద్దతు ఉపసంహరించుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలో ఏ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలనే అంశంపై హుజూర్‌నగర్ నియోజకవర్గం సిపిఐ కార్యకర్తలతో సమావేశమై ఒక నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు ఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చే అంశాన్ని రెండురోజుల్లో వెల్లడిస్తామ న్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సంబంధించి ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సిపిఐ పార్టీ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సమస్య పరిష్కారం బదులు ప్రభుత్వం విద్వేషపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

### సీపీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా - గూడూరు నారాయణరెడ్డి

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌కు ఇచ్చిన మద్దతును సీపీఐ ఉపసంహరించుకోవాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి అన్నారు. క్రూరమైన, నియంతృత్వంగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీకి మద్దతు ఇవ్వకూడదని సీపీఐ పార్టీ మంచి నిర్ణయం తీసుకున్నదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మెకు దిగిన 48 వేల మంది ఆర్టీసీ కార్మికులను చట్ట విరుద్ధంగా విధుల నుంచి తొలగించారని ఆయన విమర్శించారు. హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థిని పద్మావతిని గెలిపించడానికి అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## నేడు లక్ష్మణ్ ప్రచారం

హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రామా రావు తరఫున ప్రచారం చేసేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ మంగళవారం వెళ్తున్నారు. రోడ్‌షో ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేయనున్నారు. ఉదయం గం. 9.30 కి గడ్డిపల్లి నుంచి రోడ్‌షోను ప్రారంభించి పొనుగోడు, గరిడిపల్లి, కితవారిగూడెం, కల్మల్‌చెరువు, జన్‌పహాడ్, పాలకీడు, దిరిసినిచెర్ల, నేరేడుచర్ల తదితర చోట్ల రోడ్‌లలో పాల్గొననున్నారు.

## దేశంలో సగభాగానికి భూకంప ముప్పు

### పైలట్ స్టడీ నిర్ధారణ.. 50 నగరాలు, ఒక జిల్లాలో ఐఐఐటీ హైదరాబాద్ అధ్యయనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇండియాలో భూకంప తీవ్రతలపై ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ) హైదరాబాద్ ఒక పైలట్ స్టడీని నిర్వహించింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) కేంద్ర హోంశాఖ సంయుక్త సహాయంతో పైలట్ స్టడీని నిర్వహించింది. దేశంలోని 50 నగరాలతోపాటు ఒక జిల్లాలోనూ అధ్యయనం చేశారు. భూకంపాలు ఎక్కువగా వచ్చే జోన్3, 4, 5 ప్రాంతాల్లో అధ్యయనం చేశారు. ప్రిన్సిపల్ ఇన్వేస్టిగేటర్ ప్రొఫెసర్ ఆర్ ప్రదీప్ కుమార్ తన పరిశోధన విద్యార్థులతో కలిసి 3 సంవత్సరాలపాటు అధ్యయనం చేశారు. భూకంపాలు ఎక్కువగా వస్తున్న ప్రాంతాలను ఎంచుకున్నారు. ఆయా ప్రాంతాల్లో భూకంపాలకు ప్రధాన కారణం ఏమిటనే అధ్యయనం చేశారు. 25 నగరాల్లో ప్రత్యక్షంగా అధ్యయనం చేయగా మరో 25 నగరాల్లో అధికారుల నుంచి నిపుణుల నుంచి విషయాలను సేకరించారు. పైలట్ అధ్యయనంలో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో 400 భవనాలను ఎంపిక చేసుకున్నారు. వీటిలో భూకంపాల సందర్భంగా తక్కువ నష్టం జరగడం, మాధ్యమికంగా నష్టం, ఎక్కువ నష్టం జరిగే విధంగా వాటిని విభజించి అధ్యయనం చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానర్స్‌తోపాటు నిర్ణయాధికారం ఉన్న వారితో సంప్రదించి వివరాలు సేకరించారు. దేశంలోని 56 శాతం భూమి భూకంపాలు రావడానికి అవకాశం ఉందని అధ్యయనంలో తేలింది. ఈ ప్రాంతాల్లో ఎక్కువసార్లు భూకంప రావడానికి అవకాశం ఉన్నట్టు గుర్తించారు. అందులో భాగంగా గతంలో భూకంపాలు వచ్చిన ప్రాంతాల్లో పరిశీలిస్తే భవనాలను సక్రమంగా నిర్మించకపోవడం ప్రధాన కారణంగా నిర్ధారణకు వచ్చారు.


తెలంగాణ ప్రభుత్వము

రహదారులు మరియు భవనముల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఎన్ఐటి నెం.ఇ(ఆర్ & బి) పిడిపిఎల్/06/2019-20 తేది : 11.10.2019

కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో) కి.మీ.0/0 నుండి 0/693 వరకు పెద్దపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు అప్రోచ్ రోడ్డు యొక్క వెడల్పు చేయుట మరియు బలోపేతము. ఉప పని: అప్రోచ్ రోడ్డు యొక్క రహదారి భద్రత ఇంటర్వెన్షన్ల ఏర్పాటు మరియు బిగించుట. అంచనా వ్యయం: రూ.12.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ప్రారంభ & ముగింపు తేదీ & సమయం: 11.10.2019 న మ॥3.00గం॥ల నుండి 18.10.2019 న మ॥3.00గం॥ల వరకు. బిడ్లు స్వీకరించుటకు చివరి తేదీ మరియు సమయం: 18.10.2019 న మ॥3.30గం॥ల వద్ద. ధర బిడ్ తెరచు తేదీ : 18.10.2019 సా॥4.00గం॥లకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా eprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్ నెం.08728-223653.

సం/- జిల్లా (ఆర్&బి) అధికారి, (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), పెద్దపల్లి జిల్లా.

Ro No.1372/CL/Advt/1/19-20, Dt. 14.10.2019


## బీజేపీలోకి అన్నపూర్ణమ్మ

తెలంగాణ టీడీపీకి మరో షాక్ తగిలింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఆర్మూర్ మాజీ ఎంఎల్ఏ అన్నపూర్ణమ్మ, ఆమె కుమారుడు మల్లికార్జున్‌రెడ్డిలు కాషాయ కండువాను కప్పుకునేందుకు నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల తరువాత ముహూర్తం ఖరారైంది.



# పత్తి బేళ్లు కొనుగోళ్లు..

# ఎలా? ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలున్నాయి. ఈ నిర్దేశిత సాగు విస్తీర్ణంతో 48 లక్షల బేళ్ళ పత్తి మార్కెట్‌లోకి వస్తుంది. ఈఏడాది 17.24 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతోందని అధికారులు అంచనా వేయగా, అవి తలకిందులై విస్తీర్ణం 18.59 లక్షల హెక్టార్లకు పెరిగింది. గత ఏడాది 17.96 లక్షల హెక్టార్లుగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. పెరిగిన విస్తీర్ణం ప్రకారం 75 నుంచి 80 లక్షల బేళ్ళ పత్తి మార్కెట్‌లోకొచ్చే అవకాశాలున్నాయి. ఒక బేల్ పత్తి 170 కిలోలు ఉంటుంది. ఆ ప్రకారం 68.65 మెట్రిక్ టన్నుల పత్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్న ప్రకారం.. ఈ రెండు ప్రభుత్వాల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పత్తి కొనుగోలు సామర్థ్యం కేవలం 42.65 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే అంచనాకు మించి దాదాపు 26 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఎక్కువగా మార్కెట్‌లోకి రానుంది.

గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పత్తి రైతులకు కష్టకాలం కనిపిస్తోంది. కనీస మద్దతు ధరలందక తీవ్రమైన నష్టాలను భరించక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. నెలాఖరు నాటికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్ళ ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. గతేడాది ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు దాదాపు 320 వరకు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు కొనుగోళ్ళకు శ్రీకారం చుట్టాయి. అయినా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరుగక రైతులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ తగ్గడం, దేశం నుంచి ఎగుమతులు గత ఏడాది నుంచి క్షీణించడం లాంటి కారణాలతో గతేడాది కొనుగోలు చేసిన దాంట్లో సగం మాత్రమే కొంటామని సీసీఐ స్పష్టంచేస్తోంది.

### గత ఏడాది నిలువు దోపిడీ

పండించిన పత్తిని ఎలాగైనా అమ్ముకోవాలన్న రైతుల ఆత్రుతను ఆసరాగా చేసుకుని వ్యాపారులు, అధికారులతో కుమ్మక్కై గతేడాది నిలువునా దోచుకున్నారు. అందుకు తోడు అకాల వర్షం అన్నదాతను ముంచేసింది. తుఫాను కారణంగా ఎండలు అంతంత మాత్రంగానే ఉండడంతో రోజులు గడిచినా పత్తిలో ఉన్న తేమశాతం తగ్గలేదు. ఈ రెండు ప్రధాన కారణాలు వ్యాపారులకు ఆయుధంగా మారి తక్కువ ధరలకు ఇస్తే ఇవ్వండి... లేదంటే మరెక్కడైనా అమ్ముకోండి.. అని తెగేసి చెప్పారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో క్వింటాలు పత్తిని రూ.2,500 నుంచి రూ.3,500 మధ్య అమ్ముకోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర గతేడాది క్వింటాలుకు రూ.5,450 ఉండగా, ఈఏడాది రూ.5,550కి పెంచారు.

### ఒక్కసారిగా మార్కెట్‌ను ముంచెత్తే ప్రమాదం

ప్రస్తుత మార్కెటింగ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యాక రెండు, మూడు రోజుల్లోనే ఇబ్బడిముబ్బడిగా పత్తి బేళ్లు మార్కెట్ యార్డులకు వచ్చి పడనున్నాయి. దీపావళి పండగ తర్వాత పత్తి కొనుగోళ్లు పుంజుకోనున్నాయి. 2017-18 మార్కెటింగ్ సీజన్‌లో క్వింటాలు పత్తి రూ.6వేల వరకు పలుకుగా, గత ఏడాది ఎక్కడా రూ.4వేలకు మించలేదు. ఎంఎస్‌పీపై ఒక్కసారిగా రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పడిపోవడంతో రైతులు తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు ప్రతిరోజూ 80వేల బేళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది.

### ఎంఎస్‌పీ నిర్ణయం పట్ల వ్యతిరేకత

పెట్టుబడి వ్యయం దాదాపు ఐదింతలు పెరిగినా ఆశించిన మేరకు కనీస మద్దతు ధరలు పెంచకపోవడం పట్ల పత్తి రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చినా కేంద్రం పత్తి కనీస మద్దతు ధరను రూ.5,550 మాత్రమే ప్రకటించడం ఏ మేరకు సమంజసమన్న వాదన వినిపిస్తోంది. పంట పెట్టుబడి భారాన్ని మోయలేక, కనీస మద్దతు ధరలు అందక వ్యవసాయం మోయలేని భారంగా మారుతోందన్న ఆందోళన, ఆవేదన గ్రామస్థాయిలో వ్యక్తమవుతోంది.

### సీసీఐ బాధ్యతారాహిత్యం...

భారత పత్తి కొనుగోలు సంస్థ (సీసీఐ) అధికారులు సమయానికి పత్తి కొనుగోలు చేయని కారణంగానే తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఏటా సెప్టెంబర్ మూడోవారం నుంచే మార్కెట్లోకి పత్తి వస్తుంటే, కొనుగోళ్లు మాత్రం అక్టోబర్ రెండోవారం తర్వాత ప్రారంభమవుతున్నాయి. ఈ ఏడాది ఆ సమయానికి కూడా ప్రారంభం కాలేదు. నిర్దేశిత సమయానికి దాదాపు నెల రోజుల తర్వాత కూడా సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### క్వింటాలుపై రూ.1000 పెంపు డిమాండ్

పెరిగిన పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా మద్దతు ధరలు లేకపోవడం, మధ్యవర్తులు దోచుకోవడంతో ఎంత దిగుబడి సాధించినా లాభం దక్కడంలేదు. ఈ పరిస్థితుల నుంచి రైతులు బయటపడాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో ప్రతి క్వింటాలుపై రూ.1000 చొప్పున బోనస్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

### జిల్లాస్థాయి కమిటీలున్నా.. ఫలితం సున్నా!

పత్తి మార్కెటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు, కనీస మద్దతు ధరలు అమలయ్యేలా చర్యలు తీసుకునేందుకు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి కమిటీలున్నాయి. ధరల స్థిరీకరణ నిధి కింద కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ప్రతి జిల్లాకు విడుదల చేస్తుంది. రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. వ్యవసాయ సహకారశాఖ ముఖ్య కార్యదర్శి, ఆ శాఖ కమిషనర్, అగ్నిమాపక సర్వీసుల డైరెక్టర్ జనరల్ భారత పత్తి సంస్థ బ్రాంచ్ మేనేజర్ సభ్యులుగా, మార్కెటింగ్ శాఖ కమిషనర్ కన్వీనర్‌గా కొనసాగుతారు. జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కన్వీనర్‌గా, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్, అదనపు పోలీసు సూపరింటెండెంట్, జిల్లా అగ్నిమాపక అధికారి, సీసీఐ ప్రతినిధి, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్, పత్తి వ్యాపారుల సంఘం ప్రతినిధి, రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సభ్యులుగా ఉంటారు. అయినప్పటికీ పత్తి కొనుగోళ్ళలో జరుగుతున్న అక్రమాలను, ధరల తగ్గింపును ఏమాత్రం పర్యవేక్షించడం లేదని గతంలోని అనుభవాలు స్పష్టంచేస్తున్నాయి.

# వైద్యశాఖకు పెత్తన రోగం..!



## జూనియర్‌ల చేతిలో సీనియర్లకు వేధింపులు

- అడ్డదారిలో పదోన్నతులు.. ఆందోళనలో అర్హులు
- రాజ్‌భవన్‌కు చేరిన పంచాయితీ
- బజారుపాలవుతున్న ఆస్పత్రుల పరువు
- పత్తాలేని మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు
- ఇన్‌చార్జీతోనే కుంటుపడుతున్న వైద్యవిధాన పరిషత్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : ప్రభుత్వ యంత్రాంగం సాఫీగా పనిచేసినప్పుడే ప్రజలకు అందాల్సిన సేవలు సక్రమంగా అందుతాయి. అందుకోసం ప్రజల సంఖ్యకు తగిన విధంగా సిబ్బంది నియామకాలు జరుగుతుండాలి. అదేక్రమంలో వివిధ స్థాయిల్లో పనిచేసేవారికి పదోన్నతులు కల్పిస్తూ విధి నిర్వహణలో అలసత్వం చోటుచేసుకోకుండా చూడాలి. కానీ ప్రభుత్వమే గాడితప్పితే.. వాటిని పట్టించుకునే నాథుడు లేకుండా పోతారు. ఇప్పుడు వైద్యశాఖలో జరుగుతున్న గందరగోళ పరిస్థితులకు ప్రభుత్వ పనితీరే కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అంశాన్ని ఇటీవల కాగ్ నివేదిక లేవనెత్తింది. వైద్యశాఖకు కేటాయింపులు తగ్గాయని ఎత్తిచూపింది. దీనికి తోడు ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవటం మరో సమస్యకు దారితీసింది. కొందరు ప్రభుత్వ పెద్దల అండతో పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

### పక్కదారిపడుతున్న కేసీఆర్ ఆశయం

డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది (ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు)ని నియమించడం లేదు. నియామకాల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్ మెంట్ బోర్డు ఉందో... లేదో అధికారులకే తెలియాలి. బోర్డు ఏర్పడి నెలలు గడుస్తున్నా.. ఒక్క నియామకం చేపట్టలేదు. ఓ వైపు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేసీఆర్ కొత్త పథకాలు తెస్తున్నారు. మరోవైపు ఈ వ్యవస్థ మూల స్తంభాలైన వైద్యులు, నర్సుల వ్యవస్థలను మెరుగుపరిచే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో డాక్టర్ల మధ్య సమన్వయం దెబ్బతింటోంది. ఉన్న వైద్యులు, నర్సులపై అధిక భారంపడి ఒత్తిడి గురవుతున్నారు. దీని నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వ పెద్దల అండతో కొందరు జూనియర్లు, సీనియర్లపై పెత్తనం చేసే కుర్చీలు దక్కించుకొని వేధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. కోర్టు నుంచి తప్పించుకోవటానికి టెక్నికల్ అంశాలను తెరమీదికి తెస్తోంది. తమకు సీనియార్టీ ఉన్నా తమకు దక్కాల్సిన ఉన్నత పదవుల్లో అగ్రవర్ణాలకు చెందినవారు దొడ్డిదారిలో పాగా వేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ వైద్యులు ఆరోపిస్తున్నారు.

### అనర్హులకు పదోన్నతులు..!

ప్రభుత్వ వైద్య రంగంలో తగిన నియామకాలు, నిధుల్లేక కుదేలు అవుతోంది. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవ లందడం లేదు. కొందరు పేదలు గత్యంతరం లేని పరిస్థితిలో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరుతుండగా, మరికొందరు ప్రభుత్వ పథకాలు, వైద్యుల అనుభవం చూసి అడ్మిట్ అవుతున్నారు. తీరా చేరిన తరువాత అక్కడి దుర్భర పరిస్థితుల కారణంగా ఇబ్బందుల పాలవుతున్నారు. రోగుల సంఖ్యకు తగిన విధంగా నర్సులు, సిబ్బంది ఉండకపోవడంతో ఉన్న వారిపైనే పని భారం పెరుగుతోంది. సినియార్టీ చూడకుండా తమకు కావా ల్సిన వారిని ఉన్నత పదవుల్లో కూర్చోబెడుతూ వైద్యుల మధ్య విభేదాలు ఏర్పడటానికి కారణమవుతోంది. నీలోఫర్‌లో క్లినికల్ పరీక్షల రూపంలో ఏర్పడిన రచ్చ ఇందుకు నిదర్శనం. ఇదే తరహాలో అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో విభేదాలున్నట్టు తెలుస్తోంది.

### రెండు ఉన్నత పదవులకూ ఒకరే ఇంచార్జి

ఇప్పటికే ఇంచార్జి డీఎంఈగా డాక్టర్ రమేష్‌రెడ్డి ఉన్నారు. ఆయన్నే మరో ఉన్నత స్థానం వైద్య విధాన పరిషత్ కమిష నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామంతో ఇప్పటికే న్యాయం కోసం పోరాడు తున్న ఎస్సీ, ఎస్టీ డాక్టర్లను మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. నిబంధనల ప్రకారం వైద్య విధాన పరిషత్‌కు డాక్టర్ల నుంచే ఒకరిని సీనియారిటీ, సమర్థత ఆధారంగా నియ మించాలి. ఇందుకోసం వైద్య సంఘాలు ఎప్పడి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. అయితే పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించకుండా దీన్ని కూడా ఓ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తికే అప్పగించడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. పూర్తి స్థాయి నియామకం చేపట్టా లంటే రోస్టర్ పాయింట్లు, రిజర్వే షన్ పాటించాల్సి వస్తుంది. వీటి నుంచి తప్పించుకోవటానికి ఇన్‌చార్జి హోదా అంటగడితే ఆ నిబంధ నల నుంచి తప్పిం చుకోవచ్చన్న ఆలో చనలో ప్రభు త్వం ఉన్నట్టు తెలు స్తోంది. ఈ పద్ధతినే ప్రభుత్వ పెద్దలు, వైద్య శాఖ ఉన్నతాధికారులు పా టించినట్లు ప్రచారం జరుగుతోంది.



### పోస్టులు క్రియేట్ చేయలేదా

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) పోస్టులు విభజనలో భాగంగా ఏపీకి వెళ్లాయి. దాంతో తెలంగాణ వీటిని కొత్తగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు పూర్తవుతున్నా.. ఇప్పటి వరకు ఆ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా అడ్డదారిలో పదోన్నతులు పొందేవారికి ఇది వరంగా మారింది. ఇన్‌చార్జీలుగా ఆ పదవుల్లో కూర్చొని తమకు అనుకూలంగా ఉన్న కొందరితో ఓ బృందంగా తయారు చేసుకొని మొత్తం వ్యవస్థను శాసించే పనిలోపడ్డారు. దీంతో బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయి స్తున్నారు. నిబంధనలు పాటించాలంటూ కోర్టు తీర్పు ఇవ్వ టంతో.. ఇప్పుడు ఆ పదవుల్లో కూర్చున్నవారు తాము కేవలం ఇన్‌చార్జీలేనంటూ తప్పించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

### రాజ్‌భవన్‌కు ఎస్సీ, ఎస్టీ డాక్టర్ల వివక్ష

డీఎంఈతో పాటు డీపీహెచ్ పదవులకు అర్హులైన వారిలో ఎస్సీ, ఎస్టీ డాక్టర్లే ఉన్నారు. కానీ వారిని కాదని ఈ రెండు స్థానాల్లో అడ్డదారిలో అగ్రవర్ణాలకు చెందిన డాక్టర్లను కూర్చో బెట్టారని ఎస్సీ, ఎస్టీ డాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ పంచాయితీ ఎస్సీ కమిషన్‌తో పాటు ఏకంగా రాజ్‌భవన్‌కు చేరింది. గవర్నర్‌నుకలిసి తమగోడు విని పించారు.

### పదోన్నతులు గాలికి..

అత్యంత కీలకమైన అడిషనల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా గాలికొదిలేశారు. పదోన్నతుల ద్వారా వీటిని భర్తీ చేసేందుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) వేయాలి. కానీ ఇంతవరకు దీనికి అతీగతి లేదు. అడిషనల్ డైరెక్టర్లను నియమించిన తరువాత, వారిలో ఒక సీనియర్‌ను డైరెక్టర్‌గా నియమించాల్సి ఉంది. మరోవైపు ఈ స్థాయిలోని డాక్టర్లకే మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్, ఆస్పత్రుల సూపరిం టెండెంట్ పోస్టులకు అర్హత ఉంటుంది. దాంతో ఈ క్రమం లోనూ పదోన్నతికి అవకాశమున్న అర్హులైన వారిలో ఎస్సీ, ఎస్టీడాక్టర్లే ఉండటంతో ఈ ప్రక్రియనే పక్కకు పెట్టేశారనే విమర్శలు వస్తున్నాయి.

# చర్చలకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)

చాడ వెంకట్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన ఇతర నేతలను కూడా చర్చల్లో పాల్గొనాలని కేశవరావు ఆహ్వానించనున్నట్లు తెలు స్తోంది. సీపీఐ(ఎం) నేతలను కూడా చర్చలకు పిలిచే అవకా శమున్నట్టు తెలుస్తోంది. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకై ఈనెల 5వ తేదీన సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంతోపాటు మొత్తం 26 డిమాండ్లతో కార్మికులు చేపట్టిన సమ్మె ఇప్పుడు పదో రోజుకు చేరుకుంది. కాగా చాలా రోజుల తరువాత ఇప్పుడు చర్చలవైపు మరో అడుగుపడటంతో సమ్మె పరిష్కారమవుతుందన్న ఆశలు చిగురించాయి.



### కేకే ప్రకటనతో కదలిక

ప్రభుత్వం మెట్టు దిగకపోవడం, కార్మిక సంఘాలు తమ డిమాండ్లపై పట్టు బట్టడంతో గత పది రోజులుగా రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. ప్రత్యామ్నాయంగా తాత్కాలిక సిబ్బందితో బస్సులను నడుపుతున్నా ప్రయోజనం లేకపోవ డంతో ప్రభుత్వమే సమ్మెను నివారించాలన్న నిర్ణయానికి వచ్చి నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే రాజ్యసభ సభ్యుడు కేశవరావును రంగంలోకి దింపారని చర్చ జరుగుతోంది. ఆర్టీసీ సమ్మెను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కేసీఆర్ ఆదేశిం చడంతో హుటాహుటిన కేశవరావు ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. కేకే మధ్యవర్తిత్వాన్ని ఆర్టీసీ జేఏసీ ఆహ్వానం చడంతో సమ్మె పరిష్కారమవుతుందన్న ధీమాతో అటు ప్రభుత్వం, ఇటు ఆర్టీసీ యాజమాన్యం ఉన్నట్టు చెబుతున్నారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు తనను ఎంతో బాధించాయని ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం చూపించవని కేశవరావు సోమవారం ఉదయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పరిస్థితులు చేయి దాటకముందే ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మెను విరమింపజేసి చర్చలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం మినహా కార్మిక సంఘాల నేతలు లేవనెత్తిన మిగతా డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆ లేఖలో కేశవరావు భరోసా ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో గొప్పగా పరిష్కరించిందని 44 శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఇచ్చిన ఘనత తెరాస ప్రభుత్వానిదని ఆయన గుర్తుచేశారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని సీఎం కేసీఆర్ ఇటీవలె తేల్చిచెప్పిన విషయాన్ని ఆయన తన లేఖలో ఉద్ఘా టించారు. అందుకు తాను కూడా కేసీఆర్‌ను అభినందిస్తున్నానని కూడా కేశవరావు చెప్పారు. అద్దె బస్సులు, ప్రైవేట్ స్టేజీ క్యారేజీల విషయంలో సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనను ప్రస్తుతం చేస్తున్న సమ్మె నేపథ్యంలో తీసుకున్న నిర్ణయంగా మాత్రమే ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, కార్మికులు చూడాలని ఆయన చెప్పారు. తాను 2018 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించానని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రతిపాదనేదీ తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చలేదని స్పష్టంచేశారు. ఆర్టీసీయే కాదు... ఏ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేయడమంటే ప్రభుత్వం తమ విధానాన్ని (పాలసీ) మార్చుకోవాలని కోరడమనే విషయాన్ని గుర్తుచేశారు. ఇది ఆర్టీసీ యూనియన్లకు సంబంధం లేని విషయంగా ఆయన అభివర్ణించారు.

### పరిష్కారం దిశగా కీలక పరిణామాలు

కేశవరావు విడుదల చేసిన ఈ ప్రకటనను బట్టి చూస్తుంటే ఆర్టీసీ సమ్మెను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్రరూపం దాల్చుతుండడంతో ప్రభుత్వం ఎలాగైనా సరే ఈ సమ్మెకు పరిష్కారం చూపాలన్న అంతిమ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. నిన్నమొన్నటి వరకు కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరపకుండా కేవలం ప్రత్యామ్నాయాలపైనే దృష్టి సారించిన ప్రభుత్వం కార్మికుల ఆత్మహత్యల నేపథ్యంలో తమ విధానాన్ని మార్చుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. సమ్మె విరమించి చర్చలకు రావాలని కేశవరావు చేసిన ప్రకటనను బట్టి చూస్తుంటే ఒకటి, రెండు రోజుల్లో సమ్మెను విరమించే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. కార్మిక సంఘాల జేఏసీ నేతలు తమ అభిప్రాయాలు వెల్లడిస్తే ప్రభుత్వం తరపున తాను చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తానని కేశవరావు పేర్కొన్న విషయాన్ని జేఏసీ నేతలు గుర్తుచేస్తున్నారు. కేశవరావు పెట్టిన ప్రతిపాదనపై స్పందించిన ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి ఆయనంటే (కేశవరావు) తమకెంతో గౌరవం ఉందని ఆయన కార్మికులకు తండ్రి సమానులని చెప్పారు.

### ఏపీ తరహాలో విలీనంపై కమిటీ

ఇదిలా ఉండగా ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనంచేసే అంశానికి సంబంధించి ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏపీలో అక్కడి వైకాపా ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరుగుతున్న ఈ తరుణంలో ఆర్టీసీ సమ్మె విషయంలో పట్టువిడుపు ధోరణులతో ఉండడమే మంచిదన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. సమ్మెపై స్పందించిన తెరాస ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమ్మె విరమణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎప్పుడు సమ్మె విరమిస్తారన్నది సీఎం కేసీఆర్ నిర్ణయంబట్టి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తమ సమ్మెలో భాగంగా ఈనెల 19న ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు సమ్మెపై మంగళవారం హైకోర్టు విచారించి తుది తీర్పును వెలువరించనుంది. మంగళవారం ఉదయం ఆర్టీసీ సంఘాల నేతలతో చర్చలు జరపనున్న కేశవరావు బృందం ఇదే విష యాన్ని కోర్టుకు నివేదించి సమ్మె పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని చెప్పను న్నట్టు తెలుస్తోంది. 30 శాతం బస్సులను అద్దె ప్రాతిపదికన, 20 శాతం ప్రైవేట్ బస్సులకు స్టేజీ క్యారేజీలుగా రూట్ పర్మిట్లు ఇవ్వాలన్న నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం ఉపసంహరించుకునే ఆలోచనతో ఉన్నట్టు సమాచారం. ఆర్టీసీ సమ్మెపై ఉత్పన్నమైన పరిస్థితులన్నింటినీ అధిగమించాలని ప్రభుత్వం ఒక నిర్ణ యానికి వచ్చినట్టు తెలుస్తోంది.

## కేకే లేఖ ఇలా..!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మెపై టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే. కేశవరావు సోమవారం పత్రికలకు ప్రకటన విడుదలచేశారు. ప్రకటనలోని సారాంశం ఇలా ఉంది..

ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు నన్ను బాధించాయి. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం చూపజాలదు. పరిస్థితులు చేయి దాటక ముందేఆర్టీసీ యూనియన్ నేతలు కార్మికులను సమ్మె విరమింపజేసి చర్చలకు సిద్ధం కావాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తప్పకార్మికులు లేవనెత్తిన మిగతా డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి. ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో గొప్పగా పరిష్కరించింది. 44 శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఇచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదే. ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఇటీవలే తేల్చి చెప్పారు. అందుకు ఆయనను అభినందిస్తున్నా. అద్దె బస్సులు, ప్రైవేట్ స్టేజీ క్యారేజీల విషయంలో కేసీఆర్ చేసిన ప్రకటనను ప్రస్తుత సమ్మె నేపథ్యంలో తీసుకున్న నిర్ణయంగా మాత్రమే చూడాలి. నేను 2018 అసెంబ్లీ ఎన్నికల టీఆర్ఎస్ మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా ఉన్నాను, ఆర్టీసీని ప్రభుత్వంలో కలిపే ప్రతిపాదనేదీ మా ఎన్నికల ప్రణాళికలో చేర్చ లేదు. ఆర్టీసీయే కాదు ఏ ప్రభుత్వ రంగ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేయడమంటే విధానాన్ని (పాలసీ) మార్చుకోవాలని కోరడమే. ఇది ఆర్టీసీ యూనియన్లకు సంబంధం లేని విషయం.





# ఇక ఎలక్ట్రిక్ టోల్‌ప్లాజాలు

- జాతీయ రహదారుల భూ సేకరణ ఖర్చులో 50శాతం మేమే భరిస్తాం
- ఢిల్లీలోని 'వన్ నేషన్-వన్ ట్యాగ్' కార్యక్రమంలో తెలంగాణ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ** : తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ఖర్చులో యాభై శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. అలాగేరాష్ట్రంలో ఎలక్ట్రిక్ టోల్ ప్లాజా లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోమవారం కేంద్ర రవాణా శాఖ నిర్వహించిన వన్ నేషన్ వన్ ట్యాగ్ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ, తెలంగాణలో ఎలక్ట్రిక్ టోల్ ప్లాజాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికోసం ప్రత్యేక యాప్ ద్వారా బ్యాంకుకు లింకు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించామన్నారు. దీనివల్ల టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని, ఇంధనం ఆదా అవుతుందని చెప్పారు. దశలవారీగా ఎలక్ట్రిక్ టోల్ ప్లాజా లను ఏర్పాటు చేస్తా మన్నారు. తెలంగాణలో లో జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి నితిన్ గడ్కరీని కోరామని వివరించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 3150 కిలోమీటర్ల జాతీయ రహదారుల ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువ అయిన నేపథ్యంలో రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిలో 22.300 కిలోమీటర్ నుంచి 34.140 కిలోమీటర్ వరకు జియో మెట్రిక్ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అలాగే నాగపూర్ హైదరాబాద్ సెక్షన్ లోనూ జియో మెట్రిక్ అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నాగపూర్ హైదరాబాద్ సెక్షన్లోని గుండ్లపోచంపల్లి నుంచి బోయిన్పల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డును ఆరు లైన్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. భారత్ మాల పరి యోజన పథకం కింద ఔటర్ రింగ్ రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే కోదాడ నుంచి ఖమ్మం వరకు జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. బోధన్ మద్దూర్ సెక్షన్ ను ప్రాధాన్యత జాబితాలో చేర్చాలని కోరారు. సంగారెడ్డి నర్సాపూర్ సెక్షన్ నిర్వహణ కొరకు అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. అవుటర్ రింగ్ రోడ్డు అభివృద్ధికి హైబ్రిడ్ యన్యుటీ మోడ్ కింద అనుమతివ్వాలని కోరారు.

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ గౌరవెల్లి వలిగొండ తొర్రూర్ మహబూబ్‌గర్ మధ్య జాతీయ రహదారిగా నోటిఫై చేయాలని కోరారు. అలాగే మెదక్ - ఎల్లారెడ్డి - రుద్రూర్, బోధన్ - బాసర - బైంసా, మెదక్ - సిద్దిపేట - ఎల్కతుర్తి, చౌటుప్పల్ - షాద్నగర్ - కంది మధ్య రాష్ట్రరోడ్లను నేషనల్ హైవే గా నోటిఫై చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి జాతీయ రహదారుల వార్షిక ప్రణాళిక నిధులు మంజూరు పెంచాలని కోరారు.

## 'ఉద్యాన ఉత్పత్తుల అంచనా 56.81 లక్షల మెట్రిక్ టన్నులు'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుకు గణనీయంగా పెరిగిందని రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉద్యాన ఉత్పత్తులు 56.81 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 12.37 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఉద్యాన పంటలు సాగయ్యాయని పేర్కొన్నారు. స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో ఇది 40.5 శాతంగా ఉందని వెల్లడించారు. రైతులు తమ నష్టాలను తగ్గించుకుని లాభాలవైపు అడుగులు వేస్తున్నారని చెప్పడంలో ఇదొక నిదర్శనమని చెప్పారు. ఉద్యాన పంటల సాగుతోనే మెరుగైన లాభాలు వస్తాయని, రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు.



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 15 అక్టోబర్ 2019

## డ్రాగన్ లౌక్యమా? రాజీయా?

చైనాకి అది మామల్లపురం. భారతదేశానికి మహాబలిపురం. పేరులోనే రెండు పార్శ్వాలున్నట్టు మోడీ - జిన్‌పింగ్ సదస్సుకీ రెండు అంతర్ముఖాలున్నాయి. ప్రాచీన శిల్పకళా వైభవానికి నిలయమైన ఆ వేదిక ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువగా ఉపకరించింది? నిజా నికి ఈ సదస్సు సకాలమైనదా అకాలమైనదా అంటే ఒకరికి సకాలం. మరొకరికి అకాలం. ప్రధాని మోడీ కాశ్మీర్‌కి కొత్త చికిత్స మొదలుపెట్టాక ఒక ప్రముఖ విదేశీ అతిధి రావడ మంటే అదొక అగ్ని పరీక్షే. ఇలాంటి సందర్భాన్ని ఎవరికివారు తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నించడం సహజం.



అందులోను ప్రధాని మోడీ ఇలాంటి సవాళ్లను స్వయంగా ఆహ్వానించి ఆస్వాదించే స్వభావం కలిగిఉన్న విషయం బహిరంగమే. అందుకే ఆయనకి ఇది పెద్దగా పరీక్ష అనిపించలేదు. అందుకు తగ్గట్టుగానే ఆయన జిన్‌పింగ్‌కి అతిధి మర్యాదల్లో ఏ లోటూ లేకుండా చూస్తూనే మరోవంక తన సహజ ఆభరణాలను అలవోకగా ప్రదర్శించి అందరి దృష్టినీ తనవైపు మరల్చుకున్నారు. పంచెకట్టు ఆహార్యం ఒక భాగం మాత్రమే. రెండోరోజు ప్రాతఃకాలాన్నే చెన్నయ్ సముద్రతీరాన ప్లాస్టిక్ వస్తువులు ఏరుతూ చాలా దూరం నడిచి యావత్ ప్రపంచాన్నీ తనవైపు తిప్పుకున్నారు. భారతీయ నాయకుల సహజ స్వభావానికి తాను భిన్నమని చాటుకున్నారు. తాను కేవలం మాటల ప్రధానిని కాదని, పర్యావరణ పరిరక్షణకు తానే స్వయంగా నడుం కట్టి రంగంలోకి దిగానని బీచ్ నడక ద్వారా నిరూపించుకున్నారు. ఒక అగ్రదేశపు అధిపతితో శిఖరాగ్ర సదస్సుకు వెళ్లి వ్యాహ్యాళిలో మరో వ్యాపకానికి దిగాలనే ఆలోచనే మోడీ దౌత్య చతురతకు నిదర్శనం. అందుకే ఆ సదస్సుని జిన్‌పింగ్ కంటే మోడీయే ఎక్కువగా ఆస్వాదించినట్టు కనిపించారు. జిన్‌పింగ్‌కీ ఒక సదవకాశం అందుబాటులోకి రాకపోలేదు. భారతదేశంలో అడుగు పెట్టి కాశ్మీర్ పవనాలను అతి దగ్గరగా చూసి గతంలో కన్నా కఠినమైన అభిప్రాయానికి వచ్చే అవకాశమున్నా ఆయన దాన్ని అలా చూడదలుచుకోలేదు. ఈకోణంలో చూసినప్పుడు ప్రధాని మోడీకి జిన్‌పింగ్ పర్యటన అకాలమైనదిగానే భావించాలి. కాని మోడీ తనదైన శైలిలో అలాంటి వాతావరణానికి ఆస్కారం లేకుండా జాగ్రత్తపడ్డారు. అందుకు భిన్నంగా జిన్‌పింగ్‌కి కొందరు టిబెటన్ల నిరసన ప్రదర్శన.. కొద్దిపాటిదే అయినా కాస్తంత చికాకు కలిగించింది. జిన్‌పింగ్‌కి సకాలమైనదిగా దృష్టాంతాలు కనిపించినా, జిన్‌పింగ్ వాటిని తాత్కాలికంగానైనా మనోఫలకం మీదినుంచి తప్పించి మోడీ దౌత్యంతో కలగలిసిపోయే ప్రయత్నం చేశారు. భారత్ రావడం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేస్తున్న పిల్లిమొగ్గలకు కాస్తంత పగ్గం వేసే అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చునని జిన్‌పింగ్ ఒక స్థిరచిత్తంతో వచ్చారు. అంతేకాదు. మరోవంక పాకిస్తాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ తనమీద మరింతగా ఆధారపడేట్టు చేసుకునే సదవకాశం తన చేతుల్లో ఉంటుంది. అయినా ఇది కిందటేడాదే నిర్ణయించిన ముందస్తు అనధికార సదస్సు అన్న విషయాన్ని మరిచిపోకూడదు. స్వదేశానికి విదేశీ అతిధి వచ్చినా లేక విదేశానికి తాను వెళ్లినా తమ కోణంలోనే స్వప్రయోజనాల స్థాయిని నిర్ధారించుకునే డ్రాగన్ దేశపు అధిపతి మహాబలిపురంలో అడుగుపెట్టిన క్షణం నుంచీ మోడీ ఆతిధ్యపు ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూనే గడిపారనుకుంటే పొరపాటే. ఇంకా చెప్పాలంటే మోడీ ఉన్నంత ఆహ్లాదంగా జిన్‌పింగ్ కనిపించలేదు. ఇద్దరు నేతలూ ఎవరికెవరూ తీసిపోని వ్యూహకర్తలే. ఇద్దరూ తమ తమ దేశాల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నవారే. అయినా మోడీదే ముందడుగన్నట్టు కనిపించింది. ఎందుకలా? చైనీయులు ఒకరికి అణిగి ఉండటానికి సుతరామూ ఇష్టపడరు. అంతేకాదు. సార్వభౌమాధికారం తమదే కావాలి గాని మరొకరికి అప్పనంగా అప్పగించడమనేది వారి డిక్షనరీలోనే ఉండదు. అలాంటిది జిన్‌పింగ్ కాస్తంత రాజీపడి మెతకవైఖరితో భారత్‌లో అడుగుపెట్టాల్సి వచ్చింది. అమెరికాతో అమీతుమీ అన్నట్టు వాణిజ్య పోరాటం చేస్తుండొచ్చు గాక. ప్రత్యర్ధి కయ్యానికి కాలు దువ్వినప్పుడు ఇష్టాయిష్టాలతోను, సామర్ధ్యంతోను సంబంధం లేకుండానే రంగంలోకి దిగడం అనివార్యమవుతుంది. వాణిజ్యపోరాటంలో ట్రంప్ తమతో అకారణంగా కయ్యం పెట్టుకున్నారన్నది జిన్‌పింగ్ అభిప్రాయం. అయినా వెనక్కి తగ్గడం తమ చరిత్రలో లేదు కాబట్టి అనివార్యంగా ముందుకి దూకామని అంతర్జాతీయ సమాజానికి చైనా సంకేతాలిచ్చే ప్రయత్నం చేసింది. ఇక ఇక్కడి విషయానికొస్తే అయిష్టాన్ని ఇష్టంగా మలుచుకుని అయినా భారత్‌తో కలిసి నడవాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిన విషయాన్ని జిన్‌పింగ్ మౌనంగానే అంగీకరించారు. ఆ మౌనంలో కాస్తంత నిర్లక్ష్యం ఉంది. ఆ నిర్లక్ష్యంలో కూసింత రాజీతత్వం ఉంది. అందుకే మహాబలిపురంలో రెండు రోజుల పర్యటన ఆసాంతం మోడీయే ఎక్కువ మాట్లాడినట్టు కనిపించింది. జిన్‌పింగ్ అలా ఇష్టంలేని దౌత్యం చేయడానికి స్వీయ కారణాలున్నాయి. త్వరత్వరగా మారిపోతున్న చైనా స్వాభావిక స్వరూపంతో పాటు ఆర్ధిక ముఖచిత్రం మరొక కారణం. చైనాలో పనిచేయగల సామర్ధ్యపు వయసున్నవారి సంఖ్య గణనీయంగా పడిపోతున్నది. మరోవంక భారతదేశంలో బాగా పెరుగుతున్నది. ఈ ఒక్క గణాంకమే ఏదేశ భవిష్యత్తునైనా తలకిందులు చేయగలదు. ఇక గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా చైనాలో శ్రామిక శక్తి మొదటిసారిగా కిందటేడాది తగ్గుముఖం పట్టింది. ఇదే భారతదేశంలో అయితే గణనీయంగా పెరిగింది. ఇంతే కాదు. చైనాలో పొదుపు తగ్గింది. పెట్టుబడులు తగ్గుతున్నాయి. భారత్‌లో కూడా ఇవి అధోముఖంలో ఉన్నాయనుకోండి. తొంభయ్యో దశకం నుంచి చూస్తే మొదటిసారిగా కరెంట్ అకౌంట్ మిగులులో తిరోగమనం రికార్డయింది. దశాబ్దం క్రితం జీడీపీలో రికార్డు స్థాయిలో పది శాతం ఉండగా, 2018లో అది 0.4 శాతానికి తగ్గింది. పెట్టుబడుల విధానం నుంచి వినియోగ విధానంవైపు మళ్లిన నేపథ్యంలో ఈ అంతరం పెరుగుతున్నట్టు చైనా గుర్తించింది. అంతర్జాతీయంగా ధీరగంభీర వదనంతో కనిపించే ప్రయత్నం చేస్తున్న చైనాకు భవిష్యత్తు భయం పట్టుకున్నట్టే అనిపిస్తున్నది. వాణిజ్యపరంగా భారత్‌తో ఉన్న అవకాశాలను గరిష్టంగా ఏస్థాయిలో వినియోగించుకోగలమన్నదే తన పాలనా దక్షతకు గీటురాయిగా జిన్‌పింగ్ గుర్తించారు. మహాబలిపురంలో తొలిరోజు అన్యాపదేశంగా కనిపించిన చైనా అధిపతి రెండోరోజు ద్వైపాక్షిక చర్చల గురించే ఆలోచిస్తూ గడిపారు. సరిహద్దు సమస్యలు, అంతర్జాతీయ వేదికల మీద పాకిస్తానుకు వత్తాసు పలుకుతూ చేసిన ప్రసంగాలు ఆ సమయంలో ఆయన మదిలో మెదిలి కాస్తంత అసౌకర్యానికి గురిచేసి ఉండొచ్చు. అయినా అవన్నీ మరిచిపోయి భారత దేశంతో సరికొత్త మైత్రీబంధానికే ఆయన ప్రాధాన్యమిచ్చారు.

# పేదరికంపై అభిజిత్ శస్త్రం!

మానవాళిని కలవరపెడుతున్న పేదరికం అనే సమస్యకు నినాదాలతోనో, వాగ్దానాలతోనో పరిష్కారం చూపలేమని, నవీన అర్ధశాస్త్ర విధానాలను, సూత్రాలను కనుగొని, క్షేత్రస్థాయిలో ప్రయోగించి, ఫలితాలు పరిశీలించి అమలు చేస్తేనే అంతం చేయగలమని నిరూపించిన ముగ్గురు ఆర్ధికశాస్త్ర నిపుణులు అభిజిత్ బెనర్జీ, అతడి భార్య ఈస్టర్ డఫ్లో, సహచర శాస్త్రవేత్త మైఖేల్ క్రెమెర్‌లను ప్రఖ్యాత నోబెల్ పురస్కారం వరించింది. వీరిలో అభిజిత్ బెనర్జీ భారత్‌లో పుట్టి, పెరిగి, ఎం.ఎ వరకు ఇక్కడే చదివి, ఆ తరువాత హార్వర్డ్‌లో పీహెచ్‌డీ చేసి, అమెరికాలో స్థిరపడ్డారు. రెండేళ్ల క్రితం అమెరికా పౌరసత్వం వచ్చినప్పటికీ, భారతీయ పౌరసత్వాన్ని వదులుకునేందుకు సంఘర్షణకు లోనయ్యాడని, అతడిలో అణువణువూ భారతీయ భావనే నిండి ఉందని బెనర్జీ మాతృమూర్తి నిర్మలా బెనర్జీ చెబుతూ కుమారుడికి నోబెల్ రావడం పట్ల ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బెనర్జీ చిన్నప్పటినుంచీ పుస్తకాల పురుగే అయినా ఆటపాటల్లో పాలుపంచుకునేవాడని, నిన్నరాత్రి తనతో చాలాసేపు మాట్లాడాడని, అయితే నోబెల్ నామినీల్లో తన పేరున్న విషయాన్ని చెప్పనే లేదని ప్రేమతో కూడిన ఫిర్యాదు చేశారు. ఆర్ధికశాస్త్రంలో ఈ బహుమతి పొందిన ముగ్గురూ అందుకు అర్హులేనని ఆమె అన్నారు. బెనర్జీ, క్రెమెర్ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలోని అనేక పేద దేశాల్లో పేదరికాన్ని తుదముట్టించేందుకు ఎన్నో ప్రయోగాలు చేసి, పరిష్కారం చూపారని, ఇక కోడలు ఈస్టర్ డఫ్లో ఇండోనేసియాలో అనేక కార్యక్రమాలు రూపొందించి ఫలితాలు రాబట్టిందని చెప్పారు. భారతీయ సంతతికి చెందిన అభిజిత్ బెనర్జీ పేరు ఇప్పుడు దేశవిదేశాల్లో మార్మోగిపోతోంది. ఆర్థికమాంద్యం కమ్ముకొస్తున్న నేపథ్యంలో ఈ పురస్కారం రావడం కాకతాళీయమే అయినా,పేదరిక నిర్మూలనకు అర్థశాస్త్రం ఎలా ఆయుధంగా మలుచుకోవచ్చో నిరూపించిన బెనర్జీ బృందం కృషి గురించి ఈ సమయంలో తెలుసుకోవడం సగటు భారతీయుడి విధి. చిన్నప్పటినుంచి ఆయన పెరిగిన వాతావరణం, కుటుంబం అంతా ఆర్ధికశాస్త్రంతోనే మిళితమైపోయిన విషయం స్ఫూర్తినిస్తుంది.

**భారత్‌లో మూలాలు:** అభిజిత్ బెనర్జీ విద్యాభ్యాసం అంతా కోల్‌కతాలోనే సాగిపోయింది.

తండ్రి దీపక్ బెనర్జీ కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ వర్శిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేయగా, తల్లి నిర్మలా బెనర్జీ సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ స్టడీస్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసే వారు. ఆయన (ఎకనామిక్స్) గ్రాడ్యుయేషన్ కోల్‌కతా లోను ఢిల్లీలోని జేఎన్‌టీయూలో అర్థశాస్త్రంలో ఎంఏ పూర్తి చేసిన అభిజిత్, పీహెచ్‌డీ కోసం హార్వర్డ్ యూని వర్శిటికి వెళ్లారు. ఆయన సమర్పించిన 'ఎస్సేస్ ఆన్ ఇన్ఫర్మేషన్ ఎకనామిక్స్' సిద్ధాంత వ్యాసాలు ప్రశంలందు కున్నాయి. అనంతరం హార్వర్డ్, ప్రిన్స్‌టౌన్ వర్శిటీల్లోను ఆ తరు వాత ప్రఖ్యాత మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంటర్నేషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు.

**పేదరికంపై క్షేత్రస్థాయిలో యుద్ధం:** కేవలం పాఠాలు చెప్పడం, సిద్ధాంతాలు వల్లెవేయడం వల్ల పేదరికం అంతం కాదని, నవకల్పనలు, క్షేత్రస్థాయిలో అమలు చేయగల సిద్ధాంతాలు అవసరమని భావించిన బెనర్జీ, తనలాంటి దృక్పథంతో ఉన్నవారిని ఎంపిక చేసుకుని కార్యక్షేత్రంలోకి దిగారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ఆర్ధికశాస్త్రం బహుముఖమైనది. ఎన్నో శాఖలు, ఉపశాఖలున్నాయి. డబ్బు, నగదు, బ్యాంకింగ్ ఇలా ఒకదానికొకటి గొలుసుకట్టు బంధం ఉన్న శాస్త్రమిది. అందులోంచి బెనర్జీ ఎంచుకున్న విభాగం 'డెవలప్‌మెంట్ ఎకనమిక్స్'. ఆర్థికవృద్ధి, అభివృద్ధి, వ్యవస్థాపరమైన మార్పులను సూచించే ఈ విభాగంలో నవకల్పనలవల్ల పేదరికాన్ని తరిమికొట్టచ్చన్నది ఆయన విశ్వాసం. ముఖ్యంగా పేద దేశాల్లో ఈ శాస్త్రాన్నే శస్త్రంగా చేసుకుని పేదరికంపై విజయం సాధించొచ్చన్నది ఆయన ప్రగాఢ నమ్మకం. ఆరోగ్యం, విద్య, పనిచేసే కేంద్రాల్లో మేలైన మౌలిక సౌకర్యాల ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చన్నది ఆయన సూత్రీకరణ. సామాజిక, ఆర్ధిక, రాజకీయ కారణాలవల్ల పేదరికం తిష్టవేస్తోందన్నది బెనర్జీ గమనించిన అంశం. అందువల్ల ఆయా వర్గాల జోక్యంతోనే, తన నవీన సూత్రీకరణలను జోడించి పేదదేశాల్లో క్షేత్రస్థాయిలో ప్రయోగాలు చేయాలని సంకల్పించారు.





తనతో పాటు ఆర్ధిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తున్న సహచరి, సహధర్మ చారిణి ఈస్టర్, మరో నిపుణుడు మైఖేల్ క్రెమెర్‌తో కలిసి రంగంలోకి దిగారు. కేవలం ఆశయాల వల్లెవేస్తే చాలదని బెనర్జీ స్వయంగా కొన్ని సంస్థలను నెలకొల్పాడు. మరికొన్ని సంస్థలతో, ప్రభుత్వాలతో జత గట్టాడు. వారి ఆర్థిక సహకారంలో ఆరోగ్య కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. ఇందులో పేద కుటుంబాలను ఆదుకునేందుకు చిన్నపాటి ఆర్థిక ప్రయోజనాలు అందించారు. ఇవన్నీ చిన్నచిన్న కార్యక్రమాలే. పేదలకు లబ్ది చూపించినవే. ముఖ్యంగా ఆహారం, ఆరోగ్యమే లక్ష్యంగా సాగినవి. వీరు చేపట్టిన ప్రతీ ప్రయోగం అనూహ్య విజయాలు సాధించింది. జాంబియాలో తీవ్రమైన పనిఒత్తిడితో అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోయిన పేద కార్మికులకు బెనర్జీ బృందం ప్రయోగాత్మక కార్యక్రమం కొత్త ఊపిరి లూదింది. పనివేళలు తగ్గించడం, పనిచేసే చోట ఆరోగ్యకర పరిస్థితులు నెలకొల్పడం, ఆర్థికంగా సహకరించడం వంటి చిన్నచిన్న కార్యక్రమాలతో సత్ఫలితాలు వచ్చాయి.

**ఫోర్డ్.. జె-పాల్‌తో జతగట్టి:** ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అమెరికన్ సోదరులు ఎడ్సెల్, హెన్రీ ఫోర్డ్‌లు ప్రారంభించిన ప్రఖ్యాత ఫోర్డ్ ఫౌండేషన్‌లో చేరి సేవలందించడం మొదలుపెట్టారు. ఆ తరువాత సౌదీ వ్యాపార దిగ్గజం లతీఫ్ సహకారంతో అబ్దుల్ లతీఫ్ జమీల్ పోవర్టీ యాక్షన్ ప్లాన్ (జె-పాల్) అనే సంస్థను బెనర్జీ స్థాపించారు. సహ వ్యవస్థాపకులుగా తన భార్య ఈస్టర్ డఫ్లో, మరో ఆర్థిక నిపుణుడు సెంథిల్ ముల్లయ్యనాథన్‌లను కలుపుకున్నారు. సూక్ష్మరుణాలు, వ్యవసాయం, ప్రజారోగ్యం, సమర్ధ వ్యవస్థల రూపకల్పన వంటి సామాన్య అంశాలపై దృష్టి సారించారు. పేదదేశాల్లో మరికొందరు ఔత్సాహిక ఆర్థిక నిపుణులను తమ క్షేత్రస్థాయి ప్రయోగాల్లో చేర్చుకున్నారు. కడుపు నిండా తిండి, చక్కటి ఆరోగ్యం కల్పిస్తే మంచి విద్యకోసం పిల్లలు బడులకు వస్తారని, అది పేదరిక నిర్మూలనలో తొలి మెట్టని వీరంతా భావించారు. అతి పేదరికం తిష్టవేసిన కెన్యావంటి దేశాలపై వీరు దృష్టి సారించారు. అభిజిత్ బెనర్జీ బృందంతో 81 దేశాలకు చెందిన 170 మంది ఆర్థిక నిపుణులు తోడయ్యారు. వారు చేపట్టిన తొలి ప్రయోగం 'డీ-వార్మింగ్'. నవజాత శిశువులు, బడికి వెళ్లే పిల్లలను వేధించే నులిపురుగులు, ఇతర పరాన్నజీవుల వంటివాటి బెడద లేకుండా చేసే కార్యక్రమం ఇది. చైనాలోనూ వీరు ఈ ప్రయోగం చేశారు. పౌష్టికారం అందించడం, రోగనిరోధక శక్తిని పెంచడం, రోగాలను నిరోధించే టీకాల కార్యక్రమాన్ని విస్తృతం చేయడం ద్వారా దాదాపు 40 కోట్లమందికి దీనివల్ల లబ్ధికలిగి మేలైన పరిస్థితులు ఏర్పడడంతో వీరిలో ఉత్సాహం రెట్టింపయింది. ఇలాంటి కార్యక్రమాలను విస్తృతం చేయడానికి 1500మందికి ఈ సంస్థలు శిక్షణ ఇచ్చాయి. చిన్నచిన్నవే అయినా ఆయా దేశాల్లోని పరిస్థితులను బట్టి 948 రకాల కార్యక్రమాలను ఈ సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీరి ప్రయోగాలకు చాలా దేశాలు మద్దతు ఇస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి అయితే అభిజిత్ బెనర్జీకి ఎంతో గౌరవం ఇచ్చింది. ప్రపంచంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడానికి చేపట్టిన 'మిలీనియం గోల్స్' కార్యక్రమానికి బెనర్జీని సలహాదారుగా నియమించింది.

**భారత్‌లో కార్యక్రమాలు:** తన మాతృభూమి భారత్‌లోనూ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టడానికి అభిజిత్ బెనర్జీ బృందం ఆసక్తి చూపింది. జె-పాల్‌తో పాటు ధ్రువ కొఠారీ సంస్థతో కలిసి పిల్లల్లో రోగనిరోధకశక్తిని పెంచే (ఫుల్ ఇమ్యునైజేషన్) విస్తృత కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతీ పల్లెకు సంచార వైద్యశాలల ద్వారా సేవలు, ప్రచారం చేయడం, పిల్లల తల్లిదండ్రులకు చిన్నచిన్న ఆర్థిక తాయిలాలు ఇవ్వడం ద్వారా ఈ ప్రజారోగ్య కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. బెనర్జీ, ఈస్టర్‌లకు తోడుగా రాచెల్ గ్లెన్నెర్‌స్టర్ కూడా రంగంలోకి దిగారు. ఇన్నోవేషన్స్ ఇన్ డేటా అండ్ ఎక్స్‌పర్‌మెంట్స్ ఫర్ యాక్షన్ ఇనీషియేటివ్ (ఐడియా)వంటి సంస్థలతో కలిసి డేటా, సమాచార మార్పిడి, ఫండింగ్, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కోసం పనిచేస్తున్నారు. భారత్‌లో త్వరలో ఏర్పాటు చేయబోతున్న 'పక్ష' సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయానికి ఆయన అకడమిక్ సలహాదారుగా వ్యవహరించబోతున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఆయన దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, భారతీయ ఆర్థిక విధానాల్లో వస్తున్న మార్పులు, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా, తరచుగా వెల్లడిస్తూనే ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏఐసీసీ సారథి రాహుల్‌గాంధీ ప్రకటించిన 'న్యాయ్' పథకం మంచిదే అయినా, క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి పకడ్బందీ మౌలిక వసతులు, కార్యాలయ వ్యవస్థ లేకపోతే విఫలమవుతుందని హెచ్చరించారు. సంపన్న కుటుంబంలోనే పుట్టినా పేదరికంపై దృష్టి సారించడానికి అసలు కారణం తల్లిదండ్రులిద్దరూ ఎకనమిస్టులే కావడం. అమెరికాలో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న తొలి వివాహం చేసుకున్న అరుంధతి కూడా ఆంగ్లసాహిత్యంలో దిట్ట. వారు విడిపోయిన తరువాత, తన సహచరి, ఆర్థిక శాస్త్రవేత్త అయిన ఫ్రెంచ్ అమెరికన్ ఈస్టర్‌తో రెండేళ్లు సహజీవనం చేసి, 2015లో వివాహం చేసుకుని జీవితాన్ని పంచుకున్న అభిజిత్ ఇప్పుడు ఆమెతో కలసి నోబెల్‌ను అందుకోవడం విశేషం. ఈయన మంచి రచయిత కూడా. 2011లో ఆయన రాసిన 'పూర్ ఎకనమిక్స్' కు గోల్డ్‌మ్యాన్స్ శాష్ బిజినెస్ బుక్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. ఇకసతీమణి ఈస్టర్ డఫ్లోతో కలసి రాసిన 'గుడ్ ఎకనమిక్స్ ఇన్ హార్డ్ టైమ్స్' ఈనెలలోనే విడుదల కాబోతోంది. దేశంలో మాంద్యం మాటువేసిన ఈ పరిస్థితుల్లో బెనర్జీ దంపతుల ఈ పుస్తకం తరుణోపాయాలు సూచిస్తుందేమో చూడాలి.



**- ఎస్.కె.రామానుజం**

# విజ్ఞాన సరోవరం



గ్రంథాలయం రూపాన్ని బట్టి చైతన్యం లేని దైన, కార్యక్రమాలు అనుసరించి, పాఠకులకు అందించే విజ్ఞానాన్ని అనుసరించి నిత్యం చైతన్యవంతమైంది. తెలుగు భాషాభిమానులకు, సాహిత్యాభిమానులకు వేటపాలెంలోని తెలుగు నేలపై వెలసిన విజ్ఞాన శిఖరం సారస్వత నికేతనం గ్రంథాలయం గురించి మన తెలుగు రాష్ట్రాలలో తెలియని వారుండరు. నేటి ఈ ఇంటెర్నెట్ యుగంలో కూడా ఈ గ్రంథాలయం నిత్యం పాఠకుల తాకిడితో అద్భుతమైన గ్రంథ సంపదతో అలరారుతున్న విజ్ఞాన సరోవరం. ఎక్కడైనా గ్రంథాలయం మన కు విజ్ఞానాన్ని పంచుతుంది... కానీ ఇక్కడకు వెళ్తే దేశభక్తి పెరుగు తుంది. జాతీయోద్యమం కళ్లకు కడుతుంది. ఎంతోమంది నాయ కుల జ్ఞాపకాలు మనల్ని పలకరిస్తాయి. ఆనాటి పత్రికలు మనల్ని చదవమంటూ ఆహ్వా నిస్తాయి.ఈ గ్రంథాలయం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో సరిగ్గా విజయ దశమి రోజున అక్టోబర్ 15వ తేదిన 1918లో ''హిందూ యువ జన సంఘం'' అనే పేరుతో ఊటుకూరు వెంకటసుబ్బయ్య శ్రేష్టి పూనికతో పురుడుపోసు కుంది. ఒకనాడు ఈ గ్రంథాలయం రెండు దిన పత్రికలు, మూడు నాలుగు వార పత్రికలు, 62 పుస్తకాలతో ప్రారంభించబడింది అనతికాలంలోనే ఉన్నత శిఖరాలకు చేరుకున్నది.

ఆర్థిక వనరుల లేమితో 1922లో ఈ గ్రంథాలయం మూసివేయాల్సిన పరిస్థితి రాగా నాడు వేటపాలెంలో ఉన్నటువంటి కొందరు యువకులు, తెలుగు భాషాభిమానులు, స్వాతంత్ర సమరయోధులు, సాహితీ ప్రియులందరు కలిసి చందాలు సేకరించారు. దీనికై మొట్టమొదటగా సుబ్బయ్యశ్రేష్టి నాలుగువేల రూపాయల అప్పులు తీర్చడం, మూడు వేల రూపాయల నగదును అదేవిధంగా రెండువేల రూపాయల విలువ కలిగిన పుస్తకాలు ఈ గ్రంథాలయానికి విరాళంగా ఇచ్చారు. దాదాపు పది వేల రూపాయలు చందాలు సేకరించారు. 1922 లో ఈ గ్రంథాలయానికి ''సారస్వత నికేతనం'' అని నామకరణం చేసారు. ఇలా సేకరించిన విరాళాలతో 1923 లో ఒక చిన్న ఇంటిని కొని దాన్నిరిపేరు చేయించి 1924 సెప్టెంబర్ 1వ తేదీన నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనంగా మార్చారు. ఈ భవనాన్ని గాంధీ గారి మిత్రుడు సేఠ్ చమన్‌లాల్ భజాజ్‌చే ప్రారంభించబడింది. భారత దేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు చెప్పినట్లు గ్రంథాలయం ఒక సజీవ సంస్థ, జీవమున్న ప్రాణి లాగా ఇది కూడా దిన దినాభివృద్ధి చెందే సంస్థ, పెరుగుదల దీని సహజ గుణం, ఈ పెరుగుదల అన్ని కోణాల నుండి గ్రంథాలయ భవనం, చదువరులు, సిబ్బంది, పుస్తకాలు, వాటి వర్గీకరణ - సూచీకరణం ఇలా ప్రతి విషయంలో పెరుగుదలనే అనతికాలంలోనే ఈ గ్రంథాలయం ఎంతోఅభివృద్ధి చెందింది.

1928 కాలంలో నిత్యం ఈ గ్రంథాలయానికి దాదాపు 150-200 వరకు పాఠకులు వచ్చేవారు. పాఠకుల తాకిడికి రాను రాను పెరగడంతో నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. నూతన భవన నిర్మాణం కొరకు దాతల నుండి విరాళాలు సేకరించారు. 19.4.1929 నాడు ఆంధ్ర దేశ పర్యటనకు విచ్చేసిన బాపూజీ చేతుల మీదుగా ఈ భవనానికి పునాది వేయబడింది. ఆది నుండి ఈ గ్రంథాలయానికి శ్రేష్టి, వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. అందుకే ఈ గ్రంథాలయ భవనానికి ''మీనాక్షమ్మ కోటిలింగం శ్రేష్టి స్మారక మందిరం'' అని పేరు పెట్టారు. 1930లో ఈ గ్రంథాలయ భవనాన్ని ఉక్కు మనిషి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ గ్రంథాలయాన్ని దేవాలయంలా భావించి 22 నవంబర్ 1935 నాడు నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ ఈగ్రంథాలయం ముందు భాగంలో ధ్వజస్తంభం ప్రతిష్టించడం జరిగింది.

శ్రేష్టి ఈ గ్రంథాలయానికి అత్యధికంగా సమయం కేటాయిస్తూ అమూల్యమైన గ్రంథాలు వివిధ ప్రాంతాల, వివిధ గ్రంథాలయాల నుంచి కొన్నిసార్లు కన్నెమోరా పబ్లిక్ గ్రంథాలయం నుండి కూడా పుస్తకాలు సేకరించేవారు. ౧. శ్రేష్టి౧ మరణానంతరం ఈ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు 4.78 ఎకరాల భూమిని, 2.5 మాగాణిని గ్రంథాలయానికి వీలునామా వ్రాసారు. ఈ పొలాలను/భూమిని అమ్మగా వచ్చినటువంటి డబ్బులను గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడానికి ఉపయోగించారు.

శ్రేష్టి అనంతరం వారి ధర్మపత్ని కమలమ్మ గ్రంథాలయ బాధ్యతను తన భుజాలకు ఎత్తుకున్నారు. 1956లో సొంత ఖర్చుతో వరండాను నిర్మించి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారు. వీరి తదనంతరం కాకపర్తి జ్వాలా నరసింహారావు, సుబ్బా రావు సొంత నిధులు, ప్రభుత్వ సహాయంతో సుబ్బరాయమహల్పైన కమలాంబ స్మారక మందిరం నిర్మించి వారు గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించారు. న్న ఈ జ్ఞాన మందిరంలో దాదాపు లక్ష పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి వాటిలో ఎన్ సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా, వరల్డ్ బుక్ ఆఫ్ ఎన్ సైక్లో పీడియా, సర్వసాలు, నిఘంటువులు, తెలుగు, మరాఠీ, గుజరాతి, తమిళం, లాటిన్, హిందీ, ఇంగ్లీష్ భాషలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి, వీటితో పాటు వందల సంఖ్యలో తాళపత్ర గ్రంథాలు అందు బాటులోఉన్నాయి.

రెండుసార్లు బాపూజీ వేటపాలెం వచ్చారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా 1929లో ఇక్కడకు వచ్చిన మహాత్ముడు గ్రంథాలయ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. 1935లో మరోసారి వచ్చారు. ఆయన గుర్తుగా గ్రంథాలయంలో నూలు వడికే గాంధీ విగ్రహం ఉంది. ఆయన జీవిత చరిత్ర, బోధనలకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో దాదాపు 2 వేల పైచిలుకు పుస్తకాలున్నాయి. గాంధీ సొంతంగా రాసిన పుస్తకాలూ వీటిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ సారస్వత నిలయం దాతల సహకారంతోనే మనుగడ సాగించింది. ప్రవాస భారతీయురాలు దీనికి సహకారం అవివిధ దేశాల నుంచి అమెరికా జపాన్ ఆస్ట్రేలియా పరిశోధకులు ఇక్కడ ఉన్నటువంటి అరుదైన గ్రంథాలను తాళ పత్ర గ్రంథాలను పరిశోధన చేస్తున్నారు. ఈ గ్రంథాలయంలో పిల్లల విభాగం, వార్తా పత్రికల విభాగం, పరిశోధన విభాగం, రిఫరెన్స్ విభాగం, స్త్రీల విభాగాలు ఉన్నాయి. చీరాల పేరాల ఉద్యమం జరిగినప్పుడు గాంధీగారు ఈ గ్రంథాలయానికి విచ్చేసారు. గ్రంథాలయానికి విచ్చేసిన సంద ర్భంలో వారి చేతి కర్ర పాడై పోవడం వలన గ్రంథాలయంలోనే వదిలి వెళ్లారు అది ఇప్పటికీ ఆ గ్రంథాలయంలో సందర్శకుల కోసం ఉంచడం జరిగింది.

**-డా. రవికుమార్ చేగొని**
ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ గ్రంథాలయ సంఘం

# మహా స్వాప్నికుడు!

**నేడు అబ్దుల్ కలాం జయంతి**

''కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి'' అంటూ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎప్పుడూ విద్యార్థులకు చెపుతూ ఉండేవారు. 'చిన్న లక్ష్యం కలిగి ఉండటమనేది పెద్ద నేరంతో సమానమని' ఆయన బోధించేవారు. శాస్త్రవేత్తగా విద్యావేత్తగా, అధ్యాపకునిగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలు అమూ ల్య మైనవి. అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 1931 అక్టోబర్ 15న తమిళ నాడులోని రామేశ్వరంలో జైనులబ్దీన్, అషియమ్మ దంపతులకు జన్మించారు. కలాంది పేద కుటుంబం కావడం వల్ల కుటుంబ అవస రాల నిమిత్తం ఆయన చిన్నతనంలో వార్తాపత్రికలు అమ్మేవారు. చదువులో సాధారణ విద్యార్థిగా ఉన్నా కొత్త విషయా లు నేర్చుకో వడంలో ఆయన ఆసక్తి కనబర్చేవారు. రామనా థపురంలో సెకండరీ విద్యను పూర్తిచేసుకొన్న ఆయన భౌతిక శాస్త్రం లో డిగ్రీ పట్టాను 1954లో పొందారు. ఇంజనీరింగ్‌ను చదవాలనే తాపత్రయంతో 1955లో ఆయన మద్రాసు వెళ్ళారు. 1960లో ది మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఇంజనీరింగ్ పట్టా పొంది డిఆర్‌డిఓ లో శాస్త్రవేత్తగా చేరారు. ఆ తరువాత ఇస్రోలో సేవలందించారు. 1963 తరువాత కలాం పలుదేశాలలో పర్యటించారు. 60వ దశకంలో భారత్ పాకిస్తాన్, చైనా వంటి దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చింది. అప్పుడే భారత రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉన్నదని కలాం గుర్తించారు. ఆయన ఇస్రోలో పనిచేసినప్పుడు పిఎస్ఎల్‌వి, ఎస్ఎల్‌వి3 వంటి ప్రాజెక్టుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1970వ దశకంలో బాలిస్టిక్ క్షిపణులు తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు డెవిల్, ప్రాజెక్టు వాలియంట్‌లలో ప్రముఖ పాత్ర పోషించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అగ్ని, పృధ్వి వంటి క్షిపణుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. 1998లో భారత్ రెండవ దఫా నిర్వహించిన అణు పరీక్షలలో చురుకైనపాత్ర పోషించారు. 2002 నుండి 2007 వరకు భారత 11వ రాష్ట్రపతిగా దేశానికి సేవలం దించారు. పదవీ కాలం ముగిసిన వెంటనే ఆయన అధ్యాపక వృత్తిని చేపట్టారు. దేశంలో పలు విశ్వవిద్యాలయాలను సందర్శించి తన ప్రసంగాలతో విద్యార్థులను ఉత్తేజపరిచేవారు 40కి పైగా విశ్వవి ద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌లు ప్రధానం చేసాయి. 1997లో ఆయనను భారతరత్న వరించింది. ప్రముఖ రచయిత అరుణ్ తివారితో కలిసి ఆయన తన ఆత్మకథను ''వింగ్స్ ఆఫ్ ఫైర్'' పేరుతో వెలువరించారు. బ్రహ్మోస్ వంటి సూపర్ సానిక్ మిస్సైల్‌ని భారత్ తయారు చేయగలిగిందంటే క్షిపణి రంగంలో కలాం వేసిన గట్టి పునాదులే కారణం. అందుకే ఆయనను భారత క్షిపణి పితామహుడిగా పిలుస్తారు. 2015 జూన్ 27న కలాం షిల్లాంగ్‌లోని ఐఐఎంలో ప్రసంగిస్తుండగా తీవ్రమైన గుండెపోటుతో తన 83వ ఏట తుదిశ్వాస విడిచారు.

''ఒక క్షిపణి ప్రయోగం విఫలమైతే నాయకుడిగా అపజయం నాది, అదే ప్రయోగం విజయవంతమతే ఆ ఘనత మనందరిది'' అని కలాం తన సహచరులతో ఎప్పుడూ అనేవారు. నిర్మలత్వం, కష్టించే తత్వం, సమిష్టితత్వం వంటి లక్షణాలను కలాం నుండి నేటితరం నేర్చుకోవలసిన అవసరం ఉంది.

**-యం.రాంప్రదీప్**
జన విజ్ఞాన వేదిక, 9492712836

## అందరికీ ఆదర్శం కలాం

కోట్లాది మంది భారతీయులకు ఆదర్శవంతుడు
లక్షలాది చిన్నారులకు ఆరాధ్యుడు
వేలాదిమంది శాస్త్రవేత్తలకు ఆచరణీయుడు
వందలాది మంది నాయకులకు మార్గదర్శకుడు..

రాష్ట్రపతుల్లో అగ్రగణ్యుడు
భారతరత్నగా మెరిసిన కార్మోన్ముఖుడు
పదుల సంఖ్యలో ఉన్న మహాత్ములకు
సరి సమానుడు ఈ ధరిత్రీ అభిమాన పుత్రుడు..

నీవు పలికిన పలుకే మాకు స్ఫూర్తి మంత్రం
నీ కర్తవ్య బోధనే మాలో రగిలే తారకమంత్రం
నీ అలుపెరుగని కృషే నిత్యచైతన్య సూత్రం
నీ ప్రవర్తనే నీవు నేర్పే మానవతా ధర్మం..!

విద్యార్థి లోకం మరువదు మీరు నింపిన స్ఫూర్తిని
జాతి ఎప్పుడూ మర్చిపోదు మీ అద్భుత కృషిని
దేశం ఎప్పటికీ కీర్తిస్తుంది మీ త్యాగ నిరతిని
ప్రపంచం ఎప్పుడూ గుర్తిస్తుంది మీరు పడ్డ కష్టాన్ని

అందుకే అయ్యారు అందరికీ ఆదర్శం
ఎప్పటికీ మర్చిపోము మీరు చూపిన మార్గం!



**-కాళంరాజు వేణుగోపాల్**
8106204412



## ఆత్మహత్యలకు పాల్పడొద్దు

• సురేందర్‌గౌడ్‌కి ఆర్టీసీ జేఏసీ నేతల నివాళి

**హైదరాబాద్ (కార్వాన్), ప్రభన్యూస్:** సమ్మె నేపథ్యంలో ఎవరూ ఆందోళనకు గురికావద్దని, సహనంతో వ్యవహరించాలని, కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడ వద్దని సహచర కార్మిక నేతలను ఆర్టీసీ జేఏసీ నాయకుడు అశ్వత్థామ రెడ్డి కోరారు. కార్వాన్‌లోని కుల్సుంపురలో ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన కండక్టర్ సురేందర్ గౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించిన అశ్వత్థామ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చేవరకు సమ్మె చేయాలని, అయితే ఆందోళనకు గురై ప్రాణాలు తీసుకోవద్దని అన్నారు. సీపీఐ నారాయణ, బీసీ సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రగతిశీల మహిళా సమాఖ్య నేత సంధ్య, టీడీపీ రాష్ట్ర నేత ఎల్.రమణ, ఐఎఫ్‌టీయూ నేతలు, తెలంగాణ జనసమితి నేతలు, మాదిగ దండోర నేతలు నివాళులర్పించి సురేందర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### ప్రతిపక్ష నేతల పరామర్శ



ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ కండక్టర్ సురేందర్ గౌడ్ మృతదేహాన్ని భాజపా, సీపీఎం, టీజేఎస్, ఎమ్మార్పీఎస్ నేతలు పరామర్శించి నివాళులర్పించారు. సోమవారం కార్వాన్‌లోని సురేందర్ గౌడ్ ఇంటికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి తదితర నేతలు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో బంద్‌ను భాజపా నేతలు పాటించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. హక్కులను పోరాడి సాధించుకుందామని, కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని సంయమనం పాటించాలని కోరారు.

**ఆత్మహత్యలు బాధాకరం: శ్రీధర్ రెడ్డి**

ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని భాజపా రాష్ట్ర శాఖ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న రవాణా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మెను విరమింప చేసే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం మొండి పట్టుదలకు పోతోందని ఆయన విమర్శించారు.

## ఆత్మహత్యలు కలచివేశాయి: చంద్రబాబు

**అమరావతి, ఆంధ్రప్రభ:** తెలంగాణలో ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఇరువురు కార్మికులు మనస్తాపంతో ఆత్యహత్యలకు పాల్పడటం తనను ఎంతగానో కలచివేసిందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం టీఎస్ ఆర్టీసీ సమ్మెపై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన జీవితం ఎంతో విలువైందని, ఏదైనా బతికి సాధించాలే గాని బలవన్మరణాలు పరిష్కారం కాదని హితవు పలికారు. ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించాలని ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కార్మికులు తమ కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు.

## సమ్మెకు మద్దతిస్తే తప్పేంటి?: తమ్మినేని



**హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ, ప్రభన్యూస్:** ఆర్టీసీ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రత కోసం సమ్మె చేస్తుంటే, మద్దతు ఇస్తున్న పార్టీలను, ప్రజా సంఘాలను నేరస్థులుగా చెప్పటం హాస్యాస్పదమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా జరుగుతున్న సంపూర్ణ సంఘీభావ సభకు, వంటావార్పు కార్యక్రమానికి హాజరైన తమ్మినేని మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలను వక్రీకరించడం సరికాదన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోందని, రెచ్చగొట్టినంతమాత్రాన ఎవరైనా ఆత్మహత్యలు చేసుకుంటారా అని తమ్మినేని ప్రశ్నించారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతం అవుతుందని, సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో నియంత పాలన తగదని హెచ్చరించారు.

## విచక్షణతో నిర్ణయం తీసుకోండి: కొండా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో సీఎం కేసీఆర్ విచక్షణతో ఆలోచించాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ సంక్షోభం రోజు రోజుకు తీవ్రమవుతున్నదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు సురేష్ డిమాండ్ చేశారు. కండక్టర్ సురేందర్‌గౌడ్ పార్థీవ దేహానికి బీసీ సంఘం నేతలు నివాళులు అర్పించారు.

## బంద్‌కు జనసేన మద్దతు



ఆర్టీసీ కార్మికుల సమ్మెలలో భాగంగా ఆర్టీసీ జేఏసీ ఈ నెల 19న ఇచ్చిన బంద్‌కు జనసేన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు జనసైనికులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. బంద్ సందర్భంగా హింసకు తావులేకుండా, శాంతియుతంగా నిరసనలు తెలిపాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె, బంద్‌పై సోమవారం ఆయన పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పవన్ కళ్యాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చిందని, ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాస్ రెడ్డి, రాణిగంజ్ డిపోకు చెందిన కండక్టర్ సురేందర్‌గౌడ్ అనే కార్మికులు బలవ్మరణానికి పాల్పడిన ఘటనలు సమ్మె తీవ్రతను తెలియజేశాయని పవన్ పేర్కొన్నారు.

## మెట్రో రైళ్లలో ప్రయాణికుల రద్దీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్‌లో మెట్రో రైలులో తిరిగే ప్రయాణీకుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. సమ్మె ప్రారంభమైన రోజునుంచి సోమవారం రాత్రి 7 గంటల వరకు మెట్రో రైలులో మొత్తం మూడు లక్షలకుపైగా ప్రయాణీకులు తమ గమ్యస్థానాలకు వెళ్ళారని మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వరకు ప్రయాణీకుల సంఖ్య 3 లక్షల 80 వేలకు చేరే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

## ఏపీలో 'కియా' ఎదుట ధర్నా

**పెనుకొండ టౌన్, ప్రభన్యూస్:** అనంతపురం జిల్లాపెనుకొండ మండలం ఎర్రమంచిలో వున్న కియా కార్ల పరిశ్రమ ఎదుట సోమవారం కియా పరిశ్రమలకు భూములు కోల్పోయిన రైతన్నలు, నిరుద్యోగ యువతీయువకులు జాతీయ రహదారిపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. బాధిత రైతులు మాట్లాడుతూ కియా పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇస్తామని యాజమాన్యం గతంలో పేర్కొందని, అయితే ఇప్పుడు స్థానికంగా వారికి అన్యాయం చేస్తూ తమిళులకు పెద్ద పీట వేస్తున్నారని, అదేవిధంగా భూములు కోల్పోయిన కుటుంబాలకు చెందిన వ్యక్తులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కియా ఎస్ఐ నారాయణ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ధర్నా కార్యక్రమం విరమించాలని వారిని కోరడంతో వారు సమ్మతించారు.

# పదో రోజూ అదే పరిస్థితి

• తీరని ప్రయాణికుల అవస్థలు • అనుభవం లేని డ్రైవర్లతో ప్రమాదాలు



బస్ భవన్‌ను ముట్టడించిన వామపక్ష విద్యార్థి సంఘాలు



హైదరాబాద్‌లో బ్లేడ్‌తో చేయి కోసుకున్న కార్మికుడు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పది రోజులుగా ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కకపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు తారాస్థాయికి చేరాయి. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు రోజుకో తరహాలో నిరసనలను తెలియజేస్తున్నారు. తాజాగా సోమవారం మరో కార్మికుడు బ్లేడ్‌తో మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా అడ్డుకున్న కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. దీంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపో వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. హెచ్‌సీయూ డిపో ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టినపుడు ఇది జరిగింది. కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని, పోరాడి హక్కులు సాధించుకుందామని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

### బస్‌భవన్ ముట్టడి

ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం బస్‌భవన్‌ను ముట్టడించాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు తదితర సంఘాలకు చెందిన విద్యార్థులు సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్‌భవన్ ముందు బైఠాయించారు. పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లకు తరలించారు. దీంతో కొంత సేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరో వైపు ఆర్టీసీ కార్మికులు ముషీరాబాద్ డిపో ముందు ఆందోళన చేపట్టారు. ఖమ్మం ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి, రాణిగంజ్ డిపో కండక్టర్ సురేందర్‌గౌడ్‌లకు నివాళులర్పించిన కార్మికులు ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.

**సంగారెడ్డిలో టాటా ఏస్‌ను ఢీకొట్టిన బస్సు**
**ఇద్దరి మృతి, 10 మందికి గాయాలు**



సంగారెడ్డి ప్రమాద బాధితులు

సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం తాత్కాలిక సిబ్బందితో బస్సులను నడిపిస్తోంది. తాత్కాలిక సిబ్బందిలో కొంత మంది కారణంగా బస్సు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడచిన 10 రోజులుగా రోజూ ఏదో ఒక చోట ప్రమాదం చోటు చేసుకుంటున్నప్పటికీ సోమవారం ఒక్కరోజే పలు చోట్ల ప్రమాదాలు జరిగాయి. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ చౌరస్తా వద్ద టాటాఏస్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 10 మందికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న బస్సును వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీ కొట్టింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. నల్గొండ జిల్లా హాలియా బస్టాండ్‌లో బస్సు దిగుతున్న ప్రయాణికుడి కాలుపై నుంచి బస్సు చక్రం వెళ్ళడంతో గాయపడ్డాడు. చంద్రకాంత్ అనే యువకుడు అనుముల మండలం నుంచి హాలియాకు వచ్చాడని ప్రయాణికులు తెలిపారు. నార్కట్‌పల్లి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

### టీఎన్జీవో నేతపై మండిపడ్డ నేతలు

ఆర్టీసీ సమస్యలు, సమ్మెపై అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలతో మాట్లాడామని ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి అన్నారు. టీఎన్జీవో నేత కారం రవీందర్ రెడ్డి మాట్లాడిన మాటలు కరెక్ట్ కాదని కొట్టి పారేశారు. సమ్మెకు మద్దతివ్వాలని టీఎన్జీవోలను ఇప్పటికే కోరడం జరిగిందన్నారు. ఆదివారం కూడా టీ ఎన్జీవో నేతలతో కలవాలనుకున్నామని, అయితే డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి మరణించడంతో వీలు కాలేదన్నారు. త్వరలోనే ఉద్యోగ సంఘాలతో భేటీ అవుతామన్నారు. ఆర్టీసీ జేఏసీతో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదని, ఏ రాజకీయ నేతతో ఒప్పందాలు లేవని స్పష్టం చేశారు. సీఎంను టీఎన్జీవో నేతలు కలవడంపై మేమెప్పుడూ అభ్యంతరం తెలపలేదన్నారు.

## గవర్నర్‌ను కలిసిన జేఏసీ నేతలు



ఆర్టీసీ సమ్మెకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ నేతలు సోమ వారం గవర్నర్ తమిళిసైని కలిసి వినతిపత్రం సమర్పించారు. తాము సమ్మెకు వెళ్ళాల్సిన పరిస్థితులపై సవివరంగా తెలియ జేస్తూ జేఏసీ నేతలు గవర్నర్‌కు వినతిపత్రం అందించారు. చట్టం పరిధిలోనే సమ్మెకు వెళ్ళామని, సమ్మె లోకి వెళ్తున్న విషయాన్ని ముందుగానే యాజమాన్యానికి నోటీసులు ఇచ్చామని పేర్కొ న్నారు. సమ్మె నివారణకు ఏ మాత్రం ప్రయత్నించని ప్రభుత్వం ఏకంగా 48 వేలమంది కార్మికుల ఉద్యోగాలు పోయాయంటూ ప్రకటించిందని, దీంతో చాలామంది కార్మికులు ఆవే దనకు గురయ్యారన్నారు. కొంతమంది కార్మికులు గుండె ఆగి చనిపోతే, మరికొంత మంది బలవ న్మరణాలకు పాల్పడుతున్నారన్నారని పేర్కొన్నారు. సంస్థ స్థితిగతులు, ప్రభుత్వం వాడుకున్న డబ్బులు తదితర వాటిపై కూడా ప్రతినిధి బృందం గవర్నర్‌కు తెలియజేసింది. అనంతరం రాజ్‌భవన్ వద్ద మీడి యాతో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, కో కన్వీనర్‌లు రాజిరెడ్డి, వీఎస్ రావు తదితరులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలోనూ ఇంతటి దుర్మార్గాన్ని చూడలేదన్నారు. మంత్రులు రోజుకో రకంగా మాట్లాడుతూ కార్మికులను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో స్వేచ్ఛలేదని, రాష్ట్రంలో జరుగుతున్న దహనకాండపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు.

## మా హెల్ప్‌లైన్‌కు ఎవరూ ఫోన్ చేయలేదు

• సోషల్ మీడియా కథనాలు అవాస్తవం • బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సీఎంవో ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు, రవాణా వ్యవస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి కార్యాలయం హెల్ప్‌లైన్‌కు ఎవరూ ఫోన్ చేయలేదని, ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ పరిణామాలకు సీఎం కేసీఆర్ కారణమని సీఎంవో హెల్ప్‌లైన్‌కు కొందరు వ్యక్తులు ఫిర్యాదులు చేసినట్లు వెలువడిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు.

ఎవరో ఫోన్ చేసినట్లు... తమ అభిప్రాయాలు చెప్పినట్లు... గత రెండు రోజులుగా వివిధ సామాజిక మాధ్యమాల్లో, వార్తా పత్రికల్లో, ఛానళ్ళలో తప్పుడు ప్రచారం జరుగుతోందని సీఎంవో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సీఎం కార్యాలయ సిబ్బంది మాట్లాడినట్లు ఎవరో ఫేస్‌బుక్ వాయిస్ సృష్టించారని, ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని, అవాస్తవాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ప్రకటన ద్వారా తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని సీఎంవో అధికారులు పోలీసులను ఆదేశించారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా బంద్ సంపూర్ణం



బంద్ కారణంగా నిర్మానుష్యంగా మారిన ఖమ్మం బస్టాండ్

**ఖమ్మం, ప్రభ న్యూస్ సిటీ బ్యూరో :** ఖమ్మం డిపోకు ఆర్టీసీ కార్మికుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి మరణం ప్రభుత్వ హత్యగా అభివర్ణిస్తూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. అఖిలపక్ష రాజకీయ పార్టీల మద్దతుతో ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ జేఏసీ సోమవారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆర్టీసీ బస్సులు అన్ని డిపోల్లో కదలకుండా నిలిచిపోయాయి. వర్తక వ్యాపార సంస్థలు, దుకాణాల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు ఇచ్చాయి. హోటళ్లు, పెట్రోల్ బంక్‌లను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు మూతపడ్డాయి. ఆందోళనకారులు బ్యాంకులను మూసివేయించారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆరు డిపోల పరిధిలోని ఏ ఒక్క బస్సు కూడా డిపో నుంచి బయటకు రాలేదు. ఆందోళనకారులు తెల్లవారుజాము నుంచే డిపోల గేట్ల ముందు బైఠాయించారు. ఖమ్మం బస్టాండ్ వద్ద అఖిలపక్ష రాజకీయపార్టీల నేతలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బంద్‌కు మద్దతుగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఖమ్మంలో జరిగిన ఆందోళనలో సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు.

## విలీనమెలాగో కేంద్రమే చెప్పాలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కేంద్ర ప్రభుత్వం వాటా కూడా ఉన్నందున ఆర్టీసీ విలీనంపైన, కార్మికుల సమ్మె పరిష్కార మార్గాలేమిటో చెప్పాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మంత్రి తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు సమస్యలను పరిష్కరించమని కోరడంలో తప్పులేదన్నారు. అయితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం కుదరదన్నారు. వీలినం చేయాల్సివస్తే ఏ రూపంలో చెయ్యాలో కేంద్ర ప్రభుత్వం తెలపాలన్నారు. ఏపీలో జగన్ ప్రభుత్వం ఆర్టీసీ విలీనం మేనిఫెస్టోలో పెట్టిందని, అందువల్లే విలీనం చేసిందని, తాము దీనిపై ఏ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఒకవేళ విలీనం చేయాలన్నా, రాష్ట్ర బడ్జెట్ పరిస్థితి కూడా చూసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఫిట్‌మెంట్‌ను వారు అడిగిన దానికంటే సీఎం ఎక్కువే ఇచ్చారని, అసలు వారు చర్చలకే రాలేదన్నారు. తాను ఆర్టీసీ ఉద్యోగులను ఎప్పుడూ ఏమీ అనలేదని, కొందరు తనను తెలంగాణ ద్రోహి అని విమర్శించారని, తాను తెలంగాణ రాష్ట్రంకోసం చంద్రబాబుపై ఒత్తిడిచేసి అనుకూలంగా లేఖ ఇప్పించానని గుర్తు చేశారు. తెలంగాణరాష్ట్రం కోసం జైలుకు కూడా వెళ్లానని, తనపై ఎన్నో కేసులు కూడా పెట్టారన్నారు. తాను కార్మిక పక్షపాతినని, తనపై కొందరు చేసిన విమర్శలను వెనక్కు తీసుకోవాలన్నారు.

## సమస్య పరిష్కారానికి చొరవ చూపండి

• సీఎం కేసీఆర్‌కు పెన్షనర్ల జేఏసీ వినతి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను సానుకూలంగా, శాంతియుతంగా పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ తీర్మానం చేసింది. జేఏసి చైర్మన్ కె,లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం జేఏసీ ప్రత్యేకంగా సమావేశమైంది. దివంగత ఎన్జీవో నేత, ఎమ్మెల్సీ ఏఆర్ ఆమోస్, ఆత్మాహుతి చేసుకున్న ఆర్టీసి డ్రైవర్ శ్రీనివాస్ రెడ్డి, కండక్టర్ సురేందర్ గౌడ్ లకు నివాళులర్పించింది. గత పదిరోజులుగా ఆర్టీసి కార్మికులు సంస్థ ప్రయోజనాలు, వారి న్యాయమైన కోర్కెల సాధనకు సమ్మె చేస్తున్నారని అభిప్రాయపడింది.దాంతో ప్రజలు, కార్మికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరింది.

## సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజా పంపిణీలో అద్భుత ప్రగతి

• జాతీయస్థాయి ఆహార కార్యదర్శుల సదస్సులో అకున్ సబర్వాల్




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సాంకేతిక పరిజ్ఞానంతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో అద్భుత ప్రగతిని సాధించిందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. ప్రజా పంపిణీలో సంస్కరణలు, వినూత్న చర్యలు అంశంపై రెండు రోజుల పాటు గుజరాత్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సులో ఆయా రాష్ట్రా లు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆహార కార్యదర్శులు పాల్గొన్నారు.

సోమవారం మొదటి రోజు సదస్సులో తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సాంకేతికపరిజ్ఞానంతో తెలంగాణ ప్రజా పంపిణీ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలను వివరించారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3.51 కోట్ల జనాభా ఉందని, ఇందులో 87.72 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయని, దీని ద్వారా 2.81 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని, కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కిలో రూపాయికే ఆరు కిలోల బియ్యం అందిస్తున్నామన్నారు. రేషన్ లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేందుకు వీలుగా 2018 మే నెలలో రాష్ట్రంలో రేషన్ పోర్టబిలిటీ ప్రారంభించామని, ప్రతి నెల 13 లక్షల మంది పోర్టబిలిటీని ఉపయోగించుకుంటున్నారన్నారు. ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థ పకడ్బందీగా చేపట్టడం కోసం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఓపీఎంఎస్, కొనుగోలు కేంద్రాల జియో ట్యాగింగ్, రైస్ మిల్లర్ల లావాదేవీలకు సంబంధించి అక్నాలెడ్జ్‌మెంట్ యాప్, టీ రేషన్ యాప్, టి వాలెట్ యాప్ వంటి సదుపాయాలు ఈ మొబైల్ యాప్స్‌లో ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పౌర సరఫరాల శాఖలో పారదర్శకత, జవాబుదారితనం ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందిస్తోందని సమావేశంలో వివిధ రాష్ట్రాల ఆహార, పౌరసర ఫరాల కార్యదర్శులు ప్రశంసించారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన

• మాజీ ఎంపీ వీహెచ్




**సూర్యాపేట (టౌన్), ప్రభ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన కొనసాగుతోందని మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు అన్నారు. సోమవా రం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాజీఎంపీ సిరిసిల్ల రాజయ్య, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంక న్నయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ రాష్ట్రంలో ఓ నియంత పాలన కొనసాగిస్తూ ప్రజలను భ యభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తమ న్యాయమైన డిమాం డ్లకోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులను డిస్మిస్ చేస్తామని ప్రకటించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఖమ్మంలో శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలను హిందు సాంప్రదాయానికి విరుద్ధంగా అర్ధరాత్రి చేయించడం హేయమైన చర్య అన్నారు. అర్ధరాత్రి అంత్యక్రియలు నిర్వహించడం వెనుక అనుమానం ఉందని, వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మాజీఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ శ్రీనివా స్‌రెడ్డి బలిదానం కేసులో సీఎం కేసీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌లను బాధ్యుల్ని చేసి సుమోటోగా కేసు నమో దు చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లో ముమ్మాటికి కాంగ్రెస్ అభ్యర్థి నలమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి 30 వేల మెజార్టీతో గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, వీరన్ననాయక్, చింతమల్ల రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, నాగుల వాసు, నరేందర్ నాయుడు, రాంబాబు, సాయినేత, సాజీద్‌ఖాన్, మిద్దె కిరణ్ తదితరులు ఉన్నారు.

## సహనం భారతీయ జీవన విధానం

• ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** సహనం భారతీయ విధానమని, ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మైనారిటీలతో సహా అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని రాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సైన్యాధ్యక్షులుగా చాలా మంది మైనారిటీలు సమర్థవంతంగా పని చేశారని ఆయన గుర్తు చేశారు. సియారా లియోన్ రాజధాని ఫ్రీటౌన్‌లో భారత సంతతి ప్రజలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. గాంధీ చూపిన మార్గంలో అందరినీ కలుపుకుపోతున్న భారత్‌లో అల్లర్లు సృష్టించేందుకు ఉగ్రవాద మూకలు, వారికి సహకారం అందిస్తున్న పొరుగుదేశం కుట్ర పన్నుతున్నాయన్నారు. జమ్మూకశ్మీర్‌లో అనిశ్చితికి కారణమవుతున్న సీమాంతర ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయడంతో పాటు ఆ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని తీసుకొచ్చిందని వెంకయ్య నాయుడు వివరించారు. ఉగ్రవాదం, మానవాళికి పెనుసవాల్‌గా మారిందని, ఉగ్రవాదానికి మతం లేదని.. ఈ మహమ్మారిని అంతం చేసేందుకు, వీరికి సహకరిస్తున్న దేశాలను ఏకాకిని చేసేందుకు ప్రపంచమంతా ఏకతాటిపైకి రావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని... 1952 నుంచి అక్కడ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నవిషయాన్ని ఆయన గుర్తు చేశారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ సరైన లక్ష్యాలతో ముందుకెళ్తోందని, 2025 కల్లా ప్రపంచంలో మూడో అతిపెద్ద వినియోగ మార్కెట్‌గా నిలుస్తుందని అన్నారు. విదేశీ పెట్టుబడులకు భారత్ స్వర్గధామమని.. భారత సంతతి ప్రజలు దీనికి వారధిగా నిలవాలని పిలుపు నిచ్చారు. కేమరోస్, సియారా లియోన్ దేశాల పర్యటన ముగింపునకు ముందు సియారా లియోన్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అబ్బాస్ చెర్నోర్‌బుండీతో ఉపరాష్ట్రపతి సమావేశమయ్యారు.

# ఏపీ ఖాళీ చేసిన భవనాలు సరిపోవా..?

## సచివాలయం కూల్చివేత ఎందుకు?




- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు • ప్రజాధనం వినియోగం ప్రభుత్వ ఇష్టం • మేమేమీ జోక్యం చేసుకోం • అయినా కొత్త నిర్మాణం ప్రజలకోసమేగా.. • పిటిషనర్‌కు స్పష్టం చేసిన న్యాయస్థానం
- ఫైర్‌సేఫ్టీలేకే కూల్చివేత నిర్ణయమన్న రాష్ట్రప్రభుత్వం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** :సచివాలయంలో ఏపీ ప్రభుత్వానికి కేటాయించిన 5 బ్లాకుల భవనాలు ఖాళీ చేసినందున అవి తెలంగాణ ప్రభుత్వ అవసరాలకు సరిపోవా, మరి కొన్నేళ్ల పాటు మన్నే ప్రస్తుత భవనాలను ఎందుకు కూల్చివేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఫైర్‌సేఫ్టీ లేనందువల్లే కూల్చివేత నిర్ణయం తీసుకున్నామన్న ప్రభుత్వ వివరణతో విభేదించిన హైకోర్టు, పిటిషనర్ లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలపై వ్యాఖ్యానించింది. ప్రజాధనాన్ని ఎలా వినియోగించాలన్నది ప్రభుత్వ నిర్ణయానుసారమే ఉంటుందని, ఈ విషయంలో కోర్టులు జోక్యం చేసుకోవని స్పష్టం చేసింది. అయినా ఒకవేళ కొత్త భవనాలు నిర్మించినా, అవి ప్రజలకోమేకదానని వ్యాఖ్యానించింది. తెలంగాణ సచివాలయ భవనాల కూల్చివేతపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు మరో సారి విచారణ జరిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసును విచారించింది. కూల్చివేతలపై కాగా హైకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో ప్రభుత్వం తన వాదనలు వినిపిం చింది. ప్రస్తుతం కొనసాగుతున్న సచివాలయ భవనాలకు అగ్నిప్రమాదం పొంచి ఉందని, ఈ మేరకు అగ్నిమాపక శాఖ డీజీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం నివేదించింది. పైగా సాంకేతిక కమిటీ కూడా నివేదిక కూడా కూల్చివేతలకు సిఫార్సు చేసిందని పేర్కొంది. ఈ సందర్భంలో అగ్నిమాపకశాఖ డీజీ ఇచ్చిన నివేదికను హైకోర్టు పరిశీలించింది. అగ్నిప్రమాదాల నియంత్రణ కు తగు చర్యలు తీసుకోవాలని మాత్రమే అగ్నిమాపక శాఖ సూచించిందని, భవనాలను కూల్చివేయాలని సిఫారసు చేయలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. తెలంగాణ జనసమితి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధిం చింది. దీనిపై వివరాలు ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ మంగ ళవారానికి వాయిదా వేసింది. సచివాలయ సముదాయంలోని భవనా లను కూల్చివేసి, అదే స్థలంలో నూతనంగా భవనాలను నిర్మించ కుండా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హైకోర్టులో 2016 లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే సచివాలయ కూల్చివేతను సవాలు చేస్తూ.న్యాయవాది టి.రజనీకాంత్ రెడ్డి, ఫోరం ఫర్ గవర్నెన్స్ కార్యద ర్శి పద్మనాభరెడ్డి, సామాజిక కార్యకర్త ఓఎం .దేబరా హైకోర్టు ను ఆశ్రయించిన తెలిసిందే. సచివాలయం కూల్చివేతను సవాలు చేస్తూ విశ్రాంత ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు కూ డా ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసి న సంగతి విదితమే. సచివాలయాన్ని కూల్చివేయకుండా ఆదేశించాలని అభ్యర్థి స్తూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ.ఎ.రేవంత్ రెడ్డి ప్రజాహిత వ్యాజ్యా న్ని దాఖలు సంగతి విధితమే. ఈ కేసు లను కలిపి హైకోర్టు విచారణ జరుపుతోంది.

### హింసిస్తే పరిహారం ఇవ్వాల్సిందే

- పోలీసుల చిత్ర హింసలపై హైకోర్టు ఆగ్రహం

పోలీసులు చిత్రహింసలకు గురిచేశారనే కారణంతో తగిన పరిహారం కోరే స్వేచ్ఛ నిందితులకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఒప్పించి, వారి నుంచి సేకరించిన వాంగ్మూలం ఆధారంగా శిక్షించడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో కొంత మంది న్యాయాధికారుల వ్యవహార తీరుపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హైకోర్టు పేర్కొంది.

చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు అందుబాటులో ఉండగా పరేడ్ ఎందుకు నిర్వహించారని హైకోర్టు నిలదీసింది.ఎవిడెన్స్ చట్టంలోని సెక్షన్ 9కి విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండేందుకు తమ ఉత్తర్వులను డీజీపీ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కి పంపాలని రిజిస్ట్రార్ జనరల్ ను హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇంతటితో ఈ హెబియస్ కార్పస్ పిటిషన్ పై విచారణ ముగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. చంచల్ గుడా జైలులో అక్రమ నిర్బంధంలో ఉన్న తమ భర్తలను కోర్టులో ప్రవేశపెట్టేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ నిందితులు సయ్యద్ సోహైల్, సయ్యద్ మహ్మద్‌ల భార్యలు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దొంగతనం కేసులో పోలీసులు నిందితులపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడం వల్ల అయిన గాయాలను సీజేచాంబర్ లో పరిశీలించింది. ఉస్మానియా ఆస్పత్రి నుంచి డాక్టర్లను పిలిపించి నిందితులకు వైద్య పరీక్షలు చేయించింది.

సదరు డాక్టర్ల బృందం సీల్డ్ కవర్లో ఉంచి నివేదికను అందజేసింది. నిందితులపై ఉన్న దెబ్బలు పాతవి కావని, కొత్తవేనని ఆ నివేదిక స్పష్టం చేసింది. దీంతో హైకోర్టు పోలీసులు, జైలు సిబ్బంది పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన నోటీసులను ధిక్కరించి పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయడం పట్ల హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. దొంగతనాలకు పాల్పడుతున్నారనే కారణంతో నిందితుల్ని పోలీసులు అక్రమ నిర్బంధంలో ఉంచడం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఇద్దరు నిందితులపై నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్ లపై విచారణ జరపాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ ను హైకోర్టు ఆదేశించింది. వారి అక్రమ నిర్బంధం,పై విచారణ చేపట్టి, వారి గాయాలకు కారణమైన పోలీసు అధికారులపై తీసుకున్న చర్యలను వివరిస్తూ రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసిన సంగతి విదితమే.

## 23 నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

- 21,22 తేదీల్లోని పరీక్షలు 29,30 తేదీల్లో నిర్వహణ
- పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించిన పాఠశాల విద్యా కమిషనర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల విద్యార్థులకు నిర్వహించనున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-1 పరీక్షలను 23 నుంచి ప్రారంభించనున్నారు. ఆర్టీసీ సమ్మె కారణంగా 14 నుంచి పునః ప్రారంభం కావల్సిన పాఠశాలలకు 20 వరకు సెలవులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో.. 21 నుంచి ప్రారంభం కావల్సిన ఎస్ఏ-1 పరీక్షలను రెండు రోజులు వాయిదా వేసి 23 నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్య శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య కమిషనర్ టి విజయ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. 21, 22న జరగాల్సిన పరీక్షలను 29, 30 తేదిల్లో నిర్వహించనున్నారు. 5వ తరగతిలోపు వారికి ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు 6, 7 తరగతుల వారికి ఉదయం 10 గంటల నుంచి 12.45 గంటల వరకు 8వ తరగతి వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. 9, 10వ తరగతి వారికి పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి 12.45 వరకు పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తారు.

## సెలవుల్లో తెరిస్తే చర్యలు తీసుకోండి!

- విద్యాశాఖ కమిషనర్‌కు ప్రైవేటు విద్యాసంస్థల వినతి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం 14 నుంచి 20 వరకు సెలవులను ప్రకటించింది. అయితే కొన్ని ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించి స్కూల్స్ కొనసాగించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల అసోసియేషన్లతో పాఠశాల విద్య కమిషనర్ టి విజయ్‌కుమార్ సోమవారం చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా తాము ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడం లేదని తాము స్కూల్స్‌ను కొనసాగించడం లేదని యాజమాన్యాలు కమిషనర్‌కు స్పష్టం చేశాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో స్కూల్స్ కొనసాగుతున్నట్టుగా ఛానల్స్‌లో వార్తలు వస్తున్నాయని వాటి నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ పాఠశాలలను కొనసాగించిన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారి దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఎక్కడా ప్రైవేటు స్కూల్స్ కొనసాగించడం లేదని ఎక్కడైనా ప్రైవేట్ స్కూల్స్ కొనసాగిస్తే అధికారులు చర్యలు తీసుకోవచ్చని యాజమాన్యాల అసోసియేషన్ నేతలు కమిషనర్‌కు స్పష్టం చేశాయి. సెలవులు ఇవ్వకుండా స్కూల్స్ కొనసాగిస్తున్న పాఠశాలలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా విద్యాశాఖాధికారులకు కమిషనర్ వెంటనే ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్‌తో జరిగిన చర్చల్లో అదనపు సంచాలకులు కృష్ణారావు, జాయింట్ డైరక్టర్ శ్రీనివాసాచారి, తోపాటు యాజమాన్యాల అసోసియేషన్ నేతలు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, వై ప్రభాకర్‌రెడ్డి, కె ఇన్నారెడ్డి, కందాల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 63మంది ఎస్‌జీటీలుగా ఎంపిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు శిక్షణ ఇచ్చిన వారిలో 63 మంది ఎంపికయ్యారు. ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికైనా అభ్యర్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ శుభాకాంక్షలు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో 808 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా అందులో 63 మంది ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారని డైరక్టర్ బాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చక్కటి పాఠ్యప్రణాళిక, నాణ్యమైన శిక్షణ ఇవ్వడం మూలంగానే అభ్యర్థులు ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారని తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, వివిధ పోటీ పరీక్షలకు సైతం ఉచిత శిక్షణను ఇస్తున్నట్టు స్పష్టం చేశారు.

## మొదలైన ఏపీ సచివాలయ ఉద్యోగుల శిక్షణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల అభ్యర్థులకు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సెప్టెంబర్ 30, అక్టోబర్ 1వ తేదీలలో ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకోగా, ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగులకు ఈనెల 14వ తేదీ నుండి వచ్చే ఏడాది మే 9వ తేదీలోపు రెండు దఫాలుగా శిక్షణ ఇవ్వనున్నారు. పంచాయతీరాజ్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 14వతేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ మధ్య ఒక్కొక్క రికీ ఆరు రోజుల చొప్పున విడతల వారీగా శిక్షణ ఇవ్వను న్నారు. జిల్లాలోని మొత్తం ఉద్యోగులను ఐదు బ్యాచ్‌లుగా వర్గీకరించి అక్టోబరు 14-19తేదీల మధ్య ఒక బ్యాచ్‌కి, 21-26తేదీల మధ్య రెండో బ్యాచ్‌కి, అక్టోబరు 28 నుంచి నవంబర్ 2వరకు మూడో బ్యాచ్‌కి, నవంబర్4-9 తేదీల మధ్య ఐదో బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వనున్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-5 ఉద్యోగులకు నవంబరు 18వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 9వ తేదీ మధ్య ప్రతి ఒక్కరికీ రెండు వారాల చొప్పున విడతల వారీగా జిల్లాలో శిక్షణ ఇస్తారు. డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులకు నవంబర్ 18వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి28వ తేదీల మధ్య ఒక్కొక్కరికీ రెండు వారాల చొప్పున విడతల వారీగా శిక్షణ ఉంటుంది. మిగిలిన ఉద్యోగులకు నవంబర్ 18 నుంచి అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నారు.

## ఏపీ మున్సిపోల్స్‌పై ప్రభుత్వం దృష్టి

**అమరావతి, ఆంధ్రప్రభ:** సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి 151 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని ఏపీపాలనా పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఎన్నికల హామీలను వరుసగా నెరవేరుస్తూ మంచి ఊపుమీద ఉన్న సీఎం జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో సైతం అదే స్థాయిలో భారీ విజయాన్ని నమోదు చేయాలన్న సంకల్పంలో ఉన్నారు. అత్యధిక మునిసిపాలిటీలను కైవసం చేసుకు నేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందిస్తూ అడుగులు వేస్తున్నారు. ప్రతి పక్షానికి పట్టు న్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి కొన్ని ప్రాంతాలను విడదీయడం ద్వారా నిర్వీర్యం చేయడం, నూతనంగా ఏర్పాటు కానున్న మునిసిపాలిటీలలో అధిక నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేయడం ద్వారా వైసీపీకి దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేర్చే క్రమంలో నూతన మునిసిపాలిటీలను ఏర్పాటు చేశారు.

### నూతనంగా 50 మున్సిపాలిటీలు

రాష్ట్రంలో ఇప్పటి వరకు 16 మునిసిపల్ కార్పొరేషన్లు, 76 మునిసిపాలిటీలు, 21 నగర పంచాయతీలు ఉన్నాయి. నూతనంగా మరో 50 మునిసిపాలిటీలు ఇందులో చేరాయి. గుంటూరు జిల్లాలో దాచేపల్లి, నడికుడిలను ఉమ్మడి మునిసిపాలిటీగా ప్రకటించారు. అలాగే గురజాల, నిజాంపట్నంలు మునిసిపాలిటీగా ఏర్పడ్డా యి. ప్రకాశం జిల్లాలో దర్శి, పొదిలి, మార్టూరు, టంగుటూరు, సింగరాయి కొండ, వేటపాలెంలు, కృష్ణా జిల్లాలో అవనిగడ్డ, కైకలూరు, మైలవరం, పామర్రు, విస్సన్నపేట, చిత్తూరు జిల్లాలో కుప్పం, కర్నూలు జిల్లా లో బేతంచర్ల, కోయిల కుంట్ల, పత్తికొండ, కోడు మూరు, బనగానిపల్లి, పాణ్యం లు, విశాఖపట్నం జిల్లా లో అనందపూరం, నక్కపల్లి, పాయకరావు పేటలు, విజయనగరం జిల్లాలో కురుపాం, చీపురుపల్లి - గరివిడి (ఉమ్మడి), శ్రీకాకుళం జిల్లాలో నరసన్నపేట, టెక్కిలి, పాతపట్నం, రణస్థలంలు, కడప జిల్లాలో రైల్వే కోడూరు, నందలూరు, వేంపల్లిలు, తూర్పు గోదావరి కొత్తపేట, రావులపాలెం, అనపర్తి, జగ్గంపే టలు, పశ్చి మ గోదావరి జిల్లాలో ఆకువీడు, చింతల పూడి, అత్తిలిలు, అనంతపురం జిల్లాలో పెనుకొండ, ఉరవ కొండ, గోరంట్లలు మునిసిపాలిటీలుగా ఏర్పడ్డా యి. నెల్లూరు జిల్లాలో బుచ్చిరెడ్డిపాలెం- వవ్వేరు (ఉమ్మ డిగా), కోట-వాకాడు- గూడలి (ఉమ్మడిగా), అలూరు, పొదలకూరు, ముత్తుకూరు, రాకూరు, తడ-తడ కండ్రిగ (ఉమ్మడిగా) మునిసిపాలిటీలుగా ప్రకటించారు.

## రవిప్రకాశ్ కస్టడీపై నేడు తీర్పు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ కస్టడీపై నాంపల్లి కోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును మంగళవారానికి వాయిదా వేసింది. కాగా టీవీ9 యాజమాన్యానికి తెలియకుండా రూ.18 కోట్లు అక్రమంగా రవిప్రకాశ్ డ్రా చేసుకున్నాడని ధర్మాసనం ఎదుట పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ కేసులో రవిప్రకాశ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అనేక కీలక ఆధారాలు లభిస్తాయన్నారు. పది రోజుల పాటు కస్టడీకిలోకి తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. తన అధికార దుర్వినియోగంతో ఉద్యోగులకు ఇవ్వాల్సిన బోనస్, ఎక్స్‌గ్రేషియాను అక్రమంగా దొంగిలించారని అన్నారు. దీనికి సంబంధిం చిన పూర్తి ఆధారాలను పోలీసులకు ఇవ్వడం జరిగిందన్నా రు. రవిప్రకాశ్ డ్రా చేసిన బ్యాంక్ స్టేట్‌మెంట్స్, ఆధారాలను న్యాయవాది కోర్టులకు అందజేశారు. ఎన్‌సీఎల్‌టీ, హైకోర్టులో ఉన్న కేసులకు ఈ కేసుకు ఏమాత్రం సంబంధం లేదన్నారు.

## గౌరవ్ ఉప్పల్ బాధ్యతల స్వీకారం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఢిల్లీలోని తెలంగాణా భవన్ రెసిడెం ట్ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి గౌరవ్ ఉప్పల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్, అడ్మిన్ ఆఫీసర్ సంగీత, తదితరులు పాల్గొన్నారు. నల్గొండ కలెక్టర్‌గా పని చేస్తున్న 2005 బ్యాచ్‌కు చెందిన గౌరవ్ ఉప్పల్‌ను ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన విశాఖపట్నం, గుంటూ రు, కృష్ణా జాయింట్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం జిల్లాకు కలెక్టర్‌గానూ గతంలో పని చేశారు. రాష్ట్ర విభజన తో ఆయన తెలంగాణా కేడర్‌కు వచ్చారు. గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అదనపు కమిషనర్‌గా పని చేశారు. 2016 నుంచి ఇటీవలికాలం వరకూ నల్గొండ జిల్లా కలెక్టర్‌గా. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆర్సీ గౌరవ్ ఉప్పల్ మీడి యాతో మాట్లాడారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివిధ అంశాలపై సమన్వయ కోసం కృషి చేస్తానని చెప్పారు.

## ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి టిక్‌టాక్

- పౌరసంబంధాల అధికారులకు అవగాహన శిబిరం • టిక్‌టాక్ ఇండియా, తెలంగాణ డిజిటల్ మీడియా సంయుక్తంగా నిర్వహణ



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడానికి సోషల్ మీడియా మాధ్యమాన్ని మరింత సమర్థవంతంగా వాడుకునేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇటీవల సోషల్ మీడియా రంగంలో అత్యంత జనాదరణ పొందిన టిక్ టాక్ పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. దీనిపై వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పౌర సంబంధాల అధికారులకు సోమవారం అవగాహనా శిబిరం నిర్వహించింది.టిక్ టాక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ ఐటీశాఖ, డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో హోటల్ హరిత ప్లాజా వేదికగా ఈ కార్యక్రమం జరిగింది.ఇటీవల కొత్త కొత్త పద్ధతులతో సోషల్ మీడియా తన పరిధిని పెంచుకోవటాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. ఇందులో ముఖ్యంగా టిక్‌టాక్ ను వినియోగిస్తున్న వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా గణనీయంగా పెరిగింది. ఇది ప్రారంభమైన అనతికాలంలోనే దేశంలో 20 కోట్ల మందికి చేరువైంది. వీరిలో ఎక్కవభాగం గ్రామీణ ప్రజలే. దాంతో ఈ సామాజిక మాధ్యమం ప్రజలను ఎంతగా ప్రభావితం చేసిందో అవగతమవుతోంది. ఈ నేపథ్యంలో టిక్ టాక్‌ను సమర్థంగా వినియోగించుకునే పద్ధతి, పాటించాల్సిన విధివిధానాలు, సురక్షిత పద్ధతుల మీద టిక్ టాక్ ఇండియా పాలసీ నితిన్ సాలూజా యువరాజ్ అవగాహనా కార్యక్రమం లో దిశా నిర్దేశం చేశారు. గత మూడు నెలలుగా కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నట్లు వారు వెల్లడించారు. సామాజిక బాధ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ కార్యక్రమాలను టిక్ టాక్ ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. టిక్ టాక్ వినియోగదారులకు అందిస్తున్న ప్రత్యేక సేవల మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ట్విట్టర్,ఫేస్ బుక్, షేర్‌చాట్ వంటి మాధ్యమాల ద్వారా ప్రజలను చేరుకునేలా నిత్యం కృషి చేస్తూనే ఉంది. ఇందులో బాగంగానే తాజాగా అత్యంత ప్రజాధరణ పొందుతున్న విషయంలో సంభందిత సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లటానికి టిక్ టాక్ వంటి సామాజిక మాధ్యమాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో సిఎంఓ పిఆర్వో రమేష్ హజారి, జీహెచ్ఎంసీ,డీజీపీ సిపిఆర్వోలు వెంకటరమణ,హర్షభార్గవి, టూరిజం, జలమండలి , రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ల పీఆర్ఓలు పురందర్, సుభాష్, దయాకర్, కిరణ్ కుమార్‌లతో పాటు పలువురు పౌర సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ స్కాం.. ఆరాధన అప్పీల్ కొట్టివేత




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఈఎస్ఐ కుంభకోణం వ్యవహారంలో డైరెక్టరేట్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ లో గ్రేడ్-2 ఫార్మసిస్టు గా విధులు నిర్వహిస్తున్న హెచ్.ఆర్.ఆరాధనా దేవి దాఖలు చేసిన అప్పీల్ ను హైకోర్టు కొట్టి వేసింది. ఈఎస్ ఐ కుంభకోణం లో ఆరాధనా దేవి పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ విజిలెన్స్ అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. వాటిని సవాలు చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి విజిలెన్స్ ప్రొసీడింగ్స్ ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఆమె డివిజన్ బెంచ్ ముందు అప్పీల్ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. దీంతో ఆరాధనాదేవి దాఖలు చేసిన అప్పీల్ ను కొట్టివేసింది.

## చిన్నారి కిడ్నాప్‌నకు విఫలయత్నం



**సికింద్రాబాద్ (మోండా), ప్రభ న్యూస్ :** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తండ్రిచెంత నిద్రపోతున్న రెండేళ్ల బాలికను ఎత్తుకెళ్లిన ఆగంతకుడు చివరకు ఆమెను నడిరోడ్డుపై వదిలిపెట్టి పరారైన సంఘటన కలకలం రేపింది. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కలువాయి మండలం నాగరిపల్లి గ్రామానికి చెందిన డి. సురేష్ కొంతకాలంగా భార్యాపిల్లలతో కలిసి నగరంలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి నెల్లూరుకు వెళ్లేందుకు కుమారుడు ప్రభాస్(5), కూతురు స్వర్ణలత (2 సం. 4 నెలలు)లతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కాగా వారు ఎక్కాల్సిన రైలు వెళ్లిపోవడంతో స్టేషన్ లోనే పిల్లలతో కలిసి ప్లాట్ ఫాం పక్కనే ఉన్న లిఫ్ట్ ప్రాంతంలో నిద్రపోయారు. కాగా అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తండ్రి చెంత ఆదమరిచి నిద్రిస్తున్న చిన్నారి స్వర్ణలతను గుర్తు తెలియని అగంతకుడు ఎత్తుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత నిద్రలేచిన ఆ చిన్నారి తండ్రి తన కూతురు కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే అలెర్ట్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి చిన్నారి కోసం గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీని గమనించిన పోలీసులు బాలికను ఓ గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడని తేల్చారు. అయితే ఏం జరిగిందో తెలియదు కాని ఆ బాలిక బండిమేట్ ప్రాంతంలో అర్ధరాత్రి రోడ్డుపై వెళ్తుండగా స్థానికులు గమనించారు. చిన్నారిని చేరదీసి స్థానిక మార్కెట్ పోలీసులకు అప్పగించారు. కిడ్నాపర్ కోసం తీవ్రంగా గాలించే పనిలో పడ్డారు.

## పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

### రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన పర్యాటక భవన్‌లో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వ హించారు. యాదాద్రి- భువనగిరి జిల్లాలోని బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద సీఎం కేసీఆర్ 90 ఎకరాలు కేటాయించారని, అక్కడ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో బస్వాపూర్ రిజర్వాయర్ నిత్యం నీటితో కళకళలాడుతోందని, విదేశీ పర్యటకులకు అహ్లాదాన్ని, అనందాన్ని పంచే విధంగా సీఎం కేసీఆర్ సూచనల మేరకు గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని మంత్రి సూచించారు. నగరం సమీపంలోని శామిర్‌పేట్ చెరువును కూడా ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా రూపొం దించాలన్నారు. హుస్సేన్‌సాగర్, గండిపేటను పర్యాటక శోభను పెంపొందించడంతో పాటు బద్వేలు వద్ద నూతన ప్రాజెక్టులను రూపొందిం చాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ కమీషనర్ సునీతాభగవత్, డైరెక్టర్ లక్ష్మీ, ఎండీ మనోహర్, మామిడి హరికృష్ణ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ డేటాపై ఇక్రిశాట్‌లో సదస్సు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హైదరాబాద్ శివార్లలోని ఇంటర్నేషనల్ క్రాప్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ-ఆరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) సంస్థలో ఈనెల 16 నుంచి రెండు రోజులపాటు బిగ్ డేటాపై సదస్సు జరగనుంది. పురపాలక, పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు ఈ రెండు రోజుల సదస్సును ప్రారంభిస్తారు. వ్యవసాయ రంగంలో బిగ్ డేటా వినియోగానికి సంబంధించి ఈ సదస్సులో చర్చలు జరుపుతారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరు కానున్నారు.

## జీపీఎఫ్ నిధులు విడుదల చేయాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల జీపీఎఫ్ నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీఆర్‌టీయూ తెలంగాణ ఆవేదన వ్యక్తం చేసింది. గత మూడు నెలలుగా జీపీఎఫ్‌తోపాటు లోన్లకోసం దరఖాస్తులు చేసుకున్న వారికి నిధులు రావడం లేదని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య సోమవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు రావల్సిన ఫైనల్ పేమెంట్స్ రూ. 10 లక్షలు అంతకంటే ఎక్కువ ఉన్న వారికి డబ్బులు విడుదల కావడం లేదని.. ట్రెజరీల దగ్గర నిధులు విడుదల కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ అవసరాల కోసం డబ్బులను విత్‌డ్రా చేసుకుంటున్నప్పటికీ ట్రెజరీల్లో రాకపోవడంతో కొందరి పిల్లల వివాహాలకు ఖర్చులు చేసుకోలేకపోతున్నారని అన్నారు. కాబట్టి ఉపాధ్యాయుల జీపీఎఫ్‌తోపాటు లోన్లకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అన్నదాతలకు భరోసా!

- రైతు భరోసా పథకం ప్రారంభం



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రజల ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైందని, ఇచ్చిన మాట నెలబెట్టుకుంటూ ఈ అక్టోబరు 15 నుండి వైయస్సార్ రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రైతన్నలకు స్పష్టం చేశారు. మంగళవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా కార్యక్రమాన్ని అమలుచేస్తున్న నేపథ్యంలో ఆయన రాష్ట్ర రైతాంగానికి లేఖ రాశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట కంటే ముందుగానే, అదికూడా రూ. వెయ్యి అదనంగా చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మొత్తాన్ని మే నెలలో ఖరీఫ్ పంట వేసే సమయంలో రూ. 7,500, అక్టోబరు మాసంలో పంట కోతకైనా లేదా రబీ అవసరాలకోసమైనా రూ. 4 వేలు, జనవరిలో ధాన్యం ఇంటికి చేరవేసే వేళ, రైతుల పండుగ సంక్రాంతి సందర్భంగా రూ. 2 వేల వంతున మొత్తం రూ. 13,500 ఇస్తున్నాని తెలిపారు. ఇంకా ఆయన లేఖలోని అంశాలు.. ఆయన మాటల్లోనే..

నా 3,648 కి.మీ. పాదయాత్రలో 13 జిల్లాల్లో రైతుల కష్టాలు చూశాను, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. ఈ ఆలోచనతోనే వైయస్సార్ రైతు భరోసా కార్యక్రమాన్ని ఎన్నికలకు ముందు ప్రకటించాం. మాటకు కట్టుబడి ఈ రోజు నుండి దాన్ని అమల్లోకి తీసుకొస్తున్నాం. గతంలో ప్రకృతి కనికరించక కలిగిన నష్టం ఒకవైపు, అధికారం కోసం చేసిన మోసపూరిత వాగ్దానాలు మరోవైపు.. ఈ రెండింటి నుండి రైతన్నను, రైతు కుటుంబాన్ని రక్షించుకునేందుకు, రైతన్న ఆత్మ గౌరవంతో జీవించేందుకు వీలుగా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోపే మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన ప్రతి ఒక్క వాగ్దానాన్ని అమలు చేసేందుకు అడుగులు ముందుకు వేశాం. రైతన్న సేవలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి....

## పోలవరం పునరావాసంపై నేషనల్ మానిటరింగ్ కమిటీ సమీక్ష

- జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** పోలవరం నిర్వాసితుల పునరావాసం పై మళ్లీ సమీక్ష జరపాలని జాతీయ మానవ హక్కుల సంఘం నేషనల్ మానిటరింగ్ కమిటీని ఆదేశించింది. సోమవారం డాక్టర్ పెంటపాటి పుల్లారావు ఫిర్యాదుపై జస్టిస్ హెచ్ఎల్ దత్తు నేతృత్వంలోని జాతీయ మానవ హక్కుల సంఘం విచారణ జరిపింది. పోలవరం ప్రాజెక్టు పునరావాసం విషయంలో నిర్వాసితులకు న్యాయం జరగలేదని డాక్టర్ పెంటపాటి పుల్లారావు వివరించారు. నాలుగు లక్షల మంది నిర్వాసితులకు అరకొర సహాయం అందజేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం మేరకు పునరావాసం ప్యాకేజీని అమలు చేయలేదని మానవ హక్కుల సంఘానికి వివరించారు. ఇళ్లను దూరంగా నిర్మించారని, భూమికి భూమి ఇవ్వలేదని, పరిహారం తక్కువగా ఇచ్చారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం పై మళ్లీ సమీక్ష జరపాలని కోరారు. దానిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల సంఘం ఈ అంశాన్ని నేషనల్ మానిటరింగ్ కమిటీ సమీక్షించాలని సూచించింది. జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశాలపై పెంటపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ పై పూర్తి సమాచారాన్ని నేషనల్ మానిటరింగ్ కమిటీకి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆసరా జాబితాలు సిద్ధం!

● ఫిర్యాదులకు కాల్ సెంటర్ ● 26 రకాల వినతుల స్వీకరణ ● 10 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా షురూ ● ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పథకంలో వృద్ధుల ఎంపిక పనులు పూర్తికావొచ్చాయి. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆసరా పథకం ద్వారా లబ్ది పొందేందుకు అర్హులైన వృద్ధుల జాబితాను సిద్ధం చేస్తోంది. ఏ ఆధారం లేక వయోభారంతో బతుకీడుస్తున్న వృద్ధులకు ప్రతినెలా రూ.2016 పింఛన్ అందజేస్తోంది. ఈ పథకం కింద వయోపరిమితిలో సడలింపులు ఇచ్చింది. ఇప్పటి వరకు 65 ఏళ్ల వయస్సున్న వారికి మాత్రమే ఈ పథకం కింద పింఛన్ వచ్చేది. దీన్ని ప్రభుత్వం 57ఏళ్లకు తగ్గించింది. దీంతో చాలా మంది అనర్హులు కూడా ఈ పథకం ద్వారా లబ్ది పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో జిల్లా నుంచి వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు చేపట్టింది. అర్హులైన వారికే పింఛన్ అందేలా చర్యలు తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డేటాను సేకరిస్తున్నారు. మొత్తం ఎంత మంది అర్హులు అన్నది లెక్కలు తేలుస్తున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. త్వరలోనే లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నారు.

## వినతుల కోసం కాల్ సెంటర్

ఆసరా పథకంలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద తొలుత ఈ కాల్‌సెంటర్ ఏర్పాటుకు రాష్ట్రంలోని నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామబాద్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, ఆదిలాబాద్, కరీంనగ ర్, రంగారెడ్డి, ఖమ్మం, మెదక్ జిల్లాలను ఎంపిక చేశారు.



సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఈ కాల్‌సెంటర్‌ను ప్రారంభించారు. తొలుత ఈ జిల్లాల్లో ఆశించిన ఫలితాలు వచ్చాక రెండు, మూడు నెలల్లో మిగిలిన అన్నీ జిల్లాలకు దీన్ని విస్తరింపజేయనున్నారు. ఆసరా పథకంలోని లబ్దిదారులు ఎవరైనా నేరుగా కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి తమ వినతులు, సమస్యలు ఫిర్యాదు చేయవచ్చు. వీటిని నమోదు చేసి సంబంధిత అధికారికి చేరవేస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ప్రతీ ఫిర్యాదుకు ఒక ప్రత్యేకమైన నెంబర్ నమోదవుతుంది. కాల్‌సెంటర్ ఆపరేటర్ సదరు ఫిర్యాదులను సంబంధిత ఎంపీడీవో, డీఆర్‌డీవోలకు గానీ, మున్సిపల్ కమిషనర్‌కు గానీ చేరవేస్తారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించి తగిన సమాచారాన్ని వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఇవి తిరిగి కాల్ సెంటర్లకు చేరుతాయి. ఫిర్యాదు చేసిన లబ్దిదారుడు మళ్లీకాల్ చేస్తే ఫిర్యాదులకు సంబంధించిన పరిష్కారాలను తెలియజేస్తారు. మొత్తం 26 రకాల వినతులను ఈ కాల్‌సెంటర్ పరిష్కరిస్తుంది.

## పంచాయతీ ట్రిబ్యునల్‌కు సభ్యుల నియామకం





గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్‌కు ప్రభుత్వం ముగ్గురు సభ్యులను నియమించింది. సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు పంచాయతీరాజ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు బండారు భాస్కర్, వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది పి.గోవర్దన్ రెడ్డిని ట్రిబ్యునల్ సభ్యులుగా నియమించింది. గద్వాల జిల్లా కేశవరం గ్రామానికి చెందిన బండారు భాస్కర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంకు చెందిన అజయ్ నెక్కొండ ఎంపీపీగా పనిచేశారు. రాష్ట్ర ఎంపీపీల ఫోరం కన్వీనర్‌గా వ్యవహరించారు.రంగారెడ్డి జిల్లాకు చెందిన పి.గోవర్దన్ రెడ్డికి పలు న్యాయస్థానాల్లో పనిచేసిన అనుభవం ఉంది.

# పక్కా ప్రణాళికతో టౌన్‌షిప్‌లు

(మొదటిపేజీ తరువాయి)

తరలి వస్తున్నారు. వారి పిల్లల విద్యా,వైద్య సదుపాయాల కోసం ప్రత్యేక శ్రద్ధపెట్టేవారి సంఖ్య పెరుగుతుండటంతో ఈ వలసలు చోటుచేసుకుంటున్నాయి. మరో వైపు యువత విద్యా, ఉపాధికోసం ద్వితీయశ్రేణి నగరాలతోపాటు రాజధానిపై ఆధారపడక తప్పటం లేదు. దాంతో రాష్ట్ర రాజదాని గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలోనేగాక ఇతర పట్టణాల్లోనూ జనావాసాలు పెరుగుతున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా ఇళ్లస్థలాల వెంచర్లు వెలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పాతవిధానంలోనే నిర్మాణాలు చేపడితే మౌలిక సదుపాయాల విషయంలో ముందు ముందు సమస్యలు తలెత్తే ప్రమాద ముంది. దీనికి తోడు పర్యావరణ హిత నిర్మాణాల అంశం చర్చ నీయాంశంగా మారింది. ఇటీ వల నగరంలో జరిగిన గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ జాతీయ సదస్సు దీని ప్రాధాన్య తను వివరించింది. దాంతో ఇప్పటివరకు కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్, నిర్మాణ సంస్థలు మాత్రమే గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ మార్గదర్శకాలను అనుసరించి నిర్మాణాలు చేపడుతున్నాయి. దాంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ నిర్మాణాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించటం,పచ్చదనాన్ని పెంచటం, నీటిని రీసైక్లింగ్ చేసుకునే అంశానికి ప్రాధాన్యత ఇవ్వటం ప్రధానంగా పాటిస్తారు. అంతేగాక గాలి, వెలుతురు కావలసినంత మెరుగ్గా వచ్చేలా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. దాంతో ఇందన పొదుపు,నీటి పొదుపుతో పాటు పర్యావరణ సమతుల్యానికి ఈ విధానం అనుకూలంగా ఉటుంది. ఈ విధానాన్ని మరింత వ్యాప్తిలోకి తేవటం కోసం ఓ ప్రత్యేక టౌన్ షిప్ అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది.

### పెరిగిన మున్సిపాలిటీలు

అంతేగాకుండా కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రానున్న నిర్మాణాలకు ఈ కొత్త టౌన్ షిప్ పాలసీ వర్తింప చేయగలిగితే ఇప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులకు ముందస్తుగానే చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు మెరుగైన సదుపాయాలు కల్పించటం కోసం ప్రభుత్వం కార్పొరేషన్లను 6 నంచి 13 కు మున్సిపాలిటీలను 69 నుంచి 128కి పెంచింది. వాటికి పరిపాలనా, నిర్వహణా వ్యవస్థ కోసం సమగ్రమైన చట్టాన్ని తెచ్చింది. వీటి అభివృద్ధికోసం ప్రణాళికలను సైతం రూపొందిస్తోంది. కొత్తగా ఏర్పడనున్న టౌన్ షిప్ పాలసీ తో పట్టణాలు, నగరాల్లో మున్సిపల్ చట్టం అమలుకు మార్గం మరింతసులువుకానుంది. గ్రేటర్‌హైదరాబాద్ విషయంలో ఈ పాలసీ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

### ఓఆర్ఆర్ చుట్టూ గ్రోత్ కారిడార్

గ్రేటర్ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ప్రభుత్వ గ్రోత్ కారిడార్‌ను అందుబటులోకి తెచ్చే పనిలో ఉంది. దాంతో దీని చుట్టూ 8 ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్కులను పిపి పి విధానంలో నిర్మించాలని తలపెట్టింది. ఇప్పటికే మొదటి దశలో చేపట్టిన రెండింటిలో మంగల్ పల్లి పార్కు పూర్తి కాగా, బాటసింగారం మరో రెండు మాసాల్లో పూర్తి కానుంది. రూ. 27 కోట్ల వ్యయంతో నిర్మించిన మంగల్ పల్లి లాజిస్టిక్ పార్కును ఇటీవలే మంత్రి కేటీఆర్ ప్రారంభింట జరిగింది. దీని ద్వారా 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చింది. దాంతో ఇప్పటివరకు అసంఘటితంగా ఉన్న రవాణా రంగం సంఘటితంగా మారేందుకు మార్గం సుగమమైంది. ప్రతిపాదించిన లాజిస్టిక్ పార్కులు పూర్తయినట్లైతే నగరంలో భారీ వాహనాల బెడద తగ్గనుంది.

### రోడ్ల ధ్వంసానికి అడ్డుకట్ట

తద్వారా భారీ వాహనాలతో జరిగే రోడ్లు ద్వంసానికి అడ్డుకట్టపడనుంది. అదేసమయంలో చిన్నవాహనాల ద్వారా నగరానికి సరుకుల రవాణా జరుగుతూ కొత్తవారికి ఉపాది ఏర్పడనుంది.

నగరంలో ఏర్పడుతున్న కంపెనీలు, నిర్మాణాలకు సరకుల రవాణా సులభతరం కానుంది. రంగా రెడ్డి జిల్లా ముచ్చర్ల ఫార్మాసిటీ, వెలిమినేడు ఏరోస్పేస్ పార్కు లను ఏర్పాటు చేయాలని,ఇప్పటికే ఏర్పడిన ఫ్యాబ్ సిటీలో పరిశ్రమలను రప్పించే చర్యలు చేపట్టాని నిర్ణయించింది. సుల్తాన్ పూర్ మెడికల్ డివైస్ పార్కు, దండుమల్కాపూర్ లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుతో సహా రాష్ట్రంలో 59 ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పడ్డాయి. వీటిలో ఎక్కువగా ఔఆర్ఆర్ చుట్టూనే ఉన్నాయి. వీటిలో పలు పార్కుల్లో కంపెనీలు ఏర్పాటు ప్రారంభమైంది. పూర్తి కంపెనీలు ఏర్పడితే వచ్చే సమస్యలను అధ్యయనం చేసిన ప్రభుత్వం అక్కడే ఉద్యోగులు సిబ్బంది కి నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక టౌన్‌షిప్ లకు భూములు కేటాయిస్తోంది.

### శాటిలైట్ టౌన్‌షిప్‌లు

ఇందులో బాగంగా నగరంపై ఒత్తిడిని తగ్గించేందుకు శాటిలైట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. గతంలో వికారాబాద్, శంకర్‌పల్లి, భువనగిరి, చౌటుప్పల్, కీసర, షాద్‌నగర్ ప్రాంతాలు ఇందుకు అనుకూలమైన ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. తొలిదశలో వికారాబాద్ ను ఎంపిక చేసింది. దాంతో ఒకవైపు ఇండస్ట్రియల్ పార్కులు, కొత్తగా ఏర్పడే జనావాస ప్రాంతాలకు మౌలిక సదుపాయాలను సమన్వయం చేసుకోవటానికి ఈ టౌన్‌షిప్ పాలసీ ఉపయోగపడనుంది. దీని వల్ల మౌలిక సదుపాయాల ఏర్పాట్లు సమంగా అందేలా చూడటం వీలవుతుంది. ఏర్పాటు కానున్న టౌన్ షిప్ లు మౌలిక సదుపాయాల కల్పించటానికి అడ్డంకిగా ఉండకుండా చూడవచ్చని తెలుస్తోంది.

## గ్రామపంచాయతీ కార్మికులకు పెరిగిన వేతనాలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఈమేరకు ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వం పంచాయతీకార్మికుల వేతనాలు పెంచుతూ జీవో విడుదల చేయటం పట్ల తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ హర్షం వెలిబుచ్చింది. సుదీర్ఘ కాలంగా చేసిన పోరాటాల ఫలితంగానే జీవో విడుదలైందని యూనియన్ గౌరవాధ్యక్షుడు పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని యూనియన్ అధ్యక్షులు పి.గణపతి రెడ్డి పంచాయతీ కార్మికులకు పిలుపునిచ్చారు. వేతనాల పెంపు జీవో పట్ల సంతోషం వెలిబుచ్చుతూనే కారోబార్, బిల్ కలెక్టర్లను మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఖాళీ పోస్టుల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

## ప్రపంచ విత్తన భాండాగారం తెలంగాణ

● ఇప్పటికే అనేక రకాల విత్తనాల ఎగుమతి ● ప్రభుత్వ కృషికి తోడుగా ప్రైవేట్ సంస్థలు

● కావేరి సీడ్స్ పరిశోధనా కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** నాణ్యమైన విత్తనాలతోనే వ్యవసాయ రంగం పురోగతివైపు సాగుతోందని, లేదంటే రైతాంగానికి కష్టనష్టాలు తప్పవని వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత ఇక్కడ ఉత్పత్తిచేసే విత్తనాలు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి ఉంటున్నాయని తెలిపారు. ప్రతి రైతు విత్తనోత్పత్తి దిశగా ముందడుగు వేస్తే రెట్టింపు లాభాలు అర్జించవచ్చునని సూచించారు. ఆ దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి బహుళజాతి విత్తనోత్పత్తి సంస్థలు సైతం తమవంతు భాగస్వా మ్యం పంచుకుంటుండడం శుభపరిణామమని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా పాములపర్తి గ్రామంలో కావేరి సీడ్స్ నూతనంగా నిర్మించిన విత్తన పరిశోధనా, అధ్యయన కేంద్రాన్ని సోమవారం ఆర్థిక మంత్రి హరీష్‌రావుతో కలిసి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రోగ నిరోధక శక్తిని కలిగి ఉన్న విత్తనాలు అవసరమన్నారు. తెలంగాణ రైతుల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేది విత్తనాలేనని,



ప్రస్తుతం ఆ ప్రక్రియ పురోగతి వైపు సాగుతోందని తెలిపారు. వ్యవసాయ రంగం ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే, అంతర్జాతీయ స్థాయిలో మన ఉత్పత్తులకు డిమాండ్ పెరిగితేనే చేస్తున్న కృషికి ఫలితం దక్కుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా రైతాంగం ముందడుగు వేసి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## దక్షిణ కొరియాకు బీజేపీ బృందం

● మురళీధర్‌రావు సారథ్యం

● తొలిరోజు ద.కొరియా ఆర్థిక మంత్రితో భేటీ

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ప్రపంచ రాజకీయ పార్టీలతో నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు నేతృత్వంలో పార్టీ సీనియర్ నేతల బృందం సోమవారం నుంచి దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది . తొలిరోజు ఈ బృందం దక్షిణ కొరియా ఆర్థిక శాఖ ఆసియా పసిఫిక్ వ్యవహారాల డైరెక్టర్ కిన్ జింగ్, దక్షిణ కొరియా డెమోక్రటిక్ పార్టీ సెక్రటరీ జనరల్ యున్ హోజుంగ్ తో సమావేశమైంది. దక్షిణ కొరియా, భారత్ మధ్య సంబంధాల బలోపేతంపై చర్చించింది. ఈ బృందం దక్షిణ కొరియా ప్రభుత్వ అధినేతలను, కొరియా డెమొక్రటిక్ పార్టీ నేతలను, వ్యాపారవేత్తలను, వివిధ రంగాలకు చెందిన ప్రతిష్టాత్మక వ్యక్తులను కలవనుంది. కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలోనే కొరియా ఒక బలమైన ఆర్థిక శక్తిగా అవతరించింది. చిప్ మేకర్ల తయారీలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద దేశంగా నిలబడింది. కొరియాకు చెందిన హ్యుందాయి, శాంసంగ్ లాంటి పెద్ద కంపెనీలు ప్రపంచ ఆర్థిక రంగంలో తనదైన చరిత్ర ను సృష్టిస్తున్నాయి. భారత్ తన లుక్ ఈస్ట్ విధానంలో భాగంగా ఈస్ట్ ఏసియా లోని భాగస్వాముల మధ్య ప్రయోజనం పొందే లక్ష్యాలను గుర్తించింది. సౌత్ కొరియాతో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునే దిశలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల్లో బిజీగా ఉన్నప్పటికీ గత ఫిబ్రవరిలో కొరియా పర్యటించారు. ప్రధాని పర్యటన కారణంగా రెండు ప్రజాస్వామ్య దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యంతో అభివృద్ధిలో మైలురాళ్లను అందుకుంటోంది. బీజేపీ బృందం పర్యటనకు ముందే రిపబ్లిక్ ఆఫ్ కొరియా కు సంబంధించి న నిపుణులు, వ్యాపార వర్తక వర్గాలు, ఫిక్కీ, పీ హెచ్ డీ ఛాంబర్ తదితరులతో సమావేశమైంది. అలాగే కొరియా మాజీ భారత రాయబారి తోను, కొరియా ఎంబసీ అధికారులతోనూ సమావేశమై చర్చలు జరిపింది. భారత్ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను, పార్టీల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో బీజేపీ బృందం పర్యటిస్తున్నది. ప్రపంచంలోని వివిధ రాజకీయ పార్టీలతో నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం లో భాగంగా బీజేపీ సౌత్ కొరియాలో పర్యటిస్తూ ఉంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి అదనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న బృందానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్రావు నేతృత్వం వహిస్తున్నారు. ఈ బృందంలో సభ్యులుగా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ విజయ సోంకర్ శాస్త్రి, ఎంపీ ఉమేష్ యాదవ్, బీజేపీ విదేశీ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ చౌతేవాలా, బీజేపీ విదేశీ వ్యవహారాల సభ్యుడు డాక్టర్ అశ్విని జోహార్ ఉన్నారు.

## రూ.2 కోట్లతో శ్రీవారికి నాగాభరణం

● అజ్ఞాత భక్తుడి కానుక



**తిరుమల, ప్రభన్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఓ అజ్ఞాత భక్తుడు నాగాభరణం కానుకను సమర్పించాడు. ఆ అజ్ఞాత భక్తుడు శనివారం ఈ విలువైన కానుకను శ్రీవారి ఆలయంలోని హుండీలో సమర్పించాడు. కాగా ఈ ఆభరణాలను గుర్తించిన టీటీడీ అధికారులు భక్తుడు సమర్పించిన నాగాభరణం సువారు 5 కేజీలు ఉంటుందని, దీని విలువ దాదాపు రూ.రెండు కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

# మీవల్లే జవాన్లు బలి

● 370పై కాంగ్రెస్‌కు ప్రేమ.. జవాన్లు బలైనా పట్టించుకోలేదు ● 370 రద్దుకు భారత్ మద్దతు

● హర్యానా ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్‌పై మోడీ విమర్శలు



**బల్లాబ్‌గఢ్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి 370పై ఉన్న ప్రేమ వల్లే భారత జవాన్లు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేస్తూ తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజల మద్దతు లభించిందని మోడీ గుర్తు చేశారు. హర్యానా ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్రంలోని బల్లాబ్‌గఢ్‌లో ప్రచారం నిర్వహించిన మోడీ..భద్రతా బలగాలను మరింత పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గత పాలకుల అంచనాలకు కూడా అందనట్లుగా ఆర్టికల్ 370 ని రద్దు చేసి.. జమ్ము కాశ్మీర్ ప్రజలకు మేలు చేశామన్నారు. హర్యానాలో మనోహర్ లాల్ ఖట్టర్ టీం బలంగా ఉందని మోడీ కితాబిచ్చారు. కెప్టెన్ బలంగా ఉంటే టీం కూడా బలంగా ఉంటుందని గుర్తు చేశారు. దేశంలో హర్యానా, జమ్ము కాశ్మీరే కాదు ప్రతీ ప్రాంతంలో హింసకు చరమగీతం పాడి అభివృద్ధికి శ్రీకారం చుడదామన్నారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తే దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం తమ నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కడుపులో ఎలుకలు పరుగెడుతూ రాత్రిళ్లలో నిద్ర పట్టడం లేదో వారే అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మోడీ విమర్శించారు. ఆర్టికల్ 370, 35 ఏ పై ప్రతిపక్షాలకు అంత ప్రేమ ఉంటే.. వాళ్లు అధికారంలోకొచ్చాక ఆ రెండింటిని మళ్లీ పునరుద్దరించగలరా అని మోడీ సవాల్ విసిరారు. జమ్ము కాశ్మీర్‌లోని అమాయక ప్రజలకు భద్రత కల్పించిన ధైర్యవంతులైన హర్యానా సైనికులు.. ఉగ్రవాదుల తూటాలకు బలి అయినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని మోడీ ప్రశ్నించారు. ఆర్టికల్ 370 అమలులో ఉంచి ఇంకెంతమందిని వితంతువులను, ఇంకెంమంది చిన్నారులను తండ్రులు లేని వాళ్లు చేయాలనుకున్నారని కాంగ్రెస్‌ను మోడీ ప్రశ్నించారు.

# మీవి మాటలు.. మావి చేతలు

● హర్యానాలో రాహుల్ తొలి ఎన్నికల ర్యాలీ

● బీజేపీవన్నీ తప్పుడు హామీలని విమర్శ



**చండీగఢ్:** కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీలా తాము మాటలతో సరిపెట్టకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చి చూపిస్తామని స్పష్టం చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తొలిసారి రాహుల్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ.. మోడీజీ తప్పుడు హామీలు ఇస్తుంటారు. ఆయన లాగే హర్యానా సీఎం ఖట్టర్ కూడా. వాళ్లు మన్ కీ బాత్ (మనసులో మాటలు) మాత్రమే చెబుతారు. మేం కామ్ కీ బాత్ ( చేసి చూపిస్తాం) కు కట్టుబడి ఉంటాం. ఈ వేదికపై నుంచి నేను ఏం హామీ లిచ్చినా.. అధికారంలోకి రాగానే అన్నీ నెరవేరుస్తా. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల హామీలను నెరవేర్చి చూపించాం అని చెప్పుకొచ్చారు. అధికారంలోకి వస్తే రెండు కోట్ల మందికి ఉద్యోగాలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, రైతులకు రుణమాఫీ, వ్యవసాయ ఉత్పత్తులకు మేలైన గిట్టుబాటు ధరలు కల్పించి రైతులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే అధికారంలో ఉండగా హర్యానాలోని మారుతీ సుజుకీ, టాటా కార్ల తయారీ ప్లాంట్లు ఎందుకు మూతపడుతున్నాయని రాహుల్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను చేసి చూపించడంలో కాంగ్రెస్ పార్టీ వెనుదిరిగి చూడదని రాహుల్ అన్నారు.

# కాశ్మీరీలకు పండగొచ్చింది

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 5న రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జమ్ము కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జమ్ము కాశ్మీర్‌ను, లఢక్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించారు. అమిత్ షా ప్రకటన కంటే కొన్ని రోజుల ముందు నుంచే మొబైల్ సేవలు, ఇంటర్నెట్ సేవలను రద్దుచేశారు. నాటి నుంచి కొన్ని రోజుల పాటు 144 సెక్షన్ విధించిన ప్రభుత్వం శాంతియుత పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో ఆంక్షలను సడలిస్తూ వచ్చింది. జమ్ములో కొన్ని రోజుల ముందే అన్ని సేవలను పునరుద్దరించగా..కాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆగస్టు 17న పాక్షికంగా టెలిఫోన్ సర్వీసులు పునరుద్దరించారు. సెప్టంబర్ 4న 50 వేల ల్యాండ్ లైన్ ఫోన్లు కూడా మాట్లాడుకునేందుకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం నుంచి పోస్ట్ పెయిడ్ మొబైల్ సర్వీసులను పునరుద్దరిస్తున్నట్లు జమ్ము కాశ్మీర్ పాలనాధికారి ప్రకటించారు.

### మొబైల్ ఇంటర్నెట్‌పై ఆంక్షలు

కాశ్మీర్‌లో 40 లక్షల మొబైల్ ఫోన్ల కనెక్షన్లను సోమవారం నుంచి పునరుద్దరించగా..అవి సంభాషణకే పరిమితమయ్యాయి. ఇంటర్నెట్ సేవలను పునరుద్దరించేందుకు మరికొన్ని రోజులు పట్టొచ్చని అధికారులు తెలిపారు. కాశ్మీర్ లోయ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలకు ఇంటర్‌నెట్‌నే ప్రధాన ఆయుధంగా వాడుకుంటున్న నేపథ్యంలో అలాంటి వారికే ఏ మాత్రం అవకాశం ఇవ్వకూడ దనే ఉద్దేశంతో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి మాధ్యమాల వేదికగా కోడింగ్ భాషతో ఉగ్ర కుట్రలు చేస్తున్న నేపథ్యంలో ఇంటర్‌నెట్ సేవలను రద్దు చేశారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్ల పెకిలించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో.. ఆయా ప్రాంతాల్లోని వేర్పాటు వాదులు.. వారి కదలికలపై కూడా గట్టినిఘా ఉంచారు. కాశ్మీర్ లోయ ప్రాంతంలో యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్న వారిని గుర్తించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు.

### భద్రత కట్టుదిట్టం

కాశ్మీర్‌లో సోమవారం నుంచి మొబైల్ ఫోన్ సర్వీసులు పునరుద్దరించడంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. పోస్ట్ పెయిడ్ సర్వీసులు పునరుద్దరించడంతో ఎవరు ఎవరితో పోన్లు మాట్లాడుతున్నారన్న సమాచారం సులువుగా తెలిసిపోతున్న నేపథ్యంలో.. నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు టెలికాం సంస్థలతో టచ్‌లో ఉంటున్నాయి. అనుమానిత వేర్పాటువాదులు, పాత నేరస్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లపై నిఘా ఉంచారు. ముఖ్యంగా లోయ ప్రాంతంలో ఉగ్రవాదం పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్ కాల్స్‌పై ఆరా తీస్తున్నారు. సరిహద్దుల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు టెలికమ్యూనికేషన్ సంస్థల సహకారంతో ఎప్పటికప్పుడు అప్ డేట్స్ తీసుకుంటున్నారు.

### మొదలైన పర్యాటకుల సందడి

కాశ్మీర్‌లో పర్యాటకులకు గతవారం నుంచి అనుమతించినప్పటికీ మొబైల్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది యాత్రికులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. తమకు కావాల్సిన వస్తువులు, తినుబండారాలు ఎక్కడపడితే అక్కడ లభించకపోవడం, ఫోన్ సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతో చాలామంది యాత్రికులు నిరుత్సాహానికి లోనయ్యారు. సోమవారం నుంచి కాశ్మీర్‌లో పోస్ట్ పెయిడ్ మొబైల్ సేవలు పునరుద్దరించడంతో యాత్రికుల్లోనూ ఉత్సాహం కనిపించింది. తాము వీక్షించాలనుకున్న ప్రాంతాలకు అవసరమైన గైడ్స్ ను సంప్రదించేందుకు ఫోన్లు అందుబాటులో ఉండటంతో కాశ్మీర్ అందచందాలను చూసి ఆనందిస్తున్నారు.

### పండగ వాతావరణమొచ్చింది

మొబైల్ సేవలు పునరుద్దరించడం నిజంగా మాకు పండగే. ఎన్నో రోజులుగా ఎవరెలా ఉన్నారో తెలియకుండా బతికాం. ఇళ్లకే పరిమితం కావడంతో బయట ఏం జరుగుతుందో కూడా తెలియలేదు. మొబైల్ సేవలు అందుబాటులోకి రావడంతో ఒకరికొకరం ఫోన్ చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకుంటున్నాం.

**- నిఘాట్ షా, కాశ్మీర్ వాసి**

### 2నెలల తర్వాత కాబోయే భార్యకు ఫోన్..

ఈ ఏడాది జులైలో నాకు ఎంగేజ్‌మెంట్ అయింది. నాటి నుంచి ఆగస్టు 5 వరకు రోజూ గంటల తరబడి ఫోన్లో మాట్లాడుకునే వాళ్లం. కనీసం ఫోన్ చేద్దామన్నా ఆ అవకాశం లేదు. మొబైల్ సేవలు అందుబాటులోకి రావడంతో నా ఫియాన్సీతో కాసేపు మాట్లాడే అవకాశం దక్కింది.

**బష్రత్ అహ్మద్, పాత నగరం వాసి**

### ఉగ్రదాడిలో ట్రక్కు డ్రైవర్ మృతి

కాశ్మీర్‌లో మొబైల్ సర్వీసులు పునరుద్ధరించిన గంటల్లోనే ఉగ్రవాదులు రెచ్చిపోయారు. సోఫియాన్ జిల్లాలో ఓ ట్రక్కు డ్రైవర్‌పై దాడి చేసి హతమార్చారు. దాడి చేసిన ఉగ్రవాదుల్లో ఒకడు పాకిస్తాన్ దేశానికి చెందినవాడుగా పోలీసులు గుర్తించారు. ట్రక్కు రాజస్థాన్‌లో రిజిస్ట్రర్ అయినట్టుగా వివరించారు. ఈ దాడిలో మృతి చెందిన ట్రక్కు డ్రైవర్ షరీఫ్ ఖాన్‌గా గుర్తించారు. ఓ పండ్ల వ్యాపారిపై కూడా ఉగ్రవాదులు దాడి చేసి పరారయ్యారు.

నోబెల్ దంపతులు



# పేదరిక నిర్మూలన ప్రయోగాలకు నోబెల్

## ఆర్థిక శాస్త్రంలో ఇండో-అమెరికన్ అభిజిత్ బెనర్జీకి విశిష్ట పురస్కారం

- అవార్డుకు ముగ్గురు ఎంపిక
- భర్తతోపాటు అవార్డుకు ఎంపికైన డఫ్లో
- అభిజిత్, డఫ్లోతోపాటు మైఖేల్ క్రెమర్‌కు అవార్డు
- ముగిసిన నోబెల్ విజేతల ఎంపిక ప్రక్రియ


మైఖేల్ క్రెమర్ | డఫ్లోతో | అభిజిత్

**స్టాక్‌హోమ్:** ప్రవాసభారతీయుడు అభిజిత్ బెనర్జీ ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. ఈ యేడాది ఆర్థికశాస్త్రంలో ముగ్గురిని నోబెల్ విజేతలుగా ప్రకటించారు. ఇండో-అమెరికన్ అభిజిత్ బెనర్జీ, ఎస్తేర్ డఫ్లో, మైఖేల్ క్రెమర్‌కు ఈ అవార్డును సంయుక్తంగా గెలుచుకున్నారు. విజేతల్లో ఒకరైన ఎస్తేర్ డఫ్లో మన అభిజిత్‌కు సతీమణి కావడం విశేషం. ఒకే రంగంలో దంపతులిద్దరు నోబెల్ పురస్కారానికి ఎంపికవడం ద్వారా వీరు రికార్డులకెక్కారు. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలించేందుకు ఈ ముగ్గురు చేపట్టిన వినూత్న ప్రయోగాలను నోబెల్ కమిటీ గుర్తించింది.

కాగా, ఆర్థికశాస్త్రంలో నోబెల్ పొందిన రెండవ భారత సంతతి వ్యక్తిగా అభిజిత్ నిలిచాడు. ఇతనికంటే ముందు అమర్త్యసేన్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందారు. 58 ఏళ్ల బెనర్జీ, 46 ఏళ్ల ఫ్రెంచ్ అమెరికన్ డుఫ్లో మెసాచుసెట్స్ వర్సిటీలో ప్రొఫెసర్లుగా పనిచేస్తుండగా, మూడో విజేత 54 ఏళ్ల క్రెమర్ హార్వర్డ్ వర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 50 ఏళ్ల చరిత్రలో ఆర్థికశాస్త్రంలో నోబెల్ పొందిన రెండవ మహిళగా, పిన్నవస్కురాలిగా డఫ్లో గుర్తింపు పొందారు. ఇంతకుముందు 2009లో ఎలినార్ ఓస్ట్రామ్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని గెలుచుకున్నారు.

9 మిలియన్ల స్వీడన్ క్రోనాల నగదు బహుమతిని ఈ ముగ్గురు సమానంగా పంచుకోనున్నారు.

కేవలం రెండు దశాబ్దాల్లోనే ఈ ముగ్గురు ప్రతిపాదించిన పరిశోధనా సిద్ధాంతాలు ఆర్థికవ్యవస్థను మార్చేశాయని కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. వీరు ప్రతిపాదించిన సిద్ధాంతం.. చిన్న చిన్న ప్రశ్నలతో కీలక సమాచారాన్ని సేకరించే విధంగా చేసింది. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యేందుకు కావాల్సిన అనేక అంశాలను వీరు తమ సిద్ధాంతంలో పొందుపరిచారు. కెన్యా లాంటి చోట్ల పాఠశాల ఫలితాల అభివృద్ధిని మెరుగుపరిచింది. ఇండియా వంటి దేశంలోనూ ఆర్థిక సూత్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని రాయల్ సొసైటీ తెలిపింది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు వీరి సిద్ధాంతాలను విశేషంగా వినియోగిస్తున్నట్లు కమిటీ చెప్పింది. ఆర్థికవేత్తల ప్రతిపాదన వల్ల సుమారు 50 లక్షల మంది భారతీయ చిన్నారులు లబ్ధి పొందినట్లు కూడా నోబెల్ కమిటీ వెల్లడించింది. 1901 నుంచి 2018 మధ్య కాలంలో 935 మంది వ్యక్తులు లేదా సంస్థలకు నోబెల్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ బహుమతిలో భాగంగా 9 మిలియన్ క్రోనర్ (918,000 డాలర్లు) నగదు, బంగారు పతకం ఒక ప్రశంసా పత్రం ప్రదానం చేస్తారు.

ఆర్థికశాస్త్రంలో విజేతల ప్రకటనతో ఈ యేడాది నోబెల్ అవార్డుల ఎంపిక ప్రక్రియ ముగిసింది. 2019 సంవత్సరం విజేతల్లో కేవలం ఇద్దరు మహిళలకు మాత్రమే ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. వీరిలో పోలాండ్ రచయిత్రి ఓల్గా టోకార్క్‌జుక్ గతేడాదికి గాను సాహిత్య నోబెల్ పొందగా, ఆర్థికశాస్త్రంలో డఫ్లోకు నోబెల్ లభించింది. మిగతా రంగాల మాదిరిగా కాకుండా, ఆర్థికశాస్త్రంలో ఈ పురస్కారాన్ని 1969లో మొదటిసారి ప్రకటించారు. స్వీడన్ సెంట్రల్ బ్యాంకు 300 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 1968లో దీన్ని ప్రవేశపెట్టారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరిట అవార్డులను 1895 నుంచి ప్రకటిస్తూ వస్తున్నారు.

### ముంబై నుంచి మెసాచుసెట్స్ దాకా..

ఫిబ్రవరి 21, 1961లో అభిజిత్ ముంబైలో జన్మించారు. కలకత్తా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చేశారు. జవహర్‌లాల్ వర్సిటీ నుంచి పీజీ చేశారు. 1988లో అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు.

కేంబ్రిడ్జ్ లోని మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫోర్డ్ ఫౌండేషన్‌లో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ గా చేస్తున్నారు. 2003లో అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్‌ను అభిజిత్ ప్రారంభించారు. దాంట్లో డుఫ్లో, సెంథిల్ ముల్లైనాథన్‌లు కూడా ఉన్నారు. ఆ పరిశోధనశాలకు అభిజిత్ డైరక్టర్‌గా ఉన్నారు. యూఎన్ సెక్రటరీ జనరల్‌లోని డెవలప్‌మెంట్ ఎజెండాలోనూ అభిజిత్ సభ్యుడిగా ఉన్నారు. మిట్ (మెసాచుసెట్స్ వర్సిటీ) వెబ్‌సైట్ ప్రకారం అభిజిత్ 2017లో అమెరికన్ పౌరుడిగా గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది.

### రాష్ట్రపతి, ప్రధాని ప్రశంస

భారత సంతతి ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ అత్యంత ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని మోడీ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు అభినందనలు తెలిపారు. మరోవైపు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ వర్సిటీ అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థుల సంఘం బెనర్జీకి నోబెల్ పురస్కారం లభించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో అభిజిత్ పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

### బెనర్జీ రచనలు..

| | |
|---|---|
| ఒలటిలిటీ అండ్ గ్రోత్ | (2005) |
| అండర్‌స్టాండింగ్ పావర్టీ | (2006) |
| మేకింగ్ ఎయిడ్ వర్క్ | (2005) |
| పూర్ ఎకనామిక్స్ | (2011) |
| గ్లోబల్ పావర్టీ | (2011) |
| హ్యాండ్‌బుక్ ఆఫ్ ఫీల్డ్ ఎక్స్‌పర్‌మెంట్- పార్ట్ 1 | (2017) |
| హ్యాండ్‌బుక్ ఆఫ్ ఫీల్డ్ ఎక్స్‌పర్‌మెంట్- పార్ట్ 2 | (2017) |
| ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ పావర్టీ మెసర్‌మెంట్స్ | ( 2019) |

### అభిజిత్ కేసీఆర్ అభినందన

భారతీయ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీకి ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి రావడం అభినందనీయమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 2019 ఆర్థిక సంవత్సరానికి ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థికవేత్తగా నిలిచిన బెనర్జీకి అభినందనలు తెలిపారు. ప్రపంచ పేదరికాన్ని నిర్మూలించడానికి ఆయన చేసిన ప్రయోగాత్మక విధానం సత్ఫలితాన్ని ఇచ్చినందుకు గానూ ఈ బహుమతి వరించిందని తెలిపారు. అభిజిత్ బెనర్జీ ఆదర్శంగా దేశీయ ఆర్థికవేత్తలు పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేయాలని కేసీఆర్ ఆకాంక్షించారు.






### నోబెల్ భారతీయులు

ఫిజిక్స్, కెమిస్ట్రీ, శాంతి, ఆర్థికశాస్త్రం, వైద్యం తదితర రంగాల్లో పలువురు భారతీయులు, భారతీయ సంతతికి చెందిన వారికి నోబెల్ అవార్డులు లభించాయి. ఈ జాబితాలో తాజాగా అభిజిత్ బెనర్జీ కూడా చేరారు.

- రవీంద్రనాథ్ ఠాగూర్ 1913లో సాహిత్యంలో ఠాగూర్ నోబెల్ గెలుచుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు.
- 1930 లో సి వి రామన్ కాంతి ప్రయోగాలకు గాను భౌతికశాస్త్రంలో నోబెల్ లభించింది.
- 1968లో హరగోవింద్ ఖురానా వైద్యరంగంలో ప్రతిష్టాత్మక పురస్కారం గెలుచుకున్నారు. తద్వారా నోబెల్ పొందిన తొలి ప్రవాస భారతీయుడిగా నిలిచారు.
- 1979లో మదర్ థెరీసాకు శాంతి పురస్కారం లభించింది. అల్బేనియన్ మూలాలు కలిగిన రోమన్ కాథలిక్ సన్యాసిని అయినప్పటికీ, 'ది మిషనరీస్ ఆఫ్ ఛారిటీ'ని స్థాపించి భారతీయ పౌరసత్వం పొందారు.
- 1983లో భౌతిక శాస్త్రంలో మరో ప్రవాసభారతీయుడు సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ నోబెల్ బహుమతి గెలుచుకున్నారు. విలియం ఫౌలర్‌తో కలిసి "నక్షత్రాల నిర్మాణం-పరిణామానికి ప్రాముఖ్యత కలిగిన భౌతిక ప్రక్రియల సైద్ధాంతిక అధ్యయనాలు" చేశారు.
- 1998లో ఎకనామిక్ సైన్సెస్ విభాగంలో ఆర్థికవేత్త అమర్త్య సేన్ ప్రతిష్టాత్మక పురస్కారం సొంతం చేసుకున్నారు.
- 2009లో వెంకట్రామన్ రామకృష్ణన్‌కు రసాయ నశాస్త్రం విభాగంలో నోబెల్ బహుమతి లభించింది. రైబోజోమ్ నిర్మాణం, పనితీరుపై అధ్యయనం చేశారు.
- చివరిసారిగా 2014లో కైలాష్ సత్యార్థి నోబెల్ శాంతి బహుమతిని పొందారు. పాకిస్తాన్ యువకుడు మలాలా యూసఫ్‌జాయ్‌తో కలిసి అవార్డును పంచుకున్నారు. చిన్నారులకు విద్యాహక్కు కోసం ఆయన అలుపెరగని పోరాటం చేసినందుకు నోబెల్ పురస్కారం వరించింది.



# ముగ్గురు మొనగాళ్లు..!

**ముంబై:** అసెంబ్లీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీజేపీ విజయానికి వెనుకబడిన వర్గాల ఓటు బ్యాంకు కీలకంగా మారింది. ఈవర్గం ఓటు బ్యాంకును కాషాయపార్టీవైపు మళ్లించే బాధ్యతలను ముగ్గురు సీనియర్ నేతలకు హైకమాండ్ అప్పగించింది. వంజర, మరాఠా కమ్యూనిటీ నేతలైన పంకజ్‌ముండే, గిరీశ్ మహాజన్, చంద్రకాంత్ పాటిల్ ఈ బృహత్తర బాధ్యతలు భుజానికెత్తుకున్నారు. దసరా రోజు మరాఠ్వాడాలోని బీడ్ జిల్లా సావర్‌గావ్‌లో అమిత్‌షా ప్రచారం నిర్వహించారు. ఇక్కడ పంకజ్ ముండే పోటీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పనులే మహారాష్ట్రలో తమను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని బీజేపీ నేతలు బలంగా నమ్ముతున్నారు.

### బీసీల కోసం ముండే పోరాటం

మరాఠాల విషయంలో ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ వివాదాస్పద వ్యాఖ్యలను గోపీనాథ్ ముండే తీవ్రంగా ఖండించారు. వెనుకబడిన వర్గాల నాయకులతోపాటు, వంజర, మలీ, ధనగర్‌లతో కలిసి పెద్ద పోరాటమే చేశారు. మరాఠాలకు తీసిపోని విధంగా వెనుకబడిన వర్గాలకు గౌరవం దక్కేందుకు ఎంతో కష్టపడ్డారు. మహారాష్ట్రలో మరాఠా ఓటర్లతో పాటు ఓబీసీ వర్గాల చెందిన ఓటర్లు కూడా అధికారం కట్టబెట్టే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఓబీసీ నుంచి బీజేపీలో చాలా మంది కీలక నేతలుగా ఉన్నారు. ప్రస్తుతం పంకజ్ ముండే ప్రభుత్వంలో సీనియర్ మంత్రి హోదాలో పని చేశారు.

### షా రోల్ మోడల్ చంద్రకాంత్‌పాటిల్

రెవెన్యూ, పీడబ్ల్యూడీ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్‌ను మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమించినప్పుడు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. షా రోల్ మోడల్‌గా చంద్రకాంత్ పాటిల్. అమిత్‌షా కంటే చంద్రకాంత్ పాటిల్ ఆరేళ్లు పెద్ద. పాటిల్ ఏబీవీపీ నేతగా ఉన్న సమయంలో అమిత్‌షా రాజకీయ విద్యార్థిగా ఉన్నారు. పాటిల్ నుంచి ఆర్గనైజేషన్ పరంగా అమిత్‌షా ఎంతో నేర్చుకున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో ఏక్‌నాథ్ ఖడ్సేను మంత్రి బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది. అప్పుడు ఆ శాఖను చంద్రకాంత్ పాటిల్ తీసుకున్నారు. ప్రభుత్వంలో నెంబర్ 2 నేతగా చంద్రకాంత్ పాటిల్ వ్యవహరించారు. లేజిస్టేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా ఉన్నారు. ఫడ్నవిస్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్న గిరీశ్ మహజన్ కాంగ్రెస్, ఎన్‌సీపీ నేతలను ధీటుగా ఎదుర్కొనే సమర్థుడు. శివసేనతో సీట్ల పంపిణీలో కీలకంగా వ్యవహరించారు.

### కీలక నేతలు ఔట్

**ఏక్‌నాథ్ ఖడ్సే :** వెనుకబడిన వర్గానికి చెందిన నేత. ముక్తాయ్‌నగర్ నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో టికెట్ రాలేదు. ఆయన కుమార్తె రోహిణి ఇప్పుడు పోటీ చేస్తున్నారు.

**వినోద్ తావ్డే :** బోరివలీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే. ఈయనకు కూడా అధిష్టానం టికెట్ ఇవ్వడానికి నిరాకరించింది. అయితే దీనికి కారణం ఏంటో చెప్పాలంటూ వినోద్ తావ్డే బహిరంగంగానే అధిష్టానాన్ని ప్రశ్నించారు.

**రాజ్ పురోహిత్ :** ముంబాదేవి, కొలాబా నియోజకవర్గాల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఈసారి టికెట్ ఇవ్వకపోవడంతో నామినేషన్ వేయలేదు. ప్రధాని మోడీ, అమిత్‌షా చేసిన కొన్ని కార్యక్రమాలు, నిర్ణయాలపై విమర్శలు గుప్పించారు.

**ప్రకాష్ మెహతా :** గుజరాతీ కమ్యూనిటీకి చెందిన నేత. ఘట్కోపర్ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఫడ్నవిస్ మంత్రివర్గంలో కూడా పని చేశారు. లోకాయుక్తా నివేదిక తరువాత ఆయన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కొన్ని ప్రాజెక్టులపై అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు.

**చంద్రశేఖర్ బన్వాకులే :** కంపాటీ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నితిన్ గడ్కరీ అత్యంత సన్నిహితుడు. కంపాటీ నుంచి చంద్రశేఖర్ భార్య జ్యోతి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

# 370 x రాఫెల్

- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచార అస్త్రాలు
- జాతీయవాదంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్న మోడీ, షా
- ఎన్డీయే అసమర్థత, అవినీతి అంశాలే అస్త్రాలుగా రాహుల్ ప్రచారం

**న్యూఢిల్లీ:** అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ పార్టీలు మరోసారి పరస్పర ఆరోపణాస్త్రాలు సంధించుకుంటున్నాయి. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విమర్శల జోరు పెంచాయి. సార్వత్రిక ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ ప్రధాన ప్రచారకులుగా వారివారి పార్టీల తరఫున ఎన్నికల రణరంగంలోకి దూకారు.

విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ ఆదివారం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. పోలింగ్‌కు మరో వారం రోజులు మాత్రమే గడువుండటంతో, ఇద్దరు నేతలు సుడిగాలి ర్యాలీలు చేపడుతున్నారు. బీజేపీ మళ్లీ జాతీయవాదాన్ని, దేశభద్రత అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తుండగా, కాంగ్రెస్ మునుపటి పంథానే కొనసాగిస్తోంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవినీతిని ఎండగట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రధానంగా రాఫెల్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ, అధికారపార్టీపై రాహుల్ ఎదురుదాడి చేస్తున్నారు.



### మోడీ జాతీయవాద ఎజెండా

ఆదివారం ప్రధాని మోడీ మహారాష్ట్రలో మూడు చోట్ల ప్రచారం నిర్వహించారు. ఆగస్టు 5న బీజేపీ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని హైలెట్ చేశారు. జమ్ము-కాశ్మీర్‌లో 370 అధికరణం రద్దు చేయడం ద్వారా కాశ్మీరీ ప్రజల హక్కులను పునరుద్ధరించామని నొక్కిచెప్పారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, దీన్ని వెనక్కితీసుకొస్తామని ప్రకటించాలని సవాల్ విసిరారు. అదేవిధంగా త్రిపుల్ తలాఖ్, జాతీయ పౌర నమోదు అంశాలను ప్రస్తావిస్తూ తాము దేశానికి మేలుచేసే పనులు చేస్తున్నామని, 70 ఏళ్లుగా కొనసాగుతున్న దుష్టాచారాలను సమూల ప్రక్షాలన చేస్తున్నామని చెబుతున్నారు. అదేసమయంలో సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పాటుపడుతున్నదని ప్రచారం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపునకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టామని, గ్రామీణభారతావని రూపురేఖలు మార్చేస్తామని పునరుద్ఘాటిస్తున్నారు.

కాంగ్రెస్, ఎన్సీపీ వంటి విపక్షాల అసమర్థతను ఎత్తిచూపుతూ, మరోసారి బీజేపీకే అధికారం కట్టబెట్టాలని పిలుపునిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలే అయినా ఎక్కువగా జాతీయ అంశాలు, జాతీయవాదమే ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారాయి. కాగా, బీజేపీ తరఫున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నద్దా, కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బాలాకోట్ దాడుల సమయంలో రాఫెల్ ఉండివుంటే పరిస్థితి మరోలా ఉండేదంటూ రాహుల్ విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

### రాఫెల్ స్కాం, నిరుద్యోగం, వృద్ధిరేటు.. రాహుల్ అస్త్రాలివే..

అధికారపక్షం నుంచి హేమాహేమీలు ప్రచారం నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ తరఫున రాహుల్ ఒక్కరే అన్నీతానై ప్రచారాన్ని ఉధృతం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. బీజేపీ శైలికి విరుద్ధంగా, వాస్తవ అంశాలను, సమకాలీన సమస్యలను ఎత్తిచూపుతూ రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం అవినీతి కుంభకోణాలకు కేరాఫ్ రాఫెల్ అంటూ పదేపదే చెబుతున్నారు. మరొకవైపు దేశాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్న నిరుద్యోగం, ఆర్థికమందగమనం, రైతాంగ సంక్షోభం, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు దుష్ప్రభావాలను అస్త్రాలుగా ఎంచుకుని మోడీ బృందాన్ని టార్గెట్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే అంశాలను ప్రచారం చేసినప్పటికీ, బీజేపీకే ప్రజలు పట్టంగట్టారు. కాంగ్రెస్ ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వలేదని నాటి ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. ఈ క్రమంలో మళ్లీ పాత విమర్శలనే స్వరంపెంచి వినిపించడం ద్వారా లబ్ధిపొందాలన్న కాంగ్రెస్ వ్యూహం అంతుచిక్కడం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతన్నారు.



# మోడీకి దేవేగౌడ కితాబు

**బెంగళూరు:** మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ ప్రధాని మోడీని ప్రశంసలతో ముంచెత్తారు. మహాబలిపురం బీచ్‌లో మార్నింగ్ వాక్ సందర్భంగా మోడీ.. ప్లాస్టిక్ కవర్లను తొలగించడం అభినందనీయమని దేవేగౌడ పేర్కొన్నారు. మోడీ మహాబలిపురం బీచ్ పరిసరాల్లో ఉదయం వాక్ చేస్తూనే ప్లాస్టిక్ కవర్లను ఏరివేస్తున్న వీడియోను నేను చూశా..దేశాన్ని ప్లాస్టిక్ రహిత భారత్ మార్చేందుకు ఆయన చేసిన పని దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపేలా ఉంది. కర్నాటకలో బీజేపీ,జేడీఎస్ మధ్య విభేదాలతో ప్రధాని మోడీతో కొంతకాలంగా విబేధిస్తూ వస్తున్న దేవేగౌడ.. తాజాగా మోడీ ప్లాగింగ్‌పై హర్షం వ్యక్తం చేయడం గమనార్హం. గుజరాత్‌లోని నర్మదా నది తీరంలో స్టాట్యూ ఆఫ్ యునిటీ పేరుతో మోడీ ప్రభుత్వం నిర్మించిన సర్దార్ పటేల్ విగ్రహాన్ని కూడా త్వరలోనే సందర్శిస్తానని దేవేగౌడ ప్రకటించడం విశేషం.

# డీకే భార్య, తల్లికి ఈడీ నోటీసులు

**బెంగళూరు:** కర్నాటక మాజీ మంత్రి డీకే శివకుమార్ చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. మనీ లాండరింగ్ కేసులో గతనెల శివకుమార్‌ను అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ఆయన భార్య ఉష, తల్లి గౌరమ్మలకు కూడా నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో వారిద్దరిని ప్రశ్నించేందుకు ఈడీ తేదీలు కూడా ప్రకటించింది. శివకుమార్ తల్లిని నేడు (15వ తేదీన) విచారణకు రావాల్సిందిగా పేర్కొన్న ఈడీ.. ఆయన భార్యను ఈనెల 17న విచారించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద శివకుమార్ కుటుంబీకులు, వ్యాపార భాగస్వాములను విచారించనున్నట్లు ఈడీ తెలిపింది. గతనెలలో శివకుమార్ కుమార్తె ఐశ్వర్య(22)ను కూడా ఈడీ ప్రశ్నించింది.

ఐశ్వర్య స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన ఈడీ అధికారులు మిగతా కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించేందుకు నోటీసులు జారీ చేయడం గమనార్హం. సెప్టెంబర్ 2018 లో ఆదాయపు పన్ను శాఖ చేసిన ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సరిగ్గా ఏడాది తర్వాత గతనెల 3న శివకుమార్‌ను అరెస్ట్ చేసింది.

హవాలా రూపంలో శివకుమార్ డబ్బును ఇతరులకు పంపి.. పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆదాయపు పన్ను శాఖ కేసులు నమోదు చేసింది.

# పీపీఏలను గౌరవిస్తాం

- పునః సమీక్షలు పునరావృతం కావు
- ఏపీలోనూ కాంట్రాక్టులు కొనసాగుతాయి
- ఇన్వెస్టర్లు ఆందోళన చెందవద్దు
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల భరోసా

**న్యూఢిల్లీ :** విద్యుత్ రంగంలో కుదర్చుకున్న ఒప్పందాలకు, కాంట్రాక్టులకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. ఈ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ భరోసా ఇచ్చారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టు (పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి) లను ప్రభుత్వం పున:సమీక్షించాలని నిర్ణయించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ ... సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) , ఎన్‌టీ పీసీలను రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులపై టారిఫ్ తగ్గించాలని తమ నోడల్ ఏజెన్సీ ద్వారా ఒత్తిడి తెచ్చింది. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (విద్యుత్ కొనుగోలు ఒప్పందం)పై ఈ ప్రాజెక్టుల వేలం జరిగింది. దీంతో ఈ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీలు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాయి. రాష్ట్రప్రభుత్వాలు ఈ కాంట్రాక్టులపై సమీక్ష జరపాలని నిర్ణయించడంతో పెట్టుబడిదారులు ఆందోళనకు గురువుతున్నారు. అయితే దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇక్కడ జరుగుతున్న సెరావీక్ ఇండియా ఎనర్జీ పోరమ్‌లో మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టి ప్రస్తుతం ఆందోళనకు గురవుతున్న వారి ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని, ప్రభుత్వం ఆయా కంపెనీలతో కుదర్చుకున్న కాంట్రాక్టులు ఖచ్చితంగా అమలు అయ్యేలా తాము చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశంలోని కొన్నిరాష్ట్రాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ (పునరుత్పాదక ఉత్పత్తి) ఇంధన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్రప్రభుత్వాలు కాంట్రాక్టులను రద్దు చేసుకుంటున్న అంశం తమ దృష్టివచ్చిందని తెలిపారు. ఈ కాంట్రాక్టు అమలయ్యేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



పునరుత్పాదక విద్యుత్ రంగంలోభారత్ 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని.. కాబట్టి వచ్చే మూడేళ్ల కాలానికి ఈ రంగంలో పెద్దమొత్తంలో పెట్టుబడులు కావాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఇన్వెస్టర్లు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందన్నారు. నియంత్రణా సంస్థల నిబంధనలు మరింత సడలించి .. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. అలాగే విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి పన్నులు కూడా తగ్గించడానికి ప్రయత్నిస్తామని సీతారామన్ హామీ ఇచ్చారు.

# బీసీసీఐని గాడిలో పెడతా!

## సౌరవ్ గంగూలీ



### గంగూలీ నామినేషన్ దాఖలు

బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శ పదవులకు సౌరవ్ గంగూలీ, జయ్ షా సోమవారం బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎదుట నామినేషన్లు దాఖలు చేశాడు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసన్, మాజీ కార్యదర్శి నిరంజన్ షా, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ రాజీవ్ శుక్లా వెంటరాగా గంగూలీ మధ్యాహ్నం బీసీసీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకుని నామినేషన్ సమర్పించాడు. అనంతరం రాజీవ్ శుక్లా విలేకరులతో మాట్లాడుతూ అన్ని పదవులకు కలిపి మొత్తం ఎనిమిది నామినేషన్లు దాఖలైనట్టు తెలిపారు. గంగూలీ, జయ్ షాలతోపాటు మహిహ వర్మ(వైస్-ప్రెసిడెంట్), అరుణ్ సింగ్ ధుమాల్(కోశాధికారి), బ్రిజేష్ పటేల్(ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు), జయేష్ జార్జి(సంయుక్త కార్యదర్శి), ఖైరుల్ మజుందార్(గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు), ప్రభ్‌జోత్ సింగ్ భాటియా (కౌన్సిలర్) ఆయా పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా పోటీలేకుండా ఎన్నిక కానున్నారు. కాగా ప్రస్తుతం బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడుగా ఉన్న గంగూలీ, కేరళ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న జయేష్ జార్జి పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధన మేరకు తమ పదవులకు రాజీనామా చేయాల్సి ఉంది.



సోమవారం బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసన్, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ రాజీవ్ శుక్లాతో కలిసి వచ్చిన సౌరవ్ గంగూలీ.

**ముంబై :** టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బీసీసీఐ పగ్గాలు చేపట్టనున్నాడు. ఈ నెల 23న జరిగే బీసీసీఐ కార్యవర్గ ఎన్నికలకు నామినేషన్ల చివరి రోజైన సోమవారం అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైనందున వారిఎంపిక నామమాత్రమే. గంగూలీ బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసన్, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ రాజీవ్ శుక్లా తదితరులు వెంటరాగా తన నామినేషన్ దాఖలు చేశాడు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీసీసీఐకి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే తనముందున్న తక్షణ కర్తవ్యమని తెలిపాడు. అందులో భాగంగా ఎంతో కాలంగా తాను ప్రతిపాదిస్తున్న ఫస్ట్‌క్లాస్ క్రికెటెర్ల ఆర్థిక పరిపుష్టికి తన తొలి ప్రాధాన్యమని తెలిపాడు.

2017లో అనురాగ్ ఠాకూర్ నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దుచేసి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాలకవర్గ కమిటీ(సీఓఏ)ను ఏర్పాటు చేసిన అనంతరం 33 నెలలకు మళ్లీ బీసీసీఐ పూర్వ ఆకృతిని సంతరించుకోనున్నది. కీలక సమయంలో అధ్యక్షబాధ్యతలు చేపట్టనున్న గంగూలీ కేవలం తొమ్మిది నెలలు మాత్రమే ఆ పదవిలో కొనసాగనున్నాడు. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం లేఆఫ్ పీరియడ్ నిబంధనను అనుసరించి గంగూలీ అధ్యక్షబాధ్యతలను 9 నెలలు మాత్రమే నిర్వర్తించనున్నాడు. బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఎంతో గౌరవంతో కూడినదని, దానిని త్రికరణశుద్ధితో నిర్వహిస్తానన్నాడు. జాతీయ జట్టుకు నాయకత్వం వహించిన తాను దేశ క్రికెట్‌ను శాసించే వ్యవస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కానుండడం గౌరవంగా భావిస్తానన్నాడు. అంతకుముందు అధ్యక్షపదవికి బ్రిజేష్ పటేల్ పోటీపడనున్నాడని వార్తలు వచ్చినా చివరి క్షణంలో అతను పోటీనుంచి తప్పుకుని ఐపీఎల్ చౌర్మన్ పదవికి నామినేషన్ వేయడంతో గంగూలీకి పోటీ లేకుండాపోయింది.

గంగూలీ వచ్చే ఏడాది జులై వరకు అధ్యక్షపదవిలో కొనసాగుతాడు. రానున్న కొద్ది నెలలో తాను బీసీసీఐని గాడిలోపెట్టి అపెక్స కౌన్సిల్ సభ్యుల సహకారంతో పూర్వవైభవం తీసుకువస్తానన్నాడు. అధ్యక్ష హోదాలో అన్ని రాష్ట్ర సంఘాలు, స్పాన్సర్లతో చర్చించి బీసీసీఐ ముఖచిత్రం మారేలా నిర్ణయాలు తీసుకుంటామన్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ల సమస్యలను పరిష్కరించి వారిని ఆర్థికంగా ఆదుకోవడం ముఖ్యమన్నాడు. గత మూడేళ్లుగా సీఓఏ చేయని పనులను చేపట్టి బీసీసీఐకి తిరిగి ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నాడు. ఏకగ్రీవంగా అధ్యక్ష పదవికి ఎంపకి కావడం తనపై బాధ్యతలను మరింత పెంచిందన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో బీసీసీఐ ప్రభావవంతమైన వ్యవస్థ అని, దానిని నిర్వహిం చడం ఒక చాలెంజ్‌వంటిదన్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవిని తానెన్నడూ కోరుకోలేదని, కానీ సహచర సభ్యుల కోరిక మేరకు అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నానని తెలిపాడు. కేవలం తొమ్మిది నెలలే అధికారంలో ఉంటారన్న ప్రశ్నకు సమాధానమిస్తూ నిబంధనలను గౌరవిస్తామని, ఎంతకాలం అధికారంలో ఉన్నామన్నది ముఖ్యం కాదని, సభ్యులకు ఎంత మేలు చేశామన్నదే తనకు ముఖ్యమన్నాడు. వ్యక్తిగత సమస్యలకంటే వ్యవస్థ ప్రయోజనాలే ముఖ్యమన్నాడు.



జయ్ షా

# ఐసీసీతో బీసీసీఐ వార్

### ఫ్యూచర్స్ టూర్ ప్రోగ్రామ్(ఎఫ్‌టీపీ)తో విభేదాలు

**ముంబై:** త్వరలో అధికారం చేపట్టనున్న బీసీసీఐ నూతన కార్యవర్గం ఐసీసీతో ప్రచ్ఛన్న యుద్ధం చేయనున్నది. ఐసీసీ ప్రతిపాదిత ఫ్యూచర్స్ టూర్ ప్రోగ్రామ్(ఎఫ్‌టీపీ)తో బీసీసీఐ విభేదిస్తున్నది. ఇందుకు ప్రధాన కారణం బీసీసీఐ ఆదాయానికి ఎఫ్‌టీపీ గండికొట్టేలా ఉందన్నది బీసీసీఐ వాదన. ప్రతియేటా ప్రపంచ టీ20 చాంపియన్‌షిప్, మూడేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ నిర్వహించాలన్నది ఐసీసీ ప్రతిపాదన. ఇది కార్యరూపం దాల్చితే ప్రధాన స్పాన్సర్ స్టార్ నెట్‌వర్క్‌నుంచి లభించేఆదాయానికి చెక్ పడుతుందని బీసీసీఐ యోచిస్తున్నది. సౌరవ్ గంగూలీ, జయ్ షా నేతృత్వంలో అధికారం చేపట్టనున్న బీసీసీఐ ఎదుర్కోనున్న తొలి సవాల్ ఇదే. ఎఫ్‌టీపీ అంతర్జాతీయ మ్యాచ్‌లకు స్టార్ నెట్‌వర్క్‌నుంచి ప్రసార హక్కులద్వారా అత్యధిక ఆదాయం లభిస్తున్న విషయం తెలిసిందే. ఐసీసీ నూతన ప్రతిపాదన భారత్ ఆడే సిరీస్‌లకు, మ్యాచ్‌లకు స్టార్ నెట్‌వర్క్‌వల్ల వచ్చే ఆదాయానికి గండి పడనున్నది. అందుకే బీసీసీఐ ఈ ప్రతిపాదనకు ససేమిరా అంటున్నది. భారత్‌లో జరిగే, భారత్ ఆడే మ్యాచ్‌లకు ఐసీసీ ప్రతిపాదించిన టోర్నీలో అడ్డుగా నిలుస్తాయని, దానివల్ల బీసీసీఐ ఆదాయం తగ్గిపోతుందని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

# స్మిత్ వెన్నంటి కోహ్లీ

### తేడా ఒక్క పాయింట్



**దుబాయ్ :** టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ టాప్ ర్యాంక్‌లో ఉన్న స్టీవ్ స్మిత్‌ను సమీపించాడు. సౌతాఫ్రికాతో జరిగిన పుణె టెస్టులో కోహ్లీ అజేయంగా 254 పరుగులు చేయడంలో కోహ్లీ 936 రేటింగ్ పాయింట్లతో స్మిత్‌కు ఒక్క పాయింట్ దూరంలో నిలిచాడు. రాంచి టెస్టులో రాణిస్తే కోహ్లీ నంబర్ వన్ స్థానానికి చేరుకోవడం ఖాయం. 2018 జనవరి తరువాత తొలి టెస్టు అనంతరం కోహ్లీ తొలిసారి 900 పాయింట్ల దిగువకు దిగజారాడు. అయితే రెండో టెస్టులో డబుల్ సెంచరీతో రాణించి మళ్లీ స్మిత్‌కు పోటీగా నిలిచాడు. వన్డేలలో టాప్ ర్యాంక్‌లో ఉన్న కోహ్లీ రాంచి టెస్టు అనంతరం టెస్టుల్లోనూ టాప్ ర్యాంక్ చేజిక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌కూడా సౌతాఫ్రికాతో సిరీస్‌లో రాణించి బాగా లబ్ధి పొందాడు. తొలి టెస్టులో డబుల్ సెంచరీ చేసిన మయాంక్ రెండో టెస్టులోనూ సెంచరీతో మెరిశాడు. దీనితో అతడు ఎనిమిది స్థానాలు మెరుగై టాప్ 20లో(17) చోటు దక్కించుకున్నాడు. చతేశ్వర్ పుజారా, అజింక్య రహానె 4, 9 స్థానాలలో కొనసాగుతున్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ మూడు స్థానాలు మెరుగై 7వ ర్యాంక్‌కు చేరుకోగా, బుమ్రా మూడో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఆల్‌రౌండర్లలో జడేజా వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ తరువాత రెండో స్థానంలో నిలవగా, అశ్విన్ అయిదో స్థానంలో నిలిచాడు.



# తొలి విజయం దక్కేనా?

### బంగ్లాతో ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్

**కోల్‌కతా :** ఆసియా చాంపియన్లు ఖతార్‌ను గత మ్యాచ్‌లో నిలువరించిన స్ఫూర్తితో మంగళవారం బంగ్లాదేశ్‌తో జరుగనున్న ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు విజయంపై కన్నేసింది. ఫుట్‌బాల్ అంటే ప్రాణంపెట్టే కోల్‌కతా వాసులకు సాల్ట్‌లేక్ స్టేడియంలో జరుగనున్న ఈ గ్రూప్-ఇ మ్యాచ్ 45వేల ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. క్వాలిఫయింగ్ పోటీల తొలి మ్యాచ్‌లో ఒమన్ చేతిలో ఓడిన భారత్ ఖతార్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకుని తొలి పాయింట్‌ను దక్కించుకుంది. బంగ్లాతో మ్యాచ్‌లో విజయంతో పూర్తిస్థాయిలో మూడు పాయింట్లు సాధించాలని భారత్ పట్టుదలతో ఉంది. తొమ్మిదేళ్ల తరువాత జాతీయ జట్టు పాల్గొనే మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనున్న సాల్ట్‌లేక్ స్టేడియం మంగళవారం మ్యాచ్‌కు పూర్తిస్థాయిలో నిండనున్నది. కిక్కిరిసిన ప్రేక్షకుల సమక్షంలో భారత జట్టు తొలి విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నది. డిఫెండర్ సందేశ్ జింగన్ గాయంతో మ్యాచ్‌కు దూరంగా ఉన్నా, కెప్టెన్ సునీల్ ఛత్రి స్ఫూర్తితో భారత జట్టు ప్రత్యర్థిపై ఆధిపత్యం చలాయించాలని ఉవ్విళ్లూరుతున్నది. గత మ్యాచ్‌లో ఛత్రి తన 72వ అంర్జాతీయ గోల్‌తో ప్రస్తుత ఆటగాళ్లలో అత్యధిక గోల్స్‌లో చేసినవారిలో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. గోల్‌కీపర్ గురుప్రీత్ సింగ్ సంధుతోపాటు, అనాస్ ఎదతోడిక, ఆదిల్‌ఖాన్ రక్షణశ్రేణికి పెట్టని గోడలా ఉంటారు. కెప్టెన్ ఛత్రి, బల్వంత్‌సింగ్, మన్వీర్ సింగ్ ఫార్వర్డ్ లైన్‌ను నడిపించనున్నారు. వారికి దన్నుగా ఉదాంత్ సింగ్, ఆషిక్ కురునియన్, మందర్‌రావ్ దేశాయ్, సాహల్ అబ్దుల్ సమద్ మిడ్‌ఫీల్డ్‌ను కాచుకోనున్నారు. బలాబలాలను సమీక్షిస్తే భారత్ బలీయంగా కనిపిస్తున్నది. ముఖాముఖి పోరులోనూ భారత్‌దే పైచేయి. ఇప్పటివరకు ఇరు జట్లు 28 సార్లు తలపడగా భారత్ 15-2తో ఎదురులేని ఆధిక్యంలో ఉంది. గత రెండు మ్యాచ్‌లలో భారత్‌దే పైచేయి. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో వరుసగా రెండు ఓటముల నేపథ్యంలో బంగ్లాదేశ్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నది. అయితే ఇటీవల శాఫ్ చాంపియన్‌షిప్, 2013 స్నేహపూర్వక మ్యాచ్‌లో ఇండియాను నిలువరించిన బంగ్లాదేశ్ అంతకంటే మెరుగైన ప్రదర్శన చేయాలని ఆశిస్తున్నది.





# సింధుకు మరో సవాల్

### నేటినుంచి డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్

**ఓడెన్స్:** ప్రపంచ చాంపియన్ పి.వి.సింధు సత్తాకు డెన్మార్క్ ఓపెన్ సవాల్ విసరనున్నది. ప్రపంచ చాంపియన్‌షిప్ గెలిచిన తరువాత సింధు మళ్లీ పరాజయాల బాట పట్టడంతో మంగళవారం ఆరంభం కానున్న డెన్మార్క్ ఓపెన్‌లో తన ప్రతిభను నిరూపించుకోవాలని సింధు ఆశిస్తున్నది. ప్రపంచ టైటిల్ నెగ్గిన తరువాత సింధు చైనా ఓపెన్‌లో తొలి రౌండ్‌లో, కొరియా ఓపెన్‌లో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించి నిలకడ లేమిని ప్రదర్శించి విమర్శకులకు పని కల్పించింది.

ప్రపంచ ఆరో ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లో ఇండో నీ సియాకు చెందిన జార్జియా మారిస్కాను ఎదుర్కోనుంది. ప్రపంచ 16వ ర్యాంకర్ మారిస్కాపై సింధు ముఖాముఖి పోరులో 5-0 ఆధిక్యంలో ఉండడం ప్రపంచ చాంపియన్‌కు కలిసొచ్చే అంశం. ప్రపంచ 8వ ర్యాంకర్ సైనా నెహ్వాల్ జనవరిలో ఇండో నీసియా మాస్టర్స్ టైటిల్ నెగ్గిన తరువాత గాయాలతో సతమతమౌతున్నది. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా చైనా ఓపెన్, కొరియా ఓపెన్‌లలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గత ఏడాది ఫైనల్స్ చేరిన 8వ సీడ్ సైనా జపాన్‌కు చెందిన ప్రపంచ 12వ ర్యాంకర్ సయక తకహసిని తొలి రౌండ్‌లో ఢీకొంటుంది.

పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లో డెన్మార్క్ ఆటగాడు ఆండర్స్ అంటాన్సెన్‌ను ఎదుర్కొననున్నాడు. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అంటాన్సెన్ చేతిలో ఓడిన శ్రీకాంత్ అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఎదురుచూస్తున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్ దిగ్గజ ఆటగాడు లిన్ డాన్‌ను ఎదుర్కోనున్నాడు. ఈ ఏడాది థాయిలాండ్ మాస్టర్స్, మలేసియా ఓపెన్ టైటిల్స్ నెగ్గిన లిన్ డాన్ ఆ తరువాత ఫామ్‌కోసం తంటాలు పడుతున్నాడు. కామన్వెల్త్ మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్ ఈ ఏడాది ఇండియా ఓపెన్, కొరియా ఓపెన్‌లలో సెమీస్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్‌లో కశ్యప్ థాయిలాండ్‌కు చెందిన సిథికోమ్ థామసిన్‌తో తలపడతాడు. డెంగ్యూనుంచి కోలుకున్న హెచ్.ఎస్.ప్రణయ్‌కు తొలి రౌండ్‌లో గట్టి ప్రత్యర్థి ఎదురు కానున్నాడు. అతడు ఎనిమిదోసీడ్, ఇండోనీసియా ఆటగాడు ఆంథోనీ సినిసుకను ఢీకొంటాడు.

# సెమీస్‌కు బుల్స్, ముంబ

### ప్రొ కబడ్డీ సీజన్-7

**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ సీజన్-7లో బెంగళూరు బుల్స్, యు ముంబ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. సోమవారం జరిగిన ఎలిమినేటర్స్ మ్యాచ్‌లలో బెంగళూరు బుల్స్ 48-45 స్కోరుతో యూపీ యోధాపై, యు ముంబా 46-38 స్కోరుతో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించాయి. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో బెంగళూరు బుల్స్ అగ్రస్థానంలోని దబాంగ్ ఢిల్లీతో, యు ముంబా రెండో స్థానంలోని బెంగాల్ వారియర్స్‌తో తలపడతాయి.

సోమవారం తొలుత ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆరంభంలో బెంగళూరు వెనుకంజ వేసింది. విరామానికి 17-20తో వెనుకంజలో ఉన్న బెంగళూరు క్రమంగా పుంజుకుని 34వద్ద స్కోరును సమం చేసింది. ఆ తరువాత 42 పాయింట్లవద్ద ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 47-42 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఆపై ఆధిక్యాన్ని నిలుపుకుంటూ పూర్తి సమయానికి మూడు పాయింట్ల తేడాతో గెలుపొందింది. బెంగళూరు జట్టులో పవన్ షెరావత్ అత్యధికంగా 20 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. సుమిత్ సింగ్ 7, మహేందర్ సింగ్ 4, రోహిత్ కుమార్ 3, సౌరభ్, అమిత్ చెరి 2 పాయింట్లతో సహకరించారు. యోధా జట్టులో రిషాంత్ దేవడిగ(11) సూపర్ టెన్ సాధించగా, శ్రీకాంత్ జాదవ్ 9, సురేందర్ గిల్, సుమీత్, నితేష్, మోను గోయత్ తలా 5 పాయింట్లు సాధించారు.

మరో మ్యాచ్‌లో యు ముంబ ఆదినుంచీ ఆధిక్యం ప్రదర్శించింది. విరామానికి 23-15తో ఆధిక్యంలో నిలిచిన ముంబ జట్టు దానిని చివరివరకు కొనసాగించింది. ముంబ జట్టులో అభిషేక్ సింగ్(16), అర్జున్ దేశ్వాల్(15) సూపర్ టెన్స్ సాధించగా, ఫజల్ 3, సురిందర్ సింగ్, సందీప్ చెరి రెండు పాయింట్లు సాధించారు. హరియాణా జట్టులో వికాస్ కండోలా(13) సూపర్‌టెన్ స్కోర్ చేయగా, ప్రశాంత్ కుమార్, వినయ్ చెరి 9 పాయింట్లు సాధించారు.



# చివరిదీ వదల్లేదు..

### మహిళల వన్డేలో భారత్ క్లీన్‌స్వీప్



ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ మరిజానె కాప్

**వదోదర:** దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో సోమవారం ఉత్కంఠగా జరిగిన చివరి వన్డేలో భారత మహిళల జట్టు ఆరు పరుగుల తేడాతో గెలుపొందింది. చివరి క్షణంవరకు విజయంకోసం పోరాడిన దక్షిణాఫ్రికా జట్టు భారత బౌలర్ల దీక్షముందు తలవంచకతప్పలేదు. తొలుత మిథాలీ సేన 45.5 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ కాగా, సమాధానంగా దక్షిణా ఫ్రికా 48 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటయింది. ఒక దశలో 7 వికెట్లకు 137 పరుగులతో విజయందిశగా పయనిస్తున్న దక్షిణాఫ్రికా మూడు పరుగులు వ్యవధిలో చివరి మూడు వికెట్లను కోల్పోయి పరాజయం పాలైంది. భారత స్పిన్నర్ ఏక్తా బిస్త్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజానె కాప్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యారు.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు అయిదు పరుగులకే ఓపెనర్లిరువురినీ కోల్పోయింది. ఈ దశలో పూనమ్ రావత్, మిథాలీ రాజ్ కొంతమేరకు ఆదుకున్నారు. కుదురుకుంటున్న సమయంలో స్వల్ప వ్యవధి లో వీరిరువురూ పెవిలియన్ చేరడమేగాక, తరువాత వచ్చిన దీప్తి శర్మ, తాన్యా భాటియా స్వల్ప స్కోర్లకే వెనుతిరిగారు. ఈ దశలో హర్మన్‌ప్రీత్ కౌర్, శిఖా పాండే 49 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌కు జీవం పోశారు. స్కోరును వంద పరుగులు దాటించారు. అయినా భారత్ భారీ స్కోరు చేయకుండా దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టడి చేయగలిగారు. పూర్తి ఓవర్లు ఆడకుండానే భారత్ 146 పరుగులకు ఆలౌటయింది. కాప్ 3, ఇస్మాయిల్, ఖాకా చెరి 2 వికెట్లు పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో దక్షిణాఫ్రికా ఓపెనర్లు లెజ్లె లీ, ఉల్‌వర్త్ దూకుడుగానే ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. అయితే దక్షిణా ఫ్రికా నియంత్రణ కోల్పోయి 63 పరుగులకే అయిదు ప్రధాన వికెట్లను కోల్పోయింది. ఈ తరుణంలో కెప్టన్ లూస్ (24), కాప్(29) ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. 40 పరుగులు జోడించి విజయం దిశగా దూసుకు పోతున్న ఈ జోడీని బిస్త్ విడదీసింది. ఆ తరువాత దక్షిణాఫ్రికా క్రమంగా వికెట్లు కోల్పోతూ 140 పరుగులకే కుప్ప కూలింది. ఏక్తా బిస్త్ 3, దీప్తి శర్మ, రాజేశ్వరి గైక్వాడ్ చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఏక్తా బిస్త్

**సంక్షిప్త స్కోర్లు:** భారత్ ఇన్నింగ్స్ - 146 (హర్మన్‌ప్రీత్ కౌర్ 38, శిఖా పాండే 35, పూనమ్ రావత్ 15, మిథాలీ రాజ్ 11, మానసి జోషి 12, మరిజానె కాప్ 3/20, షబ్నిమ్ ఇస్మాయిల్ 2/18, అయబొంగ ఖాక 2/33), దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ - 140(మరిజానె కాప్ 29, సూనె లూస్ 24, ఉల్‌వర్త్ 23, లెజ్లె లీ 13, ఏక్తా బిస్త్ 3/32, దీప్తి శర్మ 2/24, రాజేశ్వరి గైక్వాడ్ 2/22).

# ప్రియాంశు, జుహి-వెంకట్‌లకు టైటిల్స్

**ఇసా టౌన్(బహ్రెయిన్) :** బహ్రెయిన్ ఇంటర్నేషన్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లు ప్రియాంశు రజవత్ పురుషుల సింగిల్స్, జుహి-వెంకట్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్ గెలిచారు. 17 ఏళ్ల ప్రియాంశు ఒక గేమ్‌ను కోల్పోయినా పుంజుకుని 16-21, 21-7, 21-12 స్కోరుతో కెనడాకు చెందిన జాసన్ ఆంథోనీ హోష్యును ఓడించి విజేతగా నిలిచాడు. అంతకుముందు ప్రియాంశు క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ అడె రెస్కి ద్వికాయోపై నెగ్గి సత్తాచాటాడు. ఈ విజయంతో ఇక్కడ టైటిల్ సాధించిన సమీర్‌వర్మ, సౌరభ్ వర్మ, సాయి ప్రణీత్, శుభాంకర్ డే, గురు సాయిదత్‌ల సరసన ప్రియాంశు నిలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్ టాప్‌సీడ్ జుహి-వెంకట్ 21-18, 21-16తో 34 నిమిషాలలో థాయిలాండ్ జోడి పనావత్ థీరపనిత్నన్-కన్యానత్ సుధోయిూచాంలపై గెలుపొంది స్వర్ణం అందుకున్నారు. కాగా మహిళల సింగిల్స్‌ఫైనల్లో ఇరా శర్మ 14-21, 22-24తో ఇండోనీసియాకు చెందిన ఫత్మావతి చేతిలో, పురుషుల డబుల్స్‌లో రోహన్ కపూర్-సౌరభ్ శర్మ 21-19, 16-21, 22-24తో థాయిలాండ్ జోడి ప్రద్‌తంగ్‌శ్రీపపీహన్-అపచశిత్ తీరవివత్‌ల చేతిలో ఓడి రజతాలతో సంతృప్తిచెందారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com



అమ్మని దైవంకంటే ఎక్కువగా భావించే సంస్కృతి మనది. అమ్మలోని అణువణువు పిల్లలకోసమే తపించాలని ఆశించే సమాజం మనది. పిల్లల పట్ల తల్లి బాధ్యత అంతటిదే. అందులో సందేహం లేదు. అయితే అమ్మ కాగానే...తన మనసులోంచి తనదైన జీవితాన్ని పూర్తిగా తుడిచేయాలా...తనకున్న ఇష్టాలు, ఆశలు అన్నీ పక్కకు పెట్టేయాలా...అమ్మగా మాత్రమే జీవించాలా...అనే ప్రశ్నలు సైతం మన సమాజంలో ఉన్నాయి. అనేక మంది ఆధునిక తల్లులు... పిల్లలు మా కనుపాపలే...అయినా మా జీవితమూ మాకు ముఖ్యమే అంటున్నారు. ఇలాంటి ఆలోచనలు పెరగాల్సిన అవసరం మరింతగా ఉందంటోంది నటి సమీరా రెడ్డి. అమ్మ... తన కలల కోసం కూడా తాను బతకాలంటున్న సమీరా రెడ్డి...తన రెండునెలల పసికందుని పదిలంగా పొట్టకు కట్టుకుని పర్వతాన్ని అధిరోహించింది. తనలాంటి తల్లుల్లో స్ఫూర్తిని నింపింది. ఈమె ఎక్కిన ముల్లాయనగిరి కర్ణాటకలోనే అత్యంత ఎత్తయిన పర్వతం.

# తల్లీ...తల్లడిల్లకు!

- రెండునెలల పాపతో ట్రెక్కింగ్ చేసిన నటి సమీరారెడ్డి
- స్టే ఎట్ హోమ్ మామ్ డిప్రెషన్‌కి విరుగుడు సూచనలు



అమ్మకాగానే అన్నీ త్యాగం చేసేయాల్సిన అవసరం లేదంటున్న సమీర.. తన రెండునెలల కూతురు నైరాతో 6,300 అడుగుల ఎత్తున్న పర్వతాన్ని ఎక్కుతున్న వీడియోని పోస్ట్ చేసింది. ట్రెక్కింగ్‌లో మధ్యలో శ్వాస తీసుకోవటం కష్టమైనప్పుడు ఆగానని, పాపకు అవసరమైనప్పుడు పాలు ఇస్తూ ముందుకు సాగానని ఆమె చెప్పుకొచ్చింది. చాలా మంది కొత్తగా తల్లులైన వారు తనని స్ఫూర్తిగా తీసుకుని ప్రయాణాలు చేయాలనుకుంటున్నామనే మెసేజ్‌లు పంపుతున్నారని తన సాహస ప్రయాణానికి అలాంటి పాజిటివ్ స్పందన రావటం చాలా ఆనందంగా ఉందని సమీర వెల్లడించింది.

### బిడ్డ అపురూపమే...ఆమె కలలు కూడా...

తల్లికావటం అనేది నిజంగా ఎంతో ఆనందాన్ని ఇచ్చే... అద్భుతమైన విషయమే. ప్రతి బిడ్డ పుట్టినప్పుడు ఒక తల్లి కూడా జన్మిస్తుందని...ఆమె తన పాపాయే లోకంగా బతుకుతుందని...అలాగే బతకాలని చాలమంది భావిస్తుంటారు. అందుకే చాలామంది తల్లులు అంతకుముందు తమ జీవితంలో ఉన్న తమకు నచ్చిన చాలా విషయాలను వదిలేస్తుంటారు. ఒకవేళ తమకు నచ్చిన పనులకు సమయాన్ని కేటాయించాల్సి వస్తే..అపరాధ భావనకు గురవుతుంటారు. అయితే బిడ్డ తల్లికి అపూరూపమే అయినా...ఆమె తన కలలను ఇష్టాలను ఆకాంక్షలను వదులుకోవాల్సిన అవసరం లేదంటుంది సమీర.

### స్టే ఎట్ హోమ్ మామ్ డిప్రెషన్

తల్లయిన స్త్రీకి బిడ్డ వరమే కానీ...తల్లయ్యాక వచ్చే మార్పులను జీర్ణించుకోవడమే కాస్త కష్టంగా ఉంటుంది. కుటుంబ సభ్యుల నుండి ఎదురయ్యే ఆంక్షలు, నియమ నిబంధనలు, బిడ్డ బాధ్యత, శరీరంలో వచ్చే మార్పులు... ఇవన్నీ ఆమెలో ఆందోళనని పెంచుతాయి. ఇంట్లోనే ఉండి ఇలాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి రావడాన్ని స్టే ఎట్ హోమ్ మామ్ డిప్రెషన్‌గా మానసిక నిపుణులు చెబుతున్నారు. అంతకుముందు ఉన్న జీవితానికి పూర్తిగా భిన్నంగా అనిపించే జీవితంలో ఇమిడే క్రమంలో ఎదురయ్యే మానసిక సంఘర్షణ అది. మొదటి బిడ్డ పుట్టినప్పుడు సమీరా రెడ్డికి బరువు పెరగటం వలన మానసిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ సారి ఆమె అలాంటి బాధలకు గురికాకూడదని గట్టిగా నిర్ణయించుకుంది. అందుకే తల్లయ్యాక ప్రయాణాలు, ట్రెక్కింగ్ చేస్తూ...తన మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచుకునే ప్రయత్నాలు చేస్తోంది.

### పాపాయినే కాదు... నచ్చిన పనినీ ప్రేమించాలి

బిడ్డకు జన్మనివ్వటం ఎలా తనకు హక్కో...అలాగే మానసికంగా శారీరకంగా తన ఆరోగ్యాన్ని కాపాడుకోవటం కూడా స్త్రీలకు ఉన్న హక్కే. ఇలాంటప్పుడు...బిడ్డ తల్లయి ఉండి...అలా చేసిందా...లాంటి విమర్శలను పట్టించుకోనవసరం లేదని సమీరా రెడ్డి భావిస్తోంది. అయితే అందరూ ప్రయాణాలు చేయాలని, పర్వతాలు ఎక్కాలని కాదు...తల్లయ్యాక తప్పకుండా లక్ష్యాలను సాధించాలనీ కాదు...తల్లయిన స్త్రీ...తన జీవితంలోని తనకు నచ్చిన అంశాలను, తన ఉనికిని నిలబెట్టే అంశాలను వదిలేయకూడదనే....ఈ మొత్తం అంశంలో ఉన్న సారాంశం. అందుకే..తల్లి తన జీవితంలోకి వచ్చిన పాపాయికి ఆహ్వానం పలికిన వెంటనే తన ఇష్టాలకు వీడ్కోలు పలకాలని లేదు. చదవటం, రాయటం, సంగీతం, నృత్యం, మొక్కలు పెంచడం...ఇలా తన ఇష్టం ఏదైనా....పాపాయితో పాటు దానినీ ప్రేమించాలన్నదే... సమీరా రెడ్డి చేసిన పని వెనుక ఉన్న అర్థంగా భావించాలి.

- వి. దుర్గాంబ

**పేదరికం, అంగవైకల్యం...ఈ రెండూ ఎవరినైనా కుంగదీస్తాయి. నాకే ఎందుకిలా జరిగింది...అనే నిరాశా నిస్పృహలు వెంటాడతాయి. కానీ దాసరి దుర్గారావు అదే పరిస్థితుల్లో ఉన్నా...తనని తాను అలా తక్కువగా చూసుకోలేదు. గుండెల నిండుగా ఆత్మవిశ్వాసం నింపుకుని ఉపాధిని సంపాదించుకున్నాడు. నిరంతరం శ్రమిస్తూ తన కుటుంబాన్ని పోషించుకోవడమే కాకుండా ...ఇతరులకు సహాయం చేసే స్థాయిలో తనని తాను నిలుపుకున్నాడు. వైకల్యాన్ని జయించి జీవితాన్ని తీర్చిదిద్దుకున్న దుర్గారావు... దిక్కులేని అభాగ్యుల కడుపు నింపుతూ తన పెద్ద మనసుని చాటుతున్నాడు.**

# నడవలేడు... నడతలో శ్రీమంతుడు!

## అభాగ్యుల ఆకలి తీరుస్తున్న దాసరి దుర్గారావు



33 సంవత్సరాల క్రితం విజయవాడలో రెక్కాడితేగాని డొక్కాడని ఒక నిరుపేద కుటుంబంలో దుర్గారావు జన్మించాడు. రెండేళ్ల వయస్సు వరకు అందరు పిల్లల్లాగే ఆడుతూ పాడుతూ పెరిగిన దుర్గారావు... దురదృష్టవశాత్తూ పోలియో బారిన పడి అంగవైకల్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులు కుంగి పోకుండా కొడుకుని పదవ తరగతి వరకు చదివిం చారు. వృత్తిరీత్యా పందులను మేపుకుని జీవనం సాగించే తండ్రి, అనారోగ్యంతో పనులు చేసుకోలేని తల్లి, వివాహం చేసుకొని వేరుగా జీవనం సాగిస్తున్న సోదరుడు... ఇదీ దుర్గారావు కుటుంబం. పరిస్థితులకు కుంగిపోకుండా పదవ తరగతి పాసై... పాలిటెక్నిక్‌లో చేరారు. అయితే కుటుంబ ఆర్థిక స్థితిగతులు సహకరించక పోవటంతో చదువుని మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. శారీరక వైకల్యం ఉన్న కొడుక్కి వివాహం చేస్తే భార్య చేదోడు వాదోడుగా ఉంటుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కాలగమనంలో తండ్రి సైతం మరణించటంతో దుర్గారావుకి కుటుంబ పోషణ గగనమైంది. అప్పుడే కుటుంబానికి తాను భారం కాకుండా ఏదైనా చేయాలనే ఆలోచన అతనిలో మొలకెత్తింది.

### జీవనోపాధి కోసం పాట్లు

దుర్గారావు మూడు చక్రాల సైకిల్‌ని సమకూర్చుకొని దానిపై బుట్ట పెట్టుకొని పూల వ్యాపారం చేయటం మొదలుపెట్టాడు. అయితే అది అంత ఆశాజనకంగా సాగలేదు. అనంతరం చిన్న చిన్న ప్లాస్టిక్ బొమ్మలను కొనుగోలు చేసి వాటిని వీధుల వెంట తిరిగి విక్రయించ సాగారు. రాత్రి కాగానే బొమ్మలను పక్కనపెట్టి అదే సైకిల్‌పై టీ, సిగరెట్లు అమ్ముతుండేవాడు. ఈ విధంగా రాత్రి, పగలు కష్టపడినప్పటికి అతనికి కుటుంబ పోషణ జరిగేది కాదు. వచ్చిన డబ్బంతా ఆసుపత్రి ఖర్చులకే సరిపోయేది. అప్పటికే ముగ్గురు ఆడపిల్లలు కలిగిన దుర్గారావుకు వారికి చదువు చెప్పించటం, కుటుంబ పోషణ... మరింత భారంగా మారింది. ఆ సమయంలో వేరే పనికోసం కాళ్లరిగేలా తిరిగినా... అతని శారీ రక వైకల్యాన్ని చూసి అతనికి పని ఇచ్చేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. చివరకు మాంసం దుకాణంలో కిలోకి 20 రూపాయలు చెల్లించేఒప్పందంపై రొయ్యలు వలిచేపని లభించింది. అదే దుర్గారావు జీవితంలో ఒక మలుపుకు కారణం అయింది.

### వ్యాపారంలో మరింత ముందుకు...

రొయ్యలు వలిచే పనితో జీవనోపాధి సాగి స్తున్న దుర్గారావుకి... విధివశాత్తు తనకు సంక్ర మించిన శారీరక వైకల్యాన్ని తనకు అనువుగా మార్చుకోవాలనే ఆలోచన కలిగింది. తాను నేరుగా చేపలు, రొయ్యలు అమ్ముతానని...కొనేవారు తన పరిస్థితి చూసి తనకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో అయినా కొనే అవకాశం ఉందని అతను తన యజమానికి నచ్చజెప్పాడు. దుర్గారావు అమ్మటం మొదలుపెట్టాక వ్యాపారం పెరగటంతో... అతనికి వేతనంగా సాధారణ దినాలలో 600 రూపాయలు, ఆదివారాలలో 800 రూపాయలు లభించ సాగింది. గతంతో పోల్చుకుంటే కొంతవరకు పరిస్థితి మెరుగ్గానే ఉన్నప్పటికీ దుర్గారావుకి జీవితంలో ఏదో తెలియని వెలితి అనిపించేది. కొద్దిరోజులకు వ్యాపారుల వద్ద 10 నుంచి 20 కిలోల వరకు చేపలు, రొయ్యలు అరువుగా తీసుకొని వాటిని విక్రయించిన అనంతరం డబ్బు చెల్లిస్తుండేవాడు. విజయవాడ నగరంలో రోడ్డు ప్రక్కన మాంసం విక్రయాలకు వీలుగాక పోవటంతో, ప్రతిరోజు ఆటోలో చేపలు, రొయ్యలు తీసుకువచ్చి గుంటూరులో అమ్మటం మొదలు పెట్టాడతను. గుంటూరులో దుర్గారావు వ్యాపారానికి మంచి ఆదరణ లభించింది. సాధారణ దినాలలో 2 నుంచి 3 వేల వరకు, ఆదివారాలలో పదివేల రూపాయల వరకు వ్యాపారం జరిగేది. జీవితం సాఫీగా సాగిపోతుంది అనుకుంటున్న తరుణంలో ఒక అనూహ్య సంఘటన జరిగింది. ఆ సంఘటన దుర్గారావు జీవితాన్ని మరో మలుపుతిప్పింది.

### ఆ సంఘటనతో...

ఒకరోజు దుర్గారావు...తన వ్యాపార ప్రదేశంలో భోజనం చేస్తుండగా ఒక యాచకురాలు అతని ముందుకు రాగా... జేబులోంచి పది రూపాయలు తీసి ఆమెకు ఇచ్చారు. ఆమె అతనికి ఎదురుగా వున్న ఒక చెట్టుకు ఆనుకొని కూర్చుని... కూర్చొన్న చోటునే కన్నుమూసింది. ఆ సంఘటన తన జీవితంలో మరచిపోలేని ముద్ర వేసిందంటాడు అతను. 'ఆమె ఆకలితో ఉన్నప్పటికి భోజనం చేస్తున్న నా వైపే చూస్తున్నది కానీ తనకొక ముద్ద పెట్టమని అడగలేదు. నేను కూడా పదిరూపాయలు ఇచ్చాను కదా... అనే ధీమాతో భోజనం చేస్తావా... అడుగలేదు. అంతలోనే ఆమె కన్ను మూసింది' అంటూ బాధతో అతను ఆ సంఘటనను గుర్తు చేసుకున్నాడు. ఎదురుగా ఆకలితో అలమటిస్తూ ఉన్న ఒక వృద్ధురాలిని పట్టించుకోకుండా తాను భోజనం చేసినందుకు ఎంతో సిగ్గుపడినట్టుగా అతను చెప్పాడు. అప్పుడే అతనిలో ఆకలితో అలమటించేఅభాగ్యులకు ఏదైనా చేయాలనే తలంపు కలిగింది. ఆ తలంపే ధృఢ సంకల్పంగా మారింది.

### అన్నార్తుల పాలిట కల్పవృక్షం..

దిక్కులేనివారిని, సంపాదిం చుకునే శక్తి లేనివారిని... పట్టించు కోవటం, వారికి అండగా నిలవటం తన కర్తవ్యంగా భావించాడు దుర్గారావు. వ్యాపారం ద్వారా వారానికి తనకు లభిస్తున్న ఆదా యంలో కుటుంబ అవసరాలకు కేవలం మూడు లేదా నాలుగు వేలు మిగుల్చుకొని మిగిలిన మొత్తాన్ని పేదలకోసం ఖర్చుపెడుతున్నట్లు దుర్గారావు తెలిపాడు. బాబా భక్తుడైన దుర్గారావు ప్రతి గురువారం జనసమ్మర్ద ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపైన ఉండే అనాధలకు కడుపునిండా భోజనం పెడుతున్నాడు. ప్రతివారం అతను దాదాపు 3 వందల మంది అభాగ్యులకు ఆకలి తీరుస్తున్నాడు. ఒక్కొక్క భోజనం ప్యాకెట్ విలువ 50 రూపాయలు వుంటుంది. వాటిని సరఫరా చేసేందుకు ఇద్దరు యువకులకు 150 రూపాయల వంతున చెల్లిస్తున్నాడతను. తన కష్టార్జితంలోంచి మూడొంతులు సమాజ సేవకు ఉపయోగిస్తున్న దుర్గారావు... మనసుంటే చాలు ఎన్ని ఆటంకాలు ఎదురైనా సేవకు మార్గం దొరుకుతుందని నిరూపిస్తున్నాడు.

### పెన్షన్ డబ్బుతో సోమరితనం వస్తుందని...

దుర్గారావుకి ప్రతినెలా ప్రభుత్వం నుంచి పెన్షన్ రూపంలో 3 వేల రూపాయలు వస్తాయి. అయితే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఆ డబ్బుతో తనకు సోమరితనం అలవాటవుతుందనే భయంతో ఆ మొత్తాన్ని తనకు తారసపడే అవసరార్థులకు ఇస్తున్నట్టుగా దుర్గారావు తెలిపాడు. తనలాంటి వారికి పెన్షన్ ఇచ్చేకంటే జీవనో పాధి కల్పిస్తే బాగుంటుందని అతను అభిప్రాయ పడ్డాడు. విధివశాత్తు వైకల్యం ప్రాప్తించినప్పటికి కుంగిపోకుండా కృషి, పట్టుదల, చిత్తశుద్ధితో సమాజానికి ఉపయోగ పడేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని తనలాంటి వారికి దుర్గారావు సలహ ఇస్తున్నాడు.

### ట్రస్ట్ ఏర్పాటే లక్ష్యం...

జీవిత చరమాంకంలో ఉన్న ఏ ఆసరా లేని ఆనాధ వృద్ధులకు నీడనిచ్చి పిడికెడు మెతుకులు పెట్టాలన్నదే తన ధ్యేయమని దుర్గారావు చెబుతున్నాడు. ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి దాని ద్వారా వివిధ ప్రాంతాలలో పిల్లలు వదలివేసిన తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడతను. దుర్గారావు ఆశయం నెరవేరాలని కోరుకుందాం.



- శాఖమూరు శ్రీనివాస ప్రసాద్
ప్రభన్యూస్ బ్యూరో,
గుంటూరు.

# మొక్కకి చక్కని నేస్తం!

## కొబ్బరి పీచు కుండీలు





ఇప్పుడు మనం వాడే వస్తువులు ఏవైనా భూమిమీద సమర్థవంతంగా పనిచేస్తే చాలదు...అవి భూమికి హితంగా చక్కగా భూమిలో కలిసిపోయేలా కూడా ఉండాలి...ఇక్కడ కనబడుతున్న కొబ్బరిపీచుతో తయారైన కుండీలు అలాంటివే. ఈ కుండీలు పర్యావరణ హితమే కాకుండా వీటిలో మొక్కలను పెంచడం వలన చాలా లాభాలు ఉన్నాయి.

- ఈ కుండీల్లో పోసిన నీరు మొక్కకు మరీ ఎక్కువై పోకుండా...కొంతనీరు బయటకు వచ్చేస్తుంది.



- వీటిలో పెట్టిన మొక్కలకు చక్కగా గాలి తగులుతుంది.
- ఈ మొక్కలను బయటకు తీసి నేలలో పాతాల్సిన అవసరం లేదు...వాటిని కుండీతో సహా నేలలో పాతవచ్చు. కొన్నాళ్లకు కుండీ... మొక్కకు నేలకు ఎలాంటి హాని చేయకుండా నేలలో కలిసిపోతుంది.
- కొబ్బరిపీచు కుండీల్లో వేర్లకు ఎలాంటి ఆటంకం ఉండకపోవటం వలన అవి కుండీ బయటకు కూడా పెరుగుతాయి.
- ఈ కుండీల ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలు జింక్, కాపర్, ఐరన్, మెగ్నీషియం వంటివి కూడా అందుతాయి.
- కుండీల్లో పోసిన నీటిని కొబ్బరిపీచు పీల్చుకుని తడిగా ఉండటం వలన మొక్కలకు అధిక నీటికారణంగా సమస్యలు లేకపోవడమే కాకుండా అవి...నీరులేక ఎండిపోవటం కూడా ఉండదు.
- కొబ్బరి పీచు కుండీలు బరువు తక్కువగా ఉండటం వలన వీటిని డాబాపైన గార్డెనింగ్ కి ఉపయోగించవచ్చు.
- ఈ కుండీలు పాడైపోయినా పారేయకుండా నేలలో పాతటం వలన నేల సారవంతంగా ఉంటుంది.

# దినఫలాలు

**మేష రాశి**
పరపతి పెరుగుతుంది. సన్నిహితుల నుంచి శుభవర్తమానాలు. పనులు చకచకా సాగుతాయి. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలు సంతృప్తినిస్తాయి.

**వృషభ రాశి**
పనులలో తొందరపాటు వద్దు. దూరప్రయాణాలు, ఆర్థిక ఇబ్బందులు, రుణయత్నాలు దైవ దర్శనాలు, ఆరోగ్యభంగం. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగాలలో కొత్త చిక్కులు.

**మిథున రాశి**
బంధువులతో తగాదాలు, దూరప్రయాణాలు. అనుకున్న పనులలో ఆటంకాలు. విద్యార్థులకు కొంత నిరాశ. వ్యాపారాలలో చికాకులు. ఉద్యోగాలలో కొత్త బాధ్యతలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

**కర్కాటక రాశి**
అదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులు, శ్రేయోభిలాషుల సలహాలు స్వీకరిస్తారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వాహనయోగం. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగాలలో మరింత అనుకూలత.

**సింహ రాశి**
కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో మాటపట్టింపులు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

**కన్యా రాశి**
నూతన పరిచయాలు. శుభకార్యాల నిర్వహణ. వాహనయోగం. సంఘంలో ఆదరణ. పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వ్యాపారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి.

**తుల రాశి**
ఆర్థిక లావాదేవీలు అంతగా కలిసిరావు. పనుల్లో జాప్యం. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో వాదాలు. వ్యాపారాలలో అదనపు బాధ్యతలు. ఉద్యోగాలలో ఒత్తిడులు. ఆరోగ్య సమస్యలు.

**వృశ్చిక రాశి**
చేపట్టిన పనులలో విజయం. విందు వినోదాలు. సోదరులతో వివాదాలు తీరుతాయి. శుభవార్తలు వింటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగాలలో మరింత సానుకూలత.

**ధనూ రాశి**
విద్యార్థులకు కొత్త ఆశలు. కాంట్రాక్టులు దక్కుతాయి. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

**మకర రాశి**
కుటుంబసభ్యులతో వివాదాలు. ఆరోగ్యసమస్యలు. పనులు ముందుకు సాగవు. ఆర్థికపరిస్థితి అంతగా అనుకూలించదు. బంధువుల కలయిక. వ్యాపారాలు గందరగోళంగా ఉంటాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడులు.

**కుంభ రాశి**
వ్యవహారాలలో కొద్దిపాటి ఆటంకాలు. బంధువులతో విభేదాలు. ఆధ్యాత్మిక చింతన. ఆస్తి వివాదాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని మార్పులు ఉంటాయి.

**మీన రాశి**
వ్యవహారాలలో విజయం. శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం. సంఘంలో విశేష గౌరవం. ఆస్తి ఒప్పందాలు. వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగాలలో సమస్యల నుంచి విముక్తి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# చింతన



# శ్రమ యేవ జయతే

'శ్రమ యేవ జయతే' అన్న ఉపనిషద్వాక్యాన్ని అనుసరించి అహర్నిషలూ శ్రమించే రైతు, సైనికుడు ఇద్దరూ ఈ లౌకిక ప్రపంచంలో ఇతరుల కోసం జనించి త్యాగం చేసేవారే! అటువంటి వారి శ్రమను గౌరవించడం ముక్తికి ఒక మార్గం, ఏ రూపంలోనైనా అవినీతికి పాల్పడితే సైనికులని అవమానపరచినట్లే! తమ సుఖాల్ని త్యజించి ఆహారోత్పత్తికి రైతు, దేశమనే క్షేత్ర రక్షణకు సైనికుడు శ్రమిస్తున్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహిస్తే మనం ఎలా నడుచుకోవాలో అవగతమవుతుంది.

ప్రత్యక్షదైవం సూర్య భగవానుడు. ఆకాశమనే ఉపాధిలోనికి సృష్టికి కారణభూతమైన అగ్నిని అందిస్తే దానికి వాయువు తోడై వర్ష రూపంలో జలాన్ని మనకు అందిస్తోంది. ఇది ఆదిత్యుని గొప్ప ప్రకృతి విన్యాసం. జలం నుంచే భూమి ఉద్భవించింది అనేది వైదిక ప్రకటితం. పంచభూతాలతో ఈ చరాచర సృష్టినడుస్తోంది. ఇవి పరస్పరాధారాలు. ఆదిత్యుని ప్రసాదం అగ్ని, ఆకాశం, వాయువు, జలములను సమీకరించుకుని భూమిని సృజించింది. భూమి తిరిగి పంభూతాలను ఉపయోగించుకుని ఆహారాన్ని జనింపజేసింది. ఏ మాయా పదార్థమైనా భూమి నుంచే ఉద్భవించాలి. తిరిగి భూమిలోనే ఐక్యమవ్వాలి. భూమి జనింపజేసిన ఆహారాన్నే సమస్త జీవులూ అనుభవిస్తూ తిరిగి జీవులను జనింపజేస్తున్నాయి. అన్నం నుండే జీవం పుడుతుందనేది గీతాచార్యుని వాక్యం.

అన్నం మానవ దేహంలోని పంచకోశములలో ప్రవేశించి అంతిమంగా ధాతురూపంలోకి మారి వేరొక క్షేత్రంలో ప్రవేశించి పూర్వ వాసనలను అనుసరించి మానవ రూపం, వివిధ ఉపాధులను సృష్టిస్తోంది. భూమి నుంచే ఆహారం లభించడమనగా భూమియే ఆహారమని. భూమి ఆకాశంలో ఉండడం వల్ల ఆకాశానికి సంబంధించిన ఆహారం భూమి, సమస్త విశ్వంలోని నక్షత్ర గ్రహరాశులు. ఈ సత్యాన్ని విశ్లేషిస్తే మనకు ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యం గోచరమవుతుంది. అనంత అంతరిక్ష ఆకాశమే ఆ పరాత్పరుని ఉదరంగా భావించవచ్చు. అనంతమైన నక్షత్ర రాశులు, వాటి చుట్టూ పరిభ్రమించే గ్రహాలు, ఉపగ్రహాలు, కృష్ణబిలాలు సమస్తమూ విష్ణువు ఆహారమని గ్రహించాలి. ఈ అద్భుత భావననే 'విశ్వం విష్ణుః' అని విష్ణుసహస్రనామారంభం విశదపరచింది.

బ్రహ్మ స్వరూపమైన అన్నంపై జీవులన్నీ ఆధారపడి ఉన్నాయి. కాని ప్రస్తుత పరిస్థితిలో అన్నం ఎంతో నిర్లక్ష్యానికి గురవుతోంది. అన్నం విలువను కోల్పోయి వృధా అవుతోంది. అన్నార్తులకు అందటం లేదు. కారణం 'శ్రమ' అనే పదానికి అర్థం తెలియకపోవడం. ఈ భూమిపై అత్యంత ముఖ్యమైన వ్యక్తి ఆహారాన్ని ఉత్పత్తి చేసే రైతు. స్వేదాన్ని చిందించి, విత్తును నాటి, సొత్తును పైకి తీసేవాడే రైతు. అటువంటి రైతు, అతని శ్రమ రెండూ నిర్లక్ష్యానికి గురి కావడం అత్యంత ప్రమాదకర విషయం. అన్నాన్ని వ్యర్థం చేస్తే రైతును అవమానపరచినట్లే! ఇక్కడ అన్నమనగా అన్ని ఆహార పదార్థాలని అర్థం. 'శ్రమ యేవ జయతే' అన్న ఉపనిషద్వాక్యాన్ని అనుసరించి అహర్నిషలూ శ్రమించే రైతు, సైనికుడు ఇద్దరూ ఈ లౌకిక ప్రపంచంలో ఇతరుల కోసం జనించి త్యాగం చేసేవారే! అటువంటి వారి శ్రమను గౌరవించడం ముక్తికి ఒక మార్గం, ఏ రూపంలోనైనా అవినీతికి పాల్పడితే సైనికులని అవమానపరచినట్లే! తమ సుఖాల్ని త్యజించి ఆహారోత్పత్తికి రైతు, దేశమనే క్షేత్ర రక్షణకు సైనికుడు శ్రమిస్తున్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహిస్తే మనం ఎలా నడుచుకోవాలో అవగతమవుతుంది.

ఆహారాన్ని విస్తారంగా ఉత్పత్తి చేయాలని తైత్తరీయ ఉపనిషత్తు తెలియజేస్తోంది. కాని నేడు దానికి విరుద్ధంగా ఆహారాన్ని విస్తారంగా వ్యర్థపరుస్తున్నాం. పండిన పంటను సైతం నిల్వ చేసుకోలేకపోతున్నాం. అవసరమైన ప్రదేశాలకు సత్వరం రవాణా, పంపిణీ చేయలేకపోవడం దురదృష్టకరం. అన్నం పరబ్రహ్మ స్వరూపమనే భావన కలిగితే ఈ నిర్లక్ష్య ధోరణిని విడనాడతారు.

ఈ జగన్నాటకంలో పాత్రధారులైన మనం చివరి అంకం వరకూ నటించక తప్పదు. అంకం సుఖాంతం కావాలంటే సహనటులతో సామరస్యం తప్పదు. ప్రతి పాత్ర ఉన్నతమైనదే! అయితే ఈ పాత్రల పోషణ, రక్షణల కోసం సృష్టించిన ప్రధాన పాత్రలు రైతు, సైనికుడు. వీరికి ప్రాధాన్యత ఇవ్వక తప్పదు.

అన్నాన్ని పరబ్రహ్మగా స్తుతించాలి. ఆహారాన్ని విస్తారంగా ఉత్పత్తి చేయాలి. ఉత్పత్తిని చక్కగా నిక్షేపణ చేయాలి.

ఆహార స్వీకరణలో సాత్వికత కోల్పోకుండా జాగ్రత్తపడాలి. ఆహారాన్ని భగవంతునికి తప్పక నివేదన చేయాలి. నివేదనలో పవిత్రమైన ఆహారాన్ని స్వీకరించాలి. అన్నార్తులకు ఆహార వితరణ చేయాలి. అన్నం నుంచి జీవుడు, ఆత్మ నుంచి ప్రాణం జనించి, దేహాలను ఆశ్రయించి జీవన యాత్ర కొనసాగించడమే సృష్టివైచిత్రి. గమ్యం ఆత్మ ద్వారా పరమాత్మను చేరుకోవడం. 'నానాటి బ్రతుకు నాటకము' అన్న పదకవితాపితామహుడు అన్నమయ్య పదములో అర్థం ఇదే. ఈ బ్రతుకు నాటకంలో కైవల్యాన్ని పొందాలంటే శ్రమను గుర్తించాలి. అన్నాన్ని నిందించకూడదు. ఆహారాన్ని వ్యర్థపరచకూడదు. భగవంతునికి నివేదన చేసిన ఆహారం అమృతతుల్యంగా మారుతుంది. పూర్వజన్మ సుకృతం వలన లభించిన ఈ మానవ జన్మను పవిత్రంగా కొనసాగించి ఆ పరాత్పరునికి నైవేద్యం చేయడమే అమృతమయము.



వి.వి.ఎస్. కామేశ్వరరావు
9491171327

## సంక్షిప్త రామాయణం

# పంపా సరస్సు



మతంగ వనం పుష్పఫల వృక్షాలతో, నిత్యవసంత ఋతు శోభతో అలరారుతుతండడం రాముడు చూశాడు. సింహాలు, పులులు, ఎలుగుబంట్లు మున్నగు మృగాలు జాతి వైరం విడిచి, కలిసి మెలసి తిరగడం చూశాడు. చెవులకు ఇంపు కలిగించే పక్షుల కలకలారావాలను విని ఆనందించాడు. రామలక్ష్మణులు సప్త సాగర తీరంలో స్నానమాడి తర్పణం విడిచారు. అందువల్ల రాముని మనసులో అలజడి, దైన్యం తొలగి ప్రశాంతత చేకూరింది.

సుగ్రీవునితో స్నేహం కోసం రాముని మనసు తహతహలాడింది. రామలక్ష్మణులు అవిరామంగా ప్రయాణించి అల్లంత దూరం నుంచి పంపా సరస్సును చూశారు. ఎర్రతామరలు, నల్లకలువల శోభను దర్శిస్తూ, వారు ఆ సరస్సును సమీపించారు. రామలక్ష్మణులు ఆ సరస్సులో స్నానం చేశారు. పంపాసరోవర తీరం దానిమ్మ, చంద్ర, గన్నేరు, మద్ది, మర్రి, వేప, అశోక, మొగలి, గురువింద చెట్లతో జాజి, మల్లి, పొదరిండ్లతో శోభాయమానంగా ఉంది. శుకపికశారికాది పక్షుల కలకలారావాలు వీనుల విందు కలిగించాయి.

## కిష్కింధా కాండం

### శ్రీరామ సుగ్రీవుల మైత్రి

రామలక్ష్మణులు సుగ్రీవుని మైత్రిని కోరి, ఋష్యమూక పర్వత ప్రాంతానికి బయలుదేరారు. వసంతఋతు శోభతో అలరారుతున్న ప్రకృతి దృశ్యాలు రాముని విరహ తాపాన్ని అతిశయింపజేశాయి. రాముడు సీతతో గడిపిన మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ విలపిస్తున్నాడు. సీత చూపులు, సీత మాటలు, సీత ఆత్మీయత, సీత భక్తిశ్రద్ధలు, సీత ప్రేమానురాగాలు, సీత తనను సంతోషపెట్టడానికి పడే తపన, రాముని మదిలో మెదిలాయి. అందువల్ల వియోగ దుఃఖం దుర్భరమయింది. భార్య వియోగ దుఃఖంతో కృంగిపోతున్న రాముని, లక్ష్మణుడు పరిపరివిధాలుగా ఊరడించాడు. కాని రామునిలో ఉత్సాహం కనిపించలేదు. కబంధుని సూచన ప్రకారం సుగ్రీవునితో మైత్రి, సీత జాడ తెలుపగలదనే చిన్న ఆశ అతనిని ముందడుగు వేయిస్తున్నది.

రామలక్ష్మణులు ధనుర్ధారులై పంపా సరోవర తీరంలో తిరగడం సుగ్రీవుడు చూశాడు. సుగ్రీవుడు వారిని చూడగానే భయకంపితుడయ్యాడు. తన అన్న వాలి తనను చంపడానికి వారిని పంపాడేమో అనే సందేహం అతని హృదయాన్ని తొలిచింది. సుగ్రీవుడు భయ సందేహాలతో తన అనుచరులు పలువురి వద్దకు పరుగు తీశాడు. హనుమంతుడు, నలుడు, నీలుడు, తారుడు, ఈ నలుగురు గజ గజ వణకిపోతున్న సుగ్రీవుని చూసి కారణం అడిగారు. సుగ్రీవుడు తన సందేహం వారికి తెలిపాడు. సుగ్రీవుని అనుచరులు నలుగురు కొండ శిఖరాలు ఒక దానిపై నుంచి మరొక దాని మీదకు లంఘిస్తూ, అతనిని అనుసరించారు. హఠాత్తుగా వారి కలవరపాటు చూసి, తక్కిన వానరులు కొండల మీద నుండి లంఘిస్తూ సుగ్రీవుని చుట్టూ చేరారు. అందరూ ధనుర్ధారులైన రామలక్ష్మణులను చూశారు. హడలిపోయారు.

హనుమంతుడు ఇతర వానరులను చూసి 'అర్థం లేని భయ సందేహాలతో మీరు ఉలికిపడుతున్నారు. వారి వల్ల మనకు ఏ ప్రమాదమూ రాదు. దానికి అవకాశం లేదు' అన్నాడు. తరువాత సుగ్రీవుని చూసి, 'రాజా! నీవు ఆందోళనపడడంలో అర్థం లేదు. వాలి ఇక్కడకు రాలేడు. వాలికి సంబంధించినవారు కూడా రాలేరు! ఇది నీకు సురక్షిత ప్రదేశం కదా! ఒక సామాన్య వానరుని వలె చపలచిత్తుడవై చింతిస్తున్నావు. ఒక్కసారి స్థిర మనస్కుడవై ఆలోచింపు'మన్నాడు. దానికి సుగ్రీవుడు బదులిస్తూ, 'ధనుర్ధారులైన ఆ తేజోవంతులను చూస్తే, ఎవ్వరు భయపడకుండా ఉండగలరు? వాలి వారిని పంపి ఉంటాడని నా ప్రగాఢ విశ్వాసం. కపటోపాయంతో శత్రువులను హతమార్చడంలో వాలి సిద్ధహస్తుడు. ఆంజనేయా! ఎదుటివారి ఇంగితాన్ని, కుట్రలను, కుతంత్రాలను పసికట్టడం నీకు వెన్నతో పెట్టిన విద్య! వారి వద్దకు పోయి, మాటలు కలిపి వారి ఆంతర్యాన్ని తెలుసుకో! వారు ఇక్కడ సంచరించడానికి కారణాలు తెలుసుకో! నీవు ఉపాయశీలివి కదా! వారి మాట తీరును, ముఖంలో హావభావాలను బట్టివారు సజ్జనులో, కాదో తెలుసుకో!' అన్నాడు. హనుమంతుడు సరేనన్నాడు.

కె. ఓబులేశు
9052847742

# దురాచారము, అనాచారము అంటే ఏమిటి?

శాస్త్రం చేయకూడదని చెప్పినదాన్ని చేయడం దురాచారం, చేయమని చెప్పినదాన్ని చేయకపోవడం అనాచారం. ప్రతి రోజు స్నానం చేయడం విధి, అలా చేయకపోవడం అనాచారం. మౌనంగా స్నానం చేయాలి అని విధి కావున మాట్లాడుతూ స్నానం చేయడం దురాచారం. కూర్చుని భుజించడం విధి, నిలబడి తినడం దురాచారం, కూర్చుని తినకపోవడం అనాచారం. మద్యపానం, మాంస భక్షణ చేయరాదన్నది ఆచారం, చేయటం దురాచారం. ఇలా ఆచారం వలన ధర్మం లభిస్తుంది. 'ఆచార ప్రభవో ధర్మః' అనునది భారత వాక్యం. ధర్మం ఆచరించుట వలన శ్రీమన్నారాయణుడు సంతోషిస్తే పుణ్యం ప్రాప్తిస్తుంది. అధర్మాన్ని ఆచరిస్తే స్వామి ఆగ్రహానికి గుర్రై పాపం ప్రాప్తిస్తుంది. ఈ పాప పుణ్యాల ఫలితాలు కొన్ని ఇక్కడే లభిస్తాయి, కొన్ని పరలోకంలో లభిస్తాయి. ఇప్పుడేమీ కావడంలేదని అధర్మాన్ని ఆచరిస్తే ఆపదలు కలిగినప్పుడు చేసిన అధర్మం జ్ఞాపకం రాక 'నేనేం పాపం చేశానని' అనుకుంటారు. అనాచారం, దురాచారం చేయటం పాపమే, ఆచారం పాటించడం పుణ్యం. పాపం అంటే ఎదుటి వారికి హాని చేయటమే కాదు తనకు హాని చేసుకోవడం కూడా పాపమే. అనాచారం తనకు తాను హాని చేసుకోవడం. దురాచారం తనకు, తన వారికి హాని చేసుకోవడం. దురాచారం కల వారితో కలిసి కూర్చున్నా, భోజనం చేసినా, పడుకున్నా, కలిసి మాట్లాడినా ఆ పాపం వారికీ వస్తుంది. అందుకే అనాచారాన్ని, దురాచారాన్ని మాని భగవంతుని అనుగ్రహాన్ని పొందాలి.



డా॥ కందాడై రామానుజాచార్య

# గో గీత

అనర్ఘేయా మహారాజ ద్విజా వర్ణేషుచోత్తమాః
గావశ్చ పురుష్వ్యఘ్ర గౌర్మూల్యం పరిలకల్ప్యతామ్
(మహాభారతం అను. 51/22)

బ్రాహ్మణులు మంత్ర రూపాలు,
గోవులు హవిష్య రూపాలు



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206



# ధనంజయా! నీ మోహాజ్ఞానాలు నశించాయా?

## భగవద్గీత

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ
త్వయైకాగ్రేణ చేతసా।
కచ్చిదజ్ఞానసమ్మోహః
ప్రణష్టస్తే ధనంజయ॥

అధ్యాయం- 18
శ్లోకం- 72

**తాత్పర్యం**
ఓ పార్థా! ధనంజయా! ఏకాగ్రమనస్సుతో దీనినంతటిని నీవు శ్రవణము చేసితివా? నీ అజ్ఞానము మోహము ఇప్పుడు నశించినవా?

**భాష్యం**
భగవంతుడు అర్జునునికి గురువుగా వ్యవహరిస్తున్నాడు కాబట్టి భగవద్గీత అంతా సరిగ్గా అర్థము చేసుకున్నాడో లేదో అని అర్జునుని ప్రశ్నిసున్నాడు. అతనికి అర్థము కాక పోయినచో ఏ అంశమైనా, అవసరమైతే భగవద్గీత అంతా అయినా తిరిగి వివరించుటకు సిద్ధముగా ఉన్నాడు. భగవద్గీత అనేది ఏదో ఒక కవిగానీ నవలా రచయిత గానీ వ్రాసినది కాదు. స్వయముగా భగవంతునిచే చెప్పబడినది. కాబట్టి ఎవరికైనా కృష్ణుని నుండి గానీ ఆయన ప్రతినిధి నుండి గానీ వినే భాగ్యము కలిగినచో, వారు అజ్ఞానాంధకారము నుండి బయట పడి తప్పక ముక్త జీవులగుదురు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యధాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes






మనం నిటారుగా నిలబడాలన్నా, పనులు చేసుకోవాలన్నా, చక్కగా నడవాలన్నా...దేనికైనా మన వెన్నెముక ఆరోగ్యంగా ఉండాలి. అందుకే వెన్నులో నొప్పి ఉంటే...జీవితమే కుంటుపడినట్టుగా అనిపిస్తుంది. వయసుని బట్టే కాకుండా ఇప్పుడు..ఎక్కువసమయం కూర్చుని చేసే ఉద్యోగాలు, పనిఒత్తిడి లాంటి కారణాల వలన కూడా చాలామంది దీనిబారిన పడుతున్నారు. నొప్పి తీవ్రమైతే...ఆపరేషన్ ఒక్కటే పరిష్కారమని చాలామంది భావిస్తుంటారు. అయితే...వెన్నునొప్పిని తగ్గించుకునేందుకు నేరుగా శస్త్ర చికిత్సకు వెళ్లకుండా ఇతర మార్గాలను ప్రయత్నించవచ్చు.... ఆ వివరాలు మీకోసం-

# డిస్కులు జారిపోయినా...

# శస్త్రచికిత్స అవసరం లేదు

గాయం వల్ల లేదా కొన్ని పనులు చేయడం వలన లేదా వైద్య పరిస్థితుల కారణంగా వెన్నునొప్పి వస్తుంది. వివిధ కారణాలతో ఏర్పడే వెన్నునొప్పి ఏ వయస్సులో ఉన్నవారినైనా కృంగదీస్తుంది. వయస్సు పైబడడం, శరీర ప్రక్రియల్లో లోటుపాట్లు, గాయాలు అసాధారణ శరీర నిర్మాణాలు వంటివి మీ వెన్నుముకను గాయపరుస్తాయి. ఇది వెన్నునొప్పికి దారితీయడంతో పాటు కాలిలో నొప్పి లేదా తిమ్మిరి ఏర్పడడం లేదా కాలు బలహీనపడడం వంటి ఇతర లక్షణాలకు దారితీస్తుంది.

వెన్ను నొప్పికి దారితీయడానికి బోని లూంబార్ స్పైన్ (పక్కటెముకల సమీపంలోని వెన్నెముక భాగం) లోని వెన్నుపూసల మధ్య డిస్క్‌లు, వెన్నెముక మధ్యలో ఉండే డిస్కులు, వెన్నెముక, డిస్కుల చుట్టుపక్కలగల లిగమెంట్స్ (కీలు బంధకాలు), వెన్నెముక, నరాలు, వెన్నెముకకు క్రింది వైపు చివర పిరుదలభాగం వద్ద ఉండే కండరాలు, కడుపులో కటి అంతర్గత అవయవాలు, వెన్నెముక చివర క్రింది భాగంలోని పక్కటెముకల చుట్టూ ఉన్న చర్మంతో ముడిపడి ఉండవచ్చు.

మీరు దీర్ఘకాలంగా వెన్నునొప్పితో బాధపడుతుంటే వెన్నెముకకు శస్త్రచికిత్స ఒక్కటే పరిష్కారం అని మీరు భావించవచ్చు. కొన్ని సార్లు శస్త్ర చికిత్స మాత్రమే ఏకైక చికిత్సగా ఉంటుంది. అయితే, ఇందుకు సంబంధించి ఒక ప్రోత్సాహకరమైన శుభవార్త కూడా ఉంది. అది ఏమిటంటే వెన్ను నొప్పి సమస్యలలో 90శాతం వరకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే మందులు, ఫిజియోథెరపీ, విశ్రాంతి పనులను చేసే పద్ధతిలో మార్పు చేర్పులను చేసుకోవడం ద్వారా ఈ సమస్యకు సరైన చికిత్సను అందించవచ్చు. వెన్నునొప్పిని తక్కువ అంచనావేయొద్దు.




## వెన్నునొప్పిని ఎప్పుడు తీవ్రమైనదిగా పరిగణించాలి?

శరీరపు క్రిందిభాగాలలోని కండరాల్లో నొప్పి, జ్వరంతో పాటు బలహీనత లేదా రాత్రిపూట లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు చెమట పట్టడం లేదా రాత్రిపూట అటువంటి పరిస్థితి మరింత తీవ్రంగా ఉండడం లేదా ఎలాంటి కారణం లేకుండానే బరువు తగ్గడం లేదా ఆకలి తగ్గిపోవడంతో పాటు కీళ్లనొప్పులు రావడం వంటి పరిస్థితి ఆరువారాలకు పైగా కొనసాగడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దానిని తీవ్రమైనదిగా పరిగణించాలి.

## శస్త్ర చికిత్స అవసరం లేని సాంప్రదాయ చికిత్స అంటే ఏమిటి?

వెన్నుముకలోని వెన్నుపూసల మధ్య కార్టిలాజినస్ డిస్క్ స్థానభ్రంశం చెందిన పరిస్థితులన్నింటికీ శస్త్ర చికిత్స అవసరం లేదు. చాలా వరకు దానిని మందుల ద్వారా విజయవంతంగా సరిచేయవచ్చు. వెన్ను నొప్పితో బాధపడుతున్న రోగులలో శస్త్రచికిత్స అవసరం లేకుండా ఫిజికల్ థెరపీ, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ వంటి నొప్పి నివారణ మందులు లేదా వెన్నునొప్పి నివారణలో ఉపయోగించే బ్రేసింగ్ ట్రీట్‌మెంట్ వంటివాటి ద్వారా ఆరువారాల నుండి ఆరునెలల వరకు ఒక ప్రయత్నం చేయవచ్చు. అప్పుడు కూడా తగ్గనట్లయితే చివరగా శస్త్రచికిత్స గురించి ఆలోచించాలి.

## వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకోవడం గురించి?

ఇతర పద్ధతుల్లో చికిత్సను అందించినప్పటికీ వెన్నునొప్పి లక్షణాల నుండి ఉపశమనం కనుక కలగనట్లయితే అప్పుడు వెన్నెముక శస్త్రచికిత్సను చేయించుకోమని రోగికి సిఫారసు చేయవచ్చు. నరాలు ప్రభావితమైన సందర్భాల్లో హెర్నియేటెడ్ డిస్క్, పార్శ్వపు గూని, స్పాండిలోలిస్తేసిస్ లేదా స్టెనోసిస్ వంటి కారణాలతో రోగి సరిగా నడవలేక పోతున్నట్లయితే శస్త్రచికిత్సకు వెళ్లడం మంచిది.

## ఓపెన్ సర్జరీ లేదా తక్కువ కోతతో స్పైనల్ సర్జరీ ఏది చేయించుకోవాలి?

సాంప్రదాయంగా, వెన్నెముక శస్త్రచికిత్సను ఓపెన్ సర్జరీగా చేయడం జరుగుతుంది. ఆపరేషన్ చేయాల్సిన స్థలాన్ని గుర్తించి అక్కడ శరీరంపై పొడగాటి కోతను పెట్టి దానిని తెరవడం ద్వారా వెన్నెముకలోని లోపాలను సర్జన్ గుర్తించగలుగుతాడు. అయితే ఇప్పుడు సాంకేతికత అనేది బాగా అభివృద్ధి చెందడం మూలాన మైక్రోస్కోప్ సాయంతో కీ హోల్ టెక్నిక్స్‌ను ఉపయోగించి ఎలాంటి వెన్నెముక సమస్యలనైనా తక్కవ కోతతోనే చికిత్స చేయగలగడం సాధ్యపడుతుంది. కీ హోల్ విధానంలో శరీరాన్ని ఎక్కువగా కోత పెట్టాల్సిన అవసరం ఉండదు. అంతే కాకుండా వెన్నెముక చుట్టూ ఉండే కండరాలు, సున్నితమైన కణజాలానికి ఎలాంటి హాని జరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. సాధారణంగా ఇంట్రాఆపరేటివ్ (శస్త్రచికిత్సా సమయం) తగ్గిపోవడం వలన మృదుకణజాలాన్ని సమర్ధంగా నిర్వహించడం వలన శస్త్రచికిత్స అనంతరం నొప్పి తక్కువగా ఉండడమే కాకుండా రోగులు త్వరగా కోలుకుంటారు.

## సాధారణ వెన్నెముక శస్త్ర చికిత్సా పద్ధతులు

**డిస్కెక్టమీ లేదా మైక్రోడిస్కెక్టమీ :**

హెర్నియేటెడ్ ఇంటర్‌వెటిబ్రల్ డిస్కును తొలగించడం. తద్వారా అణచివేయబడ్డ నరం నుండి ఒత్తిడి తొలగిపోతుంది. మైక్రోడిస్కెక్టమీ అనేది కీహోల్ పద్ధతి.

**లామినెక్టోమి :**

వెర్టిబ్రాపైన ఉన్న బోని ప్లేట్‌ను తొలగించడం ద్వారా స్పైనల్ కెనాల్‌లో స్థలాన్ని పెంచవచ్చు. తద్వారా ఒత్తిడిని తగ్గించవచ్చు.

**ఫోరామినోటమీ :**

నరాల మూలాలు సైన్స్ కాలమ్ నుండి నిష్క్రమించే బోన్ పాసేజ్‌వేను తొలగించడం.

**డిస్క్ రీప్లేస్‌మెంట్ :**

గాయపడిన డిస్కును కృత్రిమమైన దానితో భర్తీ చేయబడుతుంది.

**స్పైనల్ ఫ్యూజన్ :**

బోన్ గ్రాఫ్ట్ పద్ధతితో రాడ్‌లు లేదా స్క్రూలను ఉపయోగించి లేదా ఉపయోగించకుండా రెండు వెర్టిబ్రియలను కలిపే శస్త్రచికిత్సా పద్ధతి.

## వెన్నెముకకు గాయం కాకుండా కాపాడుకోవడం

వెన్నెముకను చక్కగా ఆరోగ్యంగా ఉంచుకోవడంలో కాస్త ఇంగితజ్ఞానాన్ని కూడా ఉపయోగించాలి. వెన్నెముకకు నష్టం జరగకుండా ఉంచడంలో మొట్టమొదటగా శరీరాన్ని సరైన భంగిమలో ఉంచడం అనేది చూసుకోవాలి. వంగినిలబడడం, అధికంగా బరువులెత్తడం వంటివాటిని నిరోధించి వీలున్నంతవరకు నిటారుగా నిలబడేందుకు ప్రయత్నించాలి.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా వెన్నెముకకు మేలు చేస్తుంది. వారానికి మూడులేదా నాలుగుసార్లు వ్యాయామం చేసే వారు వెన్నునొప్పికి గురయ్యే అవకాశం తక్కువ.

సెర్వికల్ స్పైన్‌లో డీజెనరేటివ్ డిస్క్ వ్యాధి తీవ్రతరం కావడానికి ధూమపానం కూడా ఒక కారణంగా ఉన్నట్లుగా నిపుణులు కనుగొన్నారు.

వెన్నెముక శస్త్రచికిత్స ఫలితాలను ధూమపానం అలవాటు ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే పొగతాగవారి కంటే పొగతాగని వారిలోనే చికిత్సా ఫలితాలు మెరుగ్గా ఉంటున్నాయి.

వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన అవసరం కలిగిన వారిలో ధూమపానం ఒక అలవాటుగా కనుక ఉన్నట్లయితే దానిని మానేందుకు ఇదే సరైన సమయం అని నేను వారికి సలహా ఇస్తాను. మీ వెన్నునొప్పి లేదా వెన్నెముక సమస్యలకు ఎలాంటి చికిత్స తీసుకోవాలో మీకు అవగాహన లేకపోతే వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడిని సంప్రదించి సరైన సలహాను పొందండి.



డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ స్పైన్ సర్జన్

# వర్షాకాలంలో కిడ్నీ వైఫల్యం?



మన శరీరం పని తీరులో కిడ్నీ అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. శరీర వ్యవస్థకు హానిచేసే వ్యర్థపదార్థాలను బయటకు పంపడంలో వడపోత గా అవి పని చేస్తాయి. శరీరం సాధారణ రీతిలో పని చేయడంలో ఎంతో ముఖ్యమైన బ్లడ్ ప్రెషర్‌ను నిర్వహించడంలో, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలోనూ ఇవి తోడ్పడుతాయి. వేడి నుంచి ఉపశమనం కలిగించి వర్షాకాలం ఆనందం కలిగించినప్పటికీ, అదే సమయంలో అది ఎన్నోసాంక్రమిక వ్యాధులను కూడా వెంట తీసుకువస్తుంది. సూక్ష్మజీవులు పెరిగేందుకు, మన శరీరంలోని కణాలను నాశనం చేసేందుకు అది కారణమవుతుంది.

ఈ సీజన్ లో ప్రబలిపోయే వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. ఈ కాలంలో వ్యాధులు ప్రబలిపోయేందుకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. కలుషిత నీళ్ళు, ఆహారం ఒకటైతే, మరో కారణం దోమలు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలు దోమలు వృద్ధి చెందేందుకు అనువైన ప్రాంతాలవుతాయి. మలేరియా, లెప్టోస్పిరియోసిస్ (మెదడు పొరల వ్యాధి), డెంగ్యూ, టైఫాయిడ్, అక్యూట్ గ్యాస్ట్రోఎంటరిటిస్, హెపటైటిస్ ఎ, హెపటైటిస్ ఇ లాంటివి రెనల్ ఇన్ ఫ్లమేషన్ కు ప్రధాన కారకాలుగా ఉంటాయి. అవి కిడ్నీ వైఫల్యానికి కూడా దారి తీసే అవకాశం ఉంటుంది.

ఈ సీజన్ లో ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు కిడ్నీ ఇన్ ఫెక్షన్ ను దూరం చేసుకునేందుకు ప్రతీ ఒక్కరూ పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు పరిశుభ్రంగా ఉండే పరిసరాలు హానికారక సూక్ష్మజీవుల పెరగకుండా చేస్తాయి. ప్రతి రోజూ తాకే లేదా ఉపయోగించే ఉపరితలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని మరగకాచి చల్లార్చి తాగాలి లేదా వాడేందుకు ముందు ఫిల్టర్ చేసుకోవాలి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలేందుకు తాగునీళ్ళే ప్రధాన వనరుగా ఉంటాయి. బయటి ఆహారపదార్థాలు అంత నాణ్యమైనవి కాకపోవచ్చు. కలుషిత నీళ్ళు ఆరోగ్యానికి హాని కలిగించే ఇతర పదార్థాలతో అవి తయారై ఉండవచ్చు. వ్యాధుల నుంచి దూరంగా ఉండాలంటే ఇంట్లో తయారు చేసిన తాజా ఆహారపదార్థాలనే తినాలి. ఇన్ఫెక్షన్లు వచ్చేందుకు అత్యంత సాధారణ వనరులు చేతులు. చేతులను సరైన విధంగా శుభ్రపర్చుకోవాలి. మరీ ముఖ్యంగా తినడానికి ముందు తిన్న తరువాత. మనం ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కూడా సూక్ష్మజీవులకు ఆవాసాలుగా ఉంటాయి.



వాటిని క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ముప్పును ఇది తగ్గిస్తుంది. తాజా పండ్లను అప్పటికప్పుడు ముక్కలుగా కోసుకొని తినాలి. ఎప్పు డో కోసిన ముక్కలను తినవద్దు. వాటిపై సూక్ష్మజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. పండ్లను తినే ముందు వాటిపై తొక్క తీసేయాలి. వాటిపై సూక్ష్మజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో వర్షంలో తడిచి ఆనందించాలని అనిపిస్తుంటుంది. అలా చేస్తే, ఇంటికి రాగానే ఒళ్ళు బాగా శుభ్రం చేసుకోవాలి. వర్షంలో తడిచి రాగానే వస్తువులను, వ్యక్తులను తాకవద్దు. అలా చేస్తే సూక్ష్మజీవులు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఇంటి వెలుపలే పాదరక్షలు వదిలేయండి. ఇంట్లోకి సూక్ష్మజీవులు ప్రవేశించకుండా జాగ్రత్తపడండి.

మీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే షుగర్ లెవల్స్ నియంత్రణ లో ఉండా లి. గ్లూకోజ్ అధిక స్థాయిలు ఈ వర్షాకాలంలో మీ కిడ్నీలను దెబ్బతీయవచ్చు.



డాక్టర్ అజిత్ కుమార్ సింగ్, నెఫ్రాలజిస్ట్

# ఆయుర్వేదంతో...

# క్యాన్సర్‌కు కళ్లెం!



వైద్యరంగం ఇంతగా అభివృద్ధి సాధించినా క్యాన్సర్ పట్ల సమాజంలో ఉన్న భయం పోలేదు. అది చికిత్సకు లొంగని వ్యాధి అనే చాలామంది భావిస్తుంటారు. అయితే క్యాన్సర్ వ్యాధిని కూకటివేళ్లతో సహా పెకిలించి వేసే చికిత్సా విధానాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఇది వ్యాపించకుండా నిరోధించే అవకాశం కూడా ఉంది. అయితే కొన్నిసార్లు క్యాన్సర్ చికిత్స మంచి ఫలితాలను ఇవ్వక పోవచ్చు. చికిత్స జరుగుతున్న సమయంలో చాలా మంది మందులను వేసుకోవడం ఆపేస్తా రు. చికిత్స పూర్తికాకమునుపే క్యాన్సర్‌ను వదిలిస్తే అది మళ్లీ వచ్చే ప్రమాదం ఉం టుంది. కొన్ని రకాల క్యాన్సర్‌ల విషయం లో చికిత్స ఆపేసినా వెంటనే ఏ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే అవి నెమ్మదిగా పెరుగుతాయి. అయితే కొన్ని రకాల క్యాన్స ర్‌లు మాత్రం త్వరగా వ్యాప్తి చెందుతాయి. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స మీద అనేక అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని రకాల క్యాన్సర్ల విషయంలో చికిత్సలకు భిన్న ఆప్షన్‌లు లేవు. వాటికి ఒకే రకమైన చికిత్స గత్యంతరం అవుతోంది. క్యాన్సర్ వచ్చిన వ్యక్తి అనేక పద్ధతుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ వ్యాధి ముదిరిపోయిన సందర్భాలు అనేకం. ఇటువంటి వారికి సరైన చికిత్స చేయిస్తే మంచి ఫలితాలు వస్తాయి. వారి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

చాలా కేసుల్లో ఎటువంటి ఫలితాలు కనిపించకపోతే వివిధ మార్గాల ద్వారా ఆయుర్వేద చికిత్స కోసం వస్తుంటారు. వాళ్లు క్యాన్సర్ మీద యుద్ధం చేయగలుగుతారు. ఫిజిషియన్‌ల సూచన మేరకు ప్రాచీన పద్ధతుల్లో చికిత్స చేస్తే సత్ఫలితాలు వచ్చినట్టు రుజువయ్యింది. మరణశయ్యపై ఉన్నవారు సైతం లేచి తిరగగలుగుతున్నారు. తమ జీవితకాలమంతా క్యాన్సర్ మీద పోరాటం చేస్తూనే ఉన్నారు. నాలు గోదశలో ఉన్న క్యాన్సర్ రోగులు సైతం బతికి బట్టకట్టగలుగుతున్నారు. మెటస్టాసిస్ లివర్, బ్రెయిన్, లంగ్స్, ప్రోస్టేట్, కిడ్నీ, సెర్విక్స్ తదితర క్యాన్సర్‌ల నుంచి బయటపడగలుగుతున్నారు. పాంక్రియాస్, గాల్‌బ్లాడర్, లంగ్స్, బ్రెస్ట్ అండ్ బ్లడ్ క్యాన్సర్‌లు వచ్చినప్పుడు రోగులు తమ ప్రాణాల మీద ఆశలు కోల్పోతారు. చాలా కేసుల్లో లివర్, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్, లంగ్స్, సెర్విక్స్, బ్రెస్ట్ బ్లడ్ క్యాన్సర్ రోగులు ఆశలు కోల్పోయినప్పటికీ చికిత్స చేయిస్తే సత్ఫలితాలు వస్తున్నాయి. కొందరైతే 5 నుంచి 8 ఏళ్లపాటు జీవిస్తున్నారు.

మరికొందరు 10 నుంచి 12 సంవత్సరాలు జీవించగలుగుతున్నారు. లివర్ క్యాన్సర్ వస్తే ఐదారు నెలలకు మించి బతకలేరు. లివర్ క్యాన్సర్ వస్తే ఇతర అవయవాలకు పాకుతుంది. మళ్లీ మామూలు స్థితికి రావడం కష్టం. మనదేశంలో చాలా క్యాన్సర్ హాస్పిటల్స్‌లో ఇటువంటి అనుభవాలు ఎదురయ్యాయి. అయితే ఆయుర్వేద చికిత్స వల్ల ఆశాజనకంగా వచ్చిన సందర్భాలు అనేకం.

## రాంశంకర్‌వర్మ కేసులో...

క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత రాంశంకర్ వర్మ డాక్టర్‌ను సంప్రదించాడు. ఆధునాతన చికిత్స అందించారు.కానీ ఆధునాతన చికిత్స వల్ల ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. క్యాన్సర్ అనేది సవాల్‌తో కూడుకుంది. మెటాస్టాటిస్‌క్యాన్సర్ వల్ల రాంశంకర్ వర్మ ఆశలు కోల్పోయాడు. ఆయుర్వేదం వల్ల బతికి బట్టకలిగాడు. ఏకంగా 20 ఏళ్లపాటు ఆరోగ్యంగా బతికాడు.

వర్మకు వచ్చింది అరుదైన క్యాన్సర్. మెటాస్టాసిస్ లివర్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయని తెలుసుకుని చికిత్స ప్రారంభించాడు. 1995 అక్టోబర్‌లో చికిత్స ప్రారంభమైంది. చికిత్స ప్రారంభానికి రెండు నెలల ముందు కడుపులో తీవ్ర నొప్పి వచ్చింది. నొప్పి బిళ్లలు వేసుకుని తాత్కాలికంగా ఉపశమనం పొందారు. కానీ కొన్ని రోజుల తర్వాత నొప్పి మళ్లీ ప్రారంభమైంది. అవే మందులు వేసుకోవడం ప్రారంభిం చారు. మళ్లీ ఉపశమనం లభించింది. అయితే మూడోసారి కడుపులో నొప్పి యథావిధిగా ఉంది. డాక్టర్‌ను సంప్రదిస్తే వైద్య పరీక్షలు చేశారు. ఆల్ట్రా సౌండ్ పరీక్షలు చేశారు. గాల్ బ్లాడర్ స్టోన్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఆపరేషన్ కోసం డాక్టర్లు సిఫారసు చేశారు. ఆపరేషన్ కోసం ఆగ్రా వెళ్లారు. ఇదే సమయంలో డాక్టర్‌కు ఒక అనుమానం వచ్చింది. క్యాన్సర్ ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందింది. సిటి స్కాన్ రిపోర్టులను చూశారు. లివర్ క్యాన్సర్‌తో బాటు గాల్ బ్లాడర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

ఈ వ్యాధి వచ్చినప్పుడు వర్మకి జ్వరం వచ్చేది. గొంతు బొంగురుపోయినట్టు అనిపించింది. అరికాళ్లు తెల్లగా మారిపోయాయి. రంగు నల్లగా మారిపోయారు. నరాలు మందంగా తయారయ్యాయి. బరువు బాగా తగ్గిపోయింది. కడుపులో మంట అనిపించింది. నిద్ర అనేది కరువ య్యింది. శ్వాస సంబంధ, గ్యాస్ సంబంధ సమస్యలు ఎక్కువయ్యాయి. వాంతులు అయ్యేవి. చనిపోవడం ఖాయం అని అనుకునే పరిస్థితి. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం నొప్పి లేదు. ఎటువంటి సమస్యలు లేవు. అనేక అధ్యయనాలు రుజువు చేశాయి చికిత్స ఎంత పురోగతి చెందిందో అని. క్యాన్సర్ మీద యుద్ధం చేయడం కష్టమేమికాదు అని రుజువయ్యింది. క్యాన్సర్ వచ్చిన రోగికి ఆత్మస్థయిర్యం కోల్పోకూడదు. ఒకసారి ఆత్మస్థయిర్యం కోల్పోతే తీవ్ర పరిణామాలు తలెత్తుతాయి.



డాక్టర్ గీతాంజలిమాడ (బిఎఎంఎస్,డిఇఎం)
కన్సల్టెంట్ ఆయుర్వేదాచార్య
డిఎస్ రీసెర్చ్ సెంటర్, హైద్రాబాద్
ఫోన్: 9100943142



# హిమాలయాలకు రజనీ



తనదైన నటనతో ప్రేక్షకాభిమానులను ఉర్రూతలూగించే సూపర్‌స్టార్ రజనీకాంత్‌లో ఆధ్యాత్మిక చింతనా మెండు. సినిమాకు, సినిమాకు మధ్యలో తనకు గ్యాప్‌ను దొరికి పుచ్చుకుని మరీ ఆయన హియాలయాలకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలోనే తాను నటిస్తున్న దర్బార్ చిత్రం చిత్రీకరణ పూర్తిచేసుకుని ఆదివారం ఆయన హిమాలయాలకు బయలుదేరారు. చెన్నై నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లి...అక్కడి నుంచి కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితర పుణ్యక్షేత్రాలను ఆయన సందర్శిస్తారని సమాచారం. అటుపిమ్మట హిమాలయాలకు పయనమై...అక్కడ కొద్దిరోజుల పాటు ధ్యానంలో కూర్చుంటారని...ఆ తర్వాత చెన్నై తిరిగి వచ్చిన తర్వాత దర్బార్ చిత్రం డబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిసింది. అలాగే శివ దర్శకత్వంలో రజనీ నటించబోయే నూతన చిత్రం కూడా అప్పుడే మొదలవుతుందని అంటున్నారు. ఇదిలావుండగా...రజనీ పూర్తిస్థాయి రాజకీయ రంగ ప్రవేశంపై కూడా చాలాకాలంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తున్న ఆయన ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తేలాల్సివుంది.

# దెయ్యం మేకప్‌లో కనిపించగానే...!

**రాజుగారి గది-3 చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని అందాల భామ అవికా గోర్ అంటోంది. ఉయ్యాల జంపాల, సినిమా చూపిస్త మావ, ఎక్కడికి పోతావు చిన్నవాడ వంటి హిట్ సినిమాలలో నటించిన ఆమె తాజాగా రాజుగారి గది-3 ద్వారా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. ఒక్కసారి ఆమె మాటల్లోనే ఆ విశేషాలు....**



అవికా గోర్

### గ్యాప్‌కు కారణం అదీ

ఎక్కడికి పోతావు చిన్నవాడ తర్వాత తెలుగులో కొన్ని చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. కానీ ఆ కథలు, పాత్రలు నన్ను అంతగా ఆకట్టుకోలేదు. పైపెచ్చు అదే సమయంలో రెండు టీవీ షోలు, అలాగే ఓ సినిమాలో నటించడం వల్ల టాలీవుడ్‌పై దృష్టిపెట్టలేకపోయాను. దానివల్లే టాలీవుడ్‌లో గ్యాప్ వచ్చింది.

### ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది

రాజుగారి గది-3లో తమన్నాను నటింపజేయాలని అనుకున్నామని...అయితే ఆమ డేట్స్ కుదరలేదని ఓంకార్‌గారు చెప్పారు. అయితే నా డేట్స్ కుదరడంతో నలభై నిమిషాలు నాకు కథను చెప్పారు. అది నచ్చడంతో వెంటనే ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించేశాను. పాత్రలో ఉత్తమ నటనను ప్రదర్శించే ప్రయత్నం చేశాను. సినిమాతో పాటు నా పాత్ర కూడా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని అనుకుంటున్నా.

### ఆ డ్రీమ్ నెరవేరింది

అలీ గారు నటించిన చాలా సినిమాలు చూశాను. ఎప్పటికైనా ఆయనతో కలిసి నేను నటించాలని మా అమ్మ అంటుండేది. అది ఓ డ్రీమ్‌లా మారింది. ఈ చిత్రం ద్వారా నాకు ఆ అవకాశం లభించింది. అలాంటి సీనియర్ నటులతో నటించడం ఓ కిక్ లాంటిది.

### భయపడుతూనే నవ్వుతారు

నాకు హారర్ సినిమాలంటే భయం. అందుకే ఆ సినిమాల జోలికి వెళ్లను, చూడను. ఈ చిత్రం స్క్రిప్టు చెప్పేటప్పుడు కూడా చాలా భయపడ్డాను. అయితే ఈ చిత్రం భయపెడుతూనే ప్రేక్షకులను నవ్విస్తుంది.

### ఇదీ నువ్వు అంటూ ఆటపట్టించారు

మొదటిసారి దెయ్యం మేకప్‌లో కనిపించగానే ...ఇదీ నువ్వు అంటూ నాన్న ఆట పట్టించారు. అయితే నేను దానిని కాంప్లిమెంట్‌గా తీసుకున్నా.

### తదుపరి సినిమా

తెలుగులో ఇంకో సినిమాకు సంతకం చేశాను. త్వరలోనే దాని వివరాలను తెలియజేస్తాను అంటూ ముగించారు.



# స్పోర్ట్స్ డ్రామా చిత్రంలో నాగశౌర్య

నాగశౌర్య కథానాయకుడిగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం సోమవారం ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్, ఎల్.ఎల్.పి., నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై నారాయణదాస్ నారంగ్, శరత్ మరార్, రామ్మోహన్‌రావు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. దీనికి అల్లు అరవింద్ క్లాప్ నివ్వగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశాన్ని దేవుడి పటాలపై చిత్రీకరించారు. ఈ సందర్భంగా హీరో నాగశౌర్య మాట్లాడుతూ, దర్శకుడు సంతోష్‌కు ఇది రెండో సినిమా. ఆరు నెలలుగా ఈ స్క్రిప్టు మీద పని చేస్తున్నాం. చాలాబాగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు. దర్శకుడు సంతోష్ మాట్లాడుతూ, స్పోర్ట్స్ డ్రామా చిత్రమిది. ఓ బయోపిక్‌లా అనిపిస్తుంది. ఇందులో సరికొత్త నాగశౌర్యను చూస్తారు. నాకు కూడా మంచి మైలేజ్ ఇచ్చే చిత్రమవుతుంది అని అన్నారు. నిర్మాతలలో ఒకరైన శరత్ మరార్ మాట్లాడుతూ, సుబ్రమణ్యపురం ఫేమ్ సంతోష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కథ అద్భుతంగా ఉంటుంది. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని చెప్పారు. సినిమాటోగ్రాఫర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ, నేను నాగశౌర్య నటిస్తున్న అశ్వద్ధామ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాను. ఆయన నటిస్తున్న మరో సినిమాకు అవకాశం రావడం ఆనందంగా ఉంది అన్నారు.

# అందమైన ప్రేమతో ఒరేయ్..బుజ్జిగా



రాజ్ తరుణ్

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఒరేయ్...బుజ్జిగా. కొండా విజయ్‌కుమార్ దర్శకుడు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ శనివారం నుంచి ఆరంభమైంది. ఈ విషయాన్ని నిర్మాత రాధామోహన్ తెలియజేస్తూ...నిరవధికంగా ఈ షెడ్యూల్ జరుగుతుందని చెప్పారు. అందమైన ప్రేమకథతో దీనిని దర్శకుడు ఎంతో చక్కగా మలుస్తున్నారని అన్నారు. గతంలో సున్నితమైన ప్రేమకథను గుండెజారి గల్లంతయ్యింది పేరుతో తెరకెక్కించి...మంచి విజయాన్ని అందుకున్న కొండా విజయ్‌కుమార్ మరో విభిన్నమైన కథతో ఈ తాజా చిత్రాన్ని మలుస్తున్నారు. నంద్యాల రవి చాలా మంచి డైలాగ్స్ రాశారు. సీనియర్ నటి వాణీవిశ్వనాథ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది అని అన్నారు.



మాళవిక నాయర్

రాజ్‌తరుణ్ సరసన మాళవిక నాయర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో నరేష్, పోసాని, అనీష్ కురువిళ్ళ, సప్తగిరి, రాజా రవీంద్ర, అజయ్‌ఘోష్, అన్నపూర్ణ, సిరి, జయలక్ష్మి, సోనియాచౌదరి, సత్య, మధునందన్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: ఐ.ఆండ్రూ, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, ఫైట్స్: రియల్ సతీష్, సమర్పణ: శ్రీమతి లక్ష్మీ రాధామోహన్.

# ఈ సినిమాతో చాలా నిజాలు బయటకు వస్తాయి

**- ఆపరేషన్‌గోల్డ్ ఫిష్ ప్రీ రిలీజ్ వేడుకలో ఆది**

ఆది సాయికుమార్, శషాచెత్రి, నిత్యానరేష్ ప్రధాన పాత్రలలో రూపొందిన చిత్రం ఆపరేషన్ గోల్డ్ ఫిష్. సాయికిరణ్ అడివి దర్శకత్వంలో ప్రతిభా అడివి, పద్మనాభరెడ్డి, ఆశిష్‌రెడ్డి, కేశవ్‌స్వరూప్, గ్యారీ బి.హెచ్, సతీష్ డేగల నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డా.రాజశేఖర్, జీవిత దంపతులు మాట్లాడుతూ, ఆది వండర్‌ఫుల్ ఆర్టిస్టు. చాలా కష్టపడతాడు. ఈ చిత్రంతో అతను విజయాన్ని అందుకుంటాడు. సైనికుల పోరాటాలు, మరణాల గురించి పేపర్లలో చదివి ఊరుకోవడం కాదు అంతకు మించి ఆలోచించాలనే ఆలోచనను ఇందులోని దేశభక్తి గీతం కలిగించింది. కమాండోగా ఆది గెటప్ చాలా బావుంది అని అన్నారు. హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ, కశ్మీర్ ప్రతికూల పరిస్థితులు, వాతావరణం మధ్యలో కథలో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించాం. కశ్మీర్‌లో కమాండో దుస్తులు ధరించి షూటింగ్ చేయడం చాలా గర్వంగా అనిపించింది. అక్కడ ఆర్మీ వాళ్లు చేస్తున్న త్యాగాలను కళ్లారా చూశాను. ఈ సినిమాతో చాలా నిజాలు బయటకు వస్తాయి. ఇందులో అర్జున్ పండిట్ పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్రకు నేను సరిపోతానని దర్శకుడు నమ్మారు. ఆయన నమ్మకం నిజమౌతుందని ఆశిస్తున్నా అని అన్నారు. దర్శకుడు సాయికిరణ్ అడివి మాట్లాడుతూ, కశ్మీర్‌లో 1990లలో పండిట్లకు ఏం జరిగిందో చాలామందికి తెలియదు. అబ్బూరి రవితో కలిసి పండిట్లను కలిసి పరిశోధనతో ఈ చిత్రం స్క్రిప్టు తయారు చేసుకున్నాం. మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ సినిమాను పూర్తి చేయగలిగాం అని అన్నారు. అబ్బూరి రవి మాట్లాడుతూ, ఎమోషనల్ విషయాలను సొమ్ము చేసుకోవడానికి ఈ సినిమా తీయలేదు. మాకు తెలిసిన విషయాలను పదిమందికి చెబుదామని ఈ సినిమా తీశాం. మేం ఎనిమిది కశ్మీర్ పండిట్ కుటుంబాలను మాత్రమే కలిశాం. మాకు ఎనిమిది కథలే తెలుసు. ఇంకా ఎన్ని వందల కథలు ఉన్నాయో...వాళ్ల బాధను చెప్పడానికి చేసిన చిన్న ప్రయత్నం. ఇందులో విలన్ ఘాజీ బాబా పాత్రలో నటించా. రచయిత అయిన నేను ఆ పాత్రను ఎలా చేశానో దర్శకుడితో పాటు ప్రేక్షకులే చెప్పాలి అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అడివి శేష్, అనీష్ కురువిల్లా, కృష్ణుడు, మనోజ్‌నందం, కార్తీక్ రాజు, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, నిర్మాతలు పద్మనాభరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



సాయి ధరమ్ తేజ్ సత్యరాజ్



# రెగ్యులర్ చిత్రీకరణలో...

సాయి ధరమ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం ప్రతిరోజూ పండగే. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దర్శకుడు మారుతి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జీఏ2, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అల్లు అరవింద్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ అనుంధాల నేపథ్యంతో వినోదాత్మకంగా ప్రతిరోజూ పండగే చిత్రాన్ని రూపొందిస్తున్నారు మారుతి. ఈ సినిమా ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుపుకుంటోంది. తదుపరి షెడ్యూల్ కోసం చిత్ర బృందం అమెరికా వెళ్లనుంది. మంగళవారం హీరో సాయిధరమ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ శుభాకాంక్షలు తెలియజేసింది.
విజయ్ కుమార్, రావు రమేష్, మురళీశర్మ, అజయ్, ప్రవీణ్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - థమన్, ఎడిటర్ - కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ - జయకుమార్, ఆర్ట్ - రవీందర్.



కృతి సనన్

# కామెడీ టైమింగ్‌లో...

అందాల భామ కృతి సనన్ తన కొత్త సినిమా హౌస్‌ఫుల్ 4 విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తన కెరీర్‌లో నటించిన భారీ చిత్రం కావడం, అక్షయ్ లాంటి తారలతో కలిసి నటించడంతో ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది కృతి. ఈ సినిమా ఫలితం తనను మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతోందీ సుందరి. కొన్నాళ్లుగా విజయాల నిచ్చెనలో పైకెక్కుతోంది కృతి. ఈ అందాల భామ బాలీవుడ్ చేరి ఐదేళ్లవుతోంది. ఆమె హీరోపతి అనే చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది. ఎలాంటి కుటుంబ నేపథ్యం లేకుండా వెండితెరకు వచ్చిన కృతి ఒక్కో విజయాన్ని అందుకుంటూ అగ్ర తారగా ఎదుగుతోంది. బరేలీకి బర్ఫీ ఘనవిజయం సాధించి, కృతికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. తాజాగా...లూకా చుప్పి ప్రేక్షకాదరణ దక్కించుకుని గొప్ప విజయాన్ని అందుకుంది. ఈ సినిమా వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు రాబట్టింది. లూకా చుప్పి విజయంతో కృతికి బాగా పేరొచ్చింది. ప్రస్తుతం హౌస్‌ఫుల్ 4, అర్జున్ పటియాలా సినిమాలు చేస్తున్న కృతి సనన్..సరోగసీ నేపథ్యంతో ఓ చిత్రంలో నటిస్తోంది. హౌస్‌ఫుల్ 4 గురించి కృతి సనన్ మాట్లాడుతూ...హాస్య పాత్రల్లో మెప్పించడం కష్టం అయితే కథలో మంచి సందర్భాలుంటే కొంత సులువవుతుంది. అక్షయ్ కుమార్‌కు కామెడీ టైమింగ్ చాలా ఎక్కువ. సెట్స్ లోనే కాదు బయట కూడా బాగా నవ్విస్తారు. అని చెప్పింది.

# యూత్ లక్ష్యంగా ఏడు చేపల కథ



టెంప్ట్ రవి (అభిషేక్‌రెడ్డి), భానుశ్రీ, ఆయేషాసింగ్, మేఘా ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం ఏడు చేపల కథ. ఎస్.జె.చైతన్య దర్శకత్వం వహించారు. రాకేష్‌రెడ్డి సమర్పణలో చరిత్ర సినిమా ఆర్ట్స్ పతాకంపై జీవీఎన్ శేఖర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ మొదటివారంలో విడుదలకానుంది. కాగా సందర్భంగా హైదరాబాద్‌లో ఈ చిత్రం టీజర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా నిర్మాత శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ చిత్రకథను ఏడాది కిందట శ్యామ్ చెప్పారు. ఇందులో యూత్‌కి ఉపయోగపడే చక్కటి సందేశం ఉంటుంది. పద్నాలుగు మంది అమ్మాయిలతో దర్శకుడు ఈ చిత్రాన్ని ఎంతోబాగా తెరకెక్కించారు. కథకు వాళ్లు ఎంతో అవసరం. ఇక టెంప్ట్ రవి వేరే షూటింగ్‌లో ఉండటం వల్ల ఈరోజు ఇక్కడికి రాలేకపోయారు. సునీల్ పాత్ర ఈ చిత్రంలో గగుర్పొడుస్తుంది. బిగ్‌బాస్ భానుశ్రీ, అక్షర, యషిక...ఇలా చాలా మంది తెలుగు అమ్మాయిలకు అవకాశం ఇచ్చాం అని అన్నారు. దర్శకుడు శ్యామ్ మాట్లాడుతూ, చిన్న సినిమా లైఫ్‌ను నిర్ణయించేది టీజర్. అది విజయవంతమైతే సినిమా విజయం సాధించినట్లే. మా టీజర్ విడుదల కాగానే చాలామంది చాలా కామెంట్లు చేశారు. బూతు సినిమాలు తీసి డబ్బులు సంపాదిస్తున్నామని...కానీ అలాంటిదేమీ లేదు. ఈ టీజర్ ఇంతబాగా రావడానికి ప్రధాన కారణం టెంప్ట్ రవి. తన పాత్రలో చాలా ఫన్ ఉంటుంది. ఫ్యామిలీస్ కోసం కాకుండా కేవలం యూత్‌ను లక్ష్యంగా చేసుకుని తీసిన చిత్రమిది. అయితే బూతు సినిమా కాదు. మా తపన అంతా సినిమాలో కనిపిస్తుంది అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో దర్శకుడు వీరభద్ర, ఇషిక, అనుపమ, చిత్ర నటీనటులు మేఘ, అయిషాసింగ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076